

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు



గురువారం | 2-10-2025 | పేజీలు: 18 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 168

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా.7:11 తదుపరి ఏకాదశి, నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ.9:13 తదుపరి శ్రవణం, వర్జ్యం: మ.1:16-2:53, దుర్ముహూర్తం: ఉ.10:06-10:53, మ.2:50-3:37, అమృతఘడియలు: రా.11:00-12:38, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:09, సూర్యాస్తమయం: 5:59 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

విజయవాడ ● గురువారం 2 అక్టోబరు 2025

టాప్‌గేర్‌లో ఆటో

జీఎస్‌టీ, పండుగ సీజన్‌తో అమ్మకాల్లో వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ రంగంలో అమ్మకాలు జోరందుకున్నాయి. జీఎస్‌టీ 2.0 సంస్కరణలు అమలులోకి రావడం, నవరాత్రి పండుగ సీజన్, వినియోగదారుల విశ్వాసం పెరగడం వంటి అంశాలు సెప్టెంబర్ నెలలో డిమాండ్ పెరిగేందుకు దోహదపడ్డాయి. ఫలితంగా వాహన రంగంలో దాదాపు అన్ని ప్రముఖ కంపెనీలు రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేశాయి. దిగ్గజ సంస్థలైన మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఈ నెలలో బలమైన అమ్మకాలను ప్రకటించాయి. వాహన హోల్‌సేల్ అమ్మకాల్లో హ్యూండయ్ మోటార్ ఇండియాను అధిగమించి టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. దేశంలోని అతి పెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకీ రిటైల్ విక్రయాలు గత సెప్టెంబర్‌తో పోలిస్తే 27.5 శాతం పెరిగి 1.73 లక్షల యూనిట్లుకు చేరాయి.

- టాటా మోటార్స్ 60,907 కార్లు విక్రయించింది. గత సెప్టెంబరుతో పోల్చితే ఇది 47% అధికం మాత్రమే కాకుండా ఒక నెలలో గరిష్ఠ అమ్మకాల రికార్డు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	525
వరంగల్	502	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	115	విజయవాడ	119
వరంగల్	115	గుంటూరు	125
కరీంనగర్	115	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	104
కర్నూలు	115	నెల్లూరు	109
విశాఖపట్నం	122	అనంతపురం	109
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,18,640 ▲	1,08,750 ▲	1,60,000 ▼
విజయవాడ	1,21,000 ▲	1,15,000 ▲	1,49,500 ▲
విశాఖపట్నం	1,19,903 ▲	1,08,900 ▲	1,60,000 ▼
రాజమండ్రి	1,19,240 ▲	1,09,300 ▲	1,49,200 ▼
ప్రొద్దుటూరు	1,21,900 ▼	1,12,150 ▼	1,50,000 ▲
ముంబై	1,17,332 ▲	1,07,476 ▲	1,45,120 ▲

'రెపో' రేటు యథాతథం

యూపీఐ చెల్లింపులన్నీ ఉచితమే

జీడీపీ వృద్ధి అంచనా 6.8 శాతానికి పెంపు

- ద్రవ్యోల్బణ అంచనా 2.6 శాతానికి కుదింపు
- ఎగుమతిదారులకు ఊరట
- ప్రాథమిక ఖాతాలపైనా ఉచిత డిజిటల్ సేవలు

ముంబై: కీలక స్వల్ప కాలిక 'రెపో' రేటును ప్రస్తుతం ఉన్న 5.5 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) నిర్ణయించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన సమావేశంలో ఎంపీసీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఎంపీసీ రెపోరేటును యథాతథంగా 5.5 శాతం వద్ద కొనసాగించడం వరుసగా ఇది రెండో సారి. ఈ వడ్డీరేటు పైనే బ్యాంకులు, ఆర్‌బీఐ నుంచి స్వల్పకాలిక రుణాలు తీసుకుంటాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి, జీడీపీ వృద్ధి రేటు ఆశాజనకంగా ఉండడంతో ఎంపీసీ ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. సుంకాల పోటు ప్రభావంపై ఇంకా ఒక అంచనాకు రాకపోవడం కూడా ఇందుకు దోహదం చేసిందని తెలుస్తోంది.

ద్రవ్యోల్బణం మరింత కిందికే

అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి ఉన్నా, వచ్చే ఆరు నెలల్లోనూ మన దేశంలో ధరల సెగ పెద్దగా ఉండకపోవచ్చని ఆర్‌బీఐ భావిస్తోంది. ఆహార ఉత్పత్తుల ధరలు బాగా తగ్గడం ఇందుకు దోహదం చేయనుందని మల్హోత్రా చెప్పారు. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను గతంలో ప్రకటించిన 3.1 శాతం నుంచి 2.6 శాతానికి కుదిస్తున్నట్టు చెప్పారు. ఇదే సమయంలో ఈ ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటు అంచనాల్ని ఆర్‌బీఐ 6.5 శాతం నుంచి 6.8 శాతానికి పెంచింది.

షేర్ మార్కెట్‌కు ఊతం

ఎంపీసీ దేశీయ స్టాక్ మార్కెట్‌కు మేలు చేసే కొన్ని నిర్ణయాలు తీసుకుంది. తొలి పబ్లిక్ ఇష్యూల్లో (ఐపీఓ) ఇన్వెస్ట్ చేసే మదుపరులకు బ్యాంకులు ఇచ్చే రుణపరిమితిని ప్రస్తుత రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. ఈ వెసులుబాటు రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులకు (ఇన్విట్స్) కూడా వర్తిస్తుందని తెలిపింది. దీనికి తోడు లిస్టెడ్ కంపెనీల షేర్ల హామీపై బ్యాంకులు మదుపరులకు ఇచ్చే రుణ పరిమితిని ప్రస్తుత రూ.20 లక్షల నుంచి రూ.కోటికి పెంచాలని ప్రతిపాదిస్తున్నట్టు గవర్నర్ చెప్పారు. దేశంలో క్యాపిటల్ మార్కెట్ అభివృద్ధికి ఈ చర్య మరింత దోహదం చేస్తుందన్నారు.



యూపీఐ చెల్లింపు లావాదేవీలపై చార్జీలు విధిస్తారన్న వార్తలను ఆర్‌బీఐ గవర్నర్ తోసిపుచ్చారు. అసలు అలాంటి ప్రతిపాదనే తమ వద్ద లేదన్నారు. అయితే క్రెడిట్ కార్డులపై కొనుగోలు చేసే మొబైల్ ఫోన్ల ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోతే, బ్యాంకులు ఆ ఫోన్లను రిమోట్ పద్ధతిలో లాక్ చేసే విషయాన్ని మాత్రం పరిశీలిస్తున్నట్టు తెలిపారు. అనుకూల, ప్రతికూల అంశాలు అన్నిటిని కూలంకషంగా చర్చించాకే దీనిపై నిర్ణయం తీసుకుంటామని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వరరావు చెప్పారు.

ఎంపీసీ ఇతర ప్రధాన నిర్ణయాలు

- నో ఫ్రిల్స్ బ్యాంకు ఖాతాదారులకూ ఉచితంగా డిజిటల్ లావాదేవీల సేవలు.
- మరింత పటిష్ఠంగా అంబుడ్స్‌మన్ వ్యవస్థ.
- అంబుడ్స్‌మన్ పరిధిలోకి గ్రామీణ సహకార బ్యాంకులు.
- లిస్టెడ్ కంపెనీల విలీనాలు, కొనుగోళ్లకు రుణాలు సమకూర్చేందుకు దేశీయ బ్యాంకులకు అనుమతి.
- కొత్త పట్టణ సహకార బ్యాంకులకు లైసెన్సులపై త్వరలో చర్చా పత్రం.

ఎగుమతిదారులకు ఊరట

అమెరికా సుంకాల పోటును దృష్టిలో ఉంచుకుని ఎగుమతిదారులను ఆదుకునేందుకు ఎంపీసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విదేశీ బ్యాంకుల్లో ఐఎఫ్ఎస్‌సీ ఖాతాల్లో ఉన్న ఎగుమతి నిధులను భారత్‌కు బదిలీ చేసే గడువుని ప్రస్తుత నెల రోజుల నుంచి మూడు నెలలకు పెంచాలని నిర్ణయించింది. వస్తు దిగుమతి చెల్లింపుల లావాదేవీల గడువు కూడా నాలుగు నెలల నుంచి ఆరు నెలలకు పెంచుతున్నట్టు ప్రకటించింది.

రూపాయి అంతర్జాతీయీకరణ

రూపాయి చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ కొన్ని చర్యలు ప్రకటించింది. ఇందులో భాగంగా భూటాన్, శ్రీలంక, నేపాల్ దేశాల కంపెనీలకు అనుమతించిన దేశీయ బ్యాంకులు 'రూపాయి' రుణాలు ఇచ్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే దేశీయ బ్యాంకుల్లో స్పెషల్ రూపీ వోస్ట్రో అకౌంట్ (ఎస్ఆర్‌వీఏ) ఖాతాల్లో నిధులున్న విదేశీ బ్యాంకులు, ఆ నిధులను దేశీయ కంపెనీల రుణ పత్రాలు, కమర్షియల్ పేపర్స్‌లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించింది.

> ఎంపీసీ సమావేశం రెపోరేటు కంటే, అనేక ఇతర విధాన నిర్ణయాలకు ప్రాధాన్యత ఇచ్చింది. రిస్క్ ఆధారిత డిపాజిట్ ఇన్సూరెన్స్ ప్రీమియం విధానం ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న బ్యాంకుల లాభాలను మరింత పెంచుతుంది.
> – చల్లా శ్రీనివాసులు శెట్టి, చైర్మన్, ఎస్‌బీఐ

> ప్రాథమిక పొదుపు ఖాతాలున్న ఖాతాదారులకు కూడా మొబైల్, ఇంటర్నెట్ సేవలను విస్తరించడం మంచి చర్య. ఇది ఖాతాదారుపై సానుకూల ప్రభావం చూపిస్తుంది.
> – అజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఎండీ అండ్ సీఈఓ, ఐఓబీ

మార్కెట్‌కు ఆర్‌బీఐ జోష్

ముంబై: ఈక్విటీ మార్కెట్లో ఆర్‌బీఐ పాలసీ ఉత్తేజం నింపింది. వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగించడంతో పాటు ఈ ఏడాదికి వృద్ధిరేటు అంచనాను 6.8 శాతానికి పెంచడం సెంటిమెంట్ బలపడేందుకు దోహదపడింది. దీనికి తోడు ప్రపంచ మార్కెట్లలో సానుకూల ధోరణులు, క్రూడాయిల్ ధరల తగ్గుదలతో ఇన్వెస్టర్లు తక్కువ రేట్లకు అందుబాటులో ఉన్న నాణ్యమైన షేర్ల కొనుగోలుకు ఉత్సాహం చూపారు. ప్రధానంగా వడ్డీరేట్ల ప్రభావానికి లోనయ్యే రంగాల షేర్లు లాభాల బాట పట్టాయి. ఎనిమిది రోజుల వరుస నష్టాలకు తెర దించిన సెన్సెక్స్ 715.69 పాయింట్ల లాభంతో 80,893.31 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 225.20 పాయింట్ల లాభంతో 24,836.30 వద్ద ముగిసింది. ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో, రియల్టీ కౌంటర్లలో కొనుగోళ్లు జోరుగా సాగాయి. బ్యాంకెక్స్ 1.44% లాభపడి 62,401.58 పాయింట్లకు చేరింది. ఆటో ఇండెక్స్ 0.74%, రియల్టీ ఇండెక్స్ 1.11% వృద్ధిని నమోదు చేశాయి. రంగాల వారీ సూచీలన్నీ కూడా లాభాల్లో ముగిశాయి.

నేడు సెలవు
దసరా పర్వదినం, గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం మార్కెట్లకు సెలవు. ఈక్విటీ, బులియన్, ఫారెక్స్, కమోడిటీ మార్కెట్లు పనిచేయవు.

- అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి జీవితకాల కనిష్ఠ స్థాయిల నుంచి 9 పైసలు కోలుకుని 88.71 వద్ద ముగిసింది. మంగళవారం విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,327 కోట్ల విలువ గల షేర్లను విక్రయించారు.

ఎల్‌జీ ఇష్యూ ధర శ్రేణి రూ.1080-1140

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఈ నెల 7వ తేదీన ప్రారంభించనున్న రూ.11,607 కోట్ల విలువ గల ఐపీఓలో షేరు ధర శ్రేణిని రూ.1080-రూ.1140గా ప్రకటించింది.

పసిడి ధర రూ.1,21,100

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్లో ర్యాలీ కొనసాగుతోంది. బుధవారం ఢిల్లీలో 10 గ్రాములు మేలిమి (24 కేరట్స్) బంగారం ధర రూ.1,100 పెరిగి రికార్డు స్థాయిలో రూ.1,21,100కు చేరింది. కిలో వెండి ధర మాత్రం ఎదుగూ బొదుగు లేకుండా రూ.1,50,500 వద్ద కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర 3,895.33 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది.

టీసీఎస్‌లో 2,500 మంది ఔట్?

న్యూఢిల్లీ: ఐటీ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. టీసీఎస్ కంపెనీ పూణె యూనిట్‌లో 2,500 మందిని తీసివేసినట్టు జాతీయ స్థాయిలో ఐటీ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహించే నాస్కెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఉద్యోగుల సెనెట్ (ఎన్ఐటీఈఎస్) మహారాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని ఉద్యోగులను కాపాడాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్‌కు లేఖ రాశారు. వీరిలో ఎక్కువ మంది 40 ఏళ్ల పైబడిన మిడ్, సీనియర్ ఉద్యోగులని తెలిపారు. ఇలా ఉన్నపళంగా వీరిని ఉద్యోగాల నుంచి తీసివేయడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. టీసీఎస్ మాత్రం ఈ వార్తల్లో నిజం లేదని పేర్కొంది. కంపెనీ అవసరాలకు తగ్గ సాంకేతిక నైపుణ్యాలు లేని అతి కొద్ది మంది ఉద్యోగులను మాత్రమే నిబంధనలకు అనుగుణంగా తొలగించామని పేర్కొంది. ఉద్యోగ సంఘాలు మాత్రం టీసీఎస్ ఇటీవల దేశవ్యాప్తంగా దాదాపు 30,000 మంది ఉద్యోగులపై వేటువేసిందని చెబుతున్నాయి.

కర్ణాటకలో టీఏఎస్ఎల్, ఎయిర్‌బస్ హెలీకాప్టర్ ప్లాంట్

న్యూఢిల్లీ: యూరప్‌నకు చెందిన విమాన తయారీ దిగ్గజం ఎయిర్‌బస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) ఉమ్మడి భాగస్వామ్యంలో హెచ్125 హెలీకాప్టర్ల తుది అసెంబ్లీ లైన్ కర్ణాటకలోని వామగల్‌లో ఏర్పాటు చేయనున్నాయి. పూర్తిగా భారతదేశంలోనే తయారైన తొలి హెలీకాప్టర్ 2027 ప్రారంభంలో ఈ ప్లాంట్ నుంచి విడుదల కానున్నట్టు రెండు కంపెనీలు ఒక సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. గుజరాత్‌లోని వడోదరాలో సి295 హెలీకాప్టర్ల తయారీ తర్వాత వస్తున్న రెండో ప్లాంట్ ఇది. అలాగే దేశంలో పూర్తిగా ప్రైవేట్ రంగంలో ఏర్పాటవుతున్న తొలి హెలీకాప్టర్ అసెంబ్లీ లైన్ ఇది. ఇదే ప్లాంట్ నుంచి ఈ హెలీకాప్టర్ మిలిటరీ వెర్షన్ హెచ్125ఎం కూడా తయారు చేసే యోచన ఉన్నట్టు తెలిపాయి.

ఆర్‌సీ ప్లాస్టో నుంచి అన్‌బ్రేకబుల్ చైర్



నాగపూర్: ప్రముఖ గృహోపకరణాల తయారీ సంస్థ ఆర్‌సీ ప్లాస్టో సరికొత్త కుర్చీని (చైర్) మార్కెట్‌లో విడుదల చేసింది. యూవీ ప్రొటెక్షన్, యాంటీ ఆక్సిడెంట్ టెక్నాలజీతో రూపొందించిన ఈ అన్‌బ్రేకబుల్ కుర్చీ 10 సంవత్సరాల హామీతో లభిస్తుందని కంపెనీ తెలిపింది. సాధారణ కుర్చీలతో పోలిస్తే దీనికి ధృఢత్వం, మన్నిక ఎక్కువని పేర్కొంది. ప్రతి ఇంటి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ స్టైలిష్ కుర్చీని డిజైన్ చేసినట్టు తెలిపింది. ప్రతి నగరంలో కంపెనీ డీలర్లు, అధీకృత పంపిణీదారుల వద్ద ఈ కుర్చీలు లభిస్తాయి.

స్పోర్ట్స్



ముకేశ్‌కు స్వర్ణం

- తేజస్వినికి రజతం
- జూ. షూటింగ్ వరల్డ్ కప్

న్యూఢిల్లీ: తెలుగు షూటర్ ముకేశ్ నేలవల్లి మరోసారి అంతర్జాతీయ వేదికపై అదరగొట్టాడు. రెండ్రోజుల క్రితం 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో రజతం నెగ్గిన ఈ గుంటూరు కుర్రాడు.. టోర్నీకి ఆఖరిరోజైన బుధవారం 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఏకంగా స్వర్ణం సాధించాడు. ఓవరాల్‌గా 585 స్కోరుతో ముకేశ్ విజేతగా నిలిచాడు. అలెగ్జాండర్ కొవలెవ్ (తటస్థ అథ్లెట్) రజతం, భారత్‌కే చెందిన సాహిల్ చౌధురి కాంస్యం నెగ్గారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ తేజస్విని రజతం గెలిచింది. ఈ టోర్నీలో భారత్ 6 స్వర్ణాలు, 8 రజతాలు, 5 కాంస్యాలతో మొత్తం 19 పతకాలు నెగ్గి టాప్‌లో నిలిచింది.

ర్యాంకింగ్స్‌లో అభిషేక్ రికార్డు



దుబాయ్: ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 931 రేటింగ్ పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. 2020లో ఇంగ్లండ్ బ్యాటర్ డేవిడ్ మలన్ సాధించిన 919 రేటింగ్ పాయింట్ల రికార్డును 25 ఏళ్ల అభిషేక్ అధిగమించాడు. ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ రెండో ర్యాంక్‌లో, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ మూడో స్థానంలో కొనసాగుతుండగా, సూర్య కుమార్ యాదవ్ రెండు స్థానాలు దిగజారి ఎనిమిదో స్థానంలో నిలిచాడు. బౌలర్ల జాబితాలో వరుణ్ చక్రవర్తి 803 పాయింట్లతో ప్రథమ స్థానాన్ని మరింత పదిలం చేసుకోగా, కివీస్ బౌలర్ జాకోబ్ డఫీ రెండో స్థానంలో నిలిచాడు. మరో స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా అగ్రస్థానాన్ని కోల్పోయి రెండో ర్యాంక్‌లో నిలవగా, పాక్ ఆల్‌రౌండర్ సయీమ్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు.

ఆసీస్‌దే తొలి టీ20

కివీస్ పరాజయం

మౌంట్ మాంగనుయ్ (న్యూజిలాండ్): చాపెల్-హ్యాడ్లీ ట్రోఫీలో భాగంగా ఆతిథ్య న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఆసీస్ 5 వికెట్ల తేడాతో కివీస్‌ను ఓడించింది. మొదట కివీస్ 20 ఓవర్లలో 181/6 స్కోరు చేసింది. టిమ్ రాబిన్సన్ (106 నాటౌట్) అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఛేదనలో మిచెల్ మార్ష్ (85) అర్ధ సెంచరీతో సత్తా చాటడంతో ఆసీస్ 16.3 ఓవర్లలోనే 185/4 స్కోరు చేసి గెలిచింది.



గార్డ్‌నర్ శతక మోత

- కివీస్‌పై ఆసీస్ గెలుపు ● మహిళల వన్డే వరల్డ్‌కప్

ఇండోర్: ఆష్లే గార్డ్‌నర్ (115) శతక పోరాటంతో.. ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా బోణీ చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 89 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. తొలుత ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 326 రన్స్‌కు ఆలౌటైంది. జెస్ కెర్, తహూహు చెరో మూడు వికెట్లు పడగొట్టారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ఆసీస్ ప్రధాన బ్యాటర్లు విఫలం కావడంతో 129/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో ఆష్లే అద్భుత భాగస్వామ్యాలతో ఆదుకుంది. లిచ్‌ఫీల్డ్ (45), ఎలీస్ (33) ఫర్వాలేదనిపించారు. ఛేదనలో కివీస్ 43.2 ఓవర్లలో 237 పరుగులకే కుప్పకూలింది. సోఫీ డివైన్ (111) సెంచరీ వృథా అయింది. సదర్లాండ్, మోలినెక్స్ చెరో మూడు వికెట్లు దక్కించుకొన్నారు.

తొలి మ్యాచ్‌కు 23 వేల మంది..

గువహటి: ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత్, శ్రీలంక మధ్య జరిగిన ఆరంభ మ్యాచ్‌కు రికార్డుస్థాయిలో ప్రేక్షకులు హాజరయ్యారు. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌కు 22,843 మంది హాజరైనట్టు ఐసీసీ తెలిపింది. మహిళల క్రికెట్‌లో ఓ గ్రూప్ మ్యాచ్‌కు ఇంత మంది రావడం రికార్డని పేర్కొంది. గతేడాది దుబాయ్‌లో భారత్-పాక్ మధ్య జరిగిన మ్యాచ్‌కు అత్యధికంగా 15,935 మంది హాజరయ్యారు. దీన్ని భారత్-లంక మ్యాచ్ అధిగమించింది.



రోస్టన్ చేజ్

ఘనంగా ఆరంభించాలని..!

స్వదేశంలో గిల్‌కు మొదటి సిరీస్ — స్టార్ నెట్‌వర్క్‌లో ఉదయం 9.30 నుంచి

- ఫేవరెట్ భారత్
- నితీశ్‌కు చోటు దక్కేనా?
- వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ నేటినుంచే

అహ్మదాబాద్: స్వదేశంలో టెస్ట్ సిరీస్ అంటే భారత్ తిరుగుండదు. కానీ, న్యూజిలాండ్ చేతిలో 0-3తో ఘోర పరాజయం తర్వాత అంతా తారుమారైంది. అయితే, సొంతగడ్డపై కొత్త కెప్టెన్ శుభ్‌మన్ ఘనంగా బోణీ చేయాలనుకొంటున్నాడు. వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ గురువారం నుంచి జరగనుంది. ర్యాంకింగ్స్‌లో భారత్ నాలుగు.. విండీస్ ఎనిమిదో స్థానంలో ఉన్నాయి. విండీస్ ఫామ్ దృష్ట్యా ఈ మ్యాచ్‌లో భారత్ ఫేవరెట్ అనడంతో ఎటువంటి సందేహం లేదు. అయితే, కరీబియన్లు ఏమేరకు పోటీ ఇస్తారనేదే ఆసక్తికరం. ఆసియా కప్ ముగిసిన వెంటనే స్వదేశానికి చేరుకొన్న గిల్ టెస్ట్ మోడ్‌లోకి మారిపోయాడు. టీ20ల్లో గిల్ ఆశించిన రీతిలో రాణించలేకపోయినా.. ఇంగ్లండ్ సిరీస్‌లో తరహాలో మరోసారి చెలరేగాలనుకొంటున్నాడు. అంతేకాకుండా డబ్ల్యూటీసీ పాయింట్లు కూడా భారత్‌కు ఎంతో కీలకం. అయితే, మేఘావృతమైన వాతావరణానికి తోడు పిచ్‌పై పచ్చిక ఎక్కువగా ఉండడంతో టీమ్ కూర్పుపై సస్పెన్స్ కొనసాగుతోంది. రోహిత్, కోహ్లీ, అశ్విన్ రిటైర్మెంట్ తర్వాత స్వదేశంలో జరుగుతున్న తొలి సిరీస్ కావడంతో వారి స్థానాలను ఎవరు భర్తీ చేస్తారో చూడాలి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమతుల్యత కనిపిస్తోంది. అయితే, పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్, బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్‌లో ఎవరికి తుదిజట్టులో చోటు దక్కుతుందనేది చూడాలి. జడేజా, కుల్దీప్ స్పిన్ విభాగానికి నేతృత్వం వహించనుండగా.. కౌంటీలు ఆడి వచ్చిన వాషింగ్టన్ సుందర్ తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. కరుణ్ నాయర్‌పై వేటుపడడంతో.. వన్‌డౌన్‌లో సాయి సుదర్శన్ స్థానానికి ఢోకాలేదు. ఓపెనర్ కేఎల్ రాహుల్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. జైస్వాల్ కొంత బ్రేక్ తర్వాత బరిలోకి దిగుతున్నాడు. బుమ్రా, సిరాజ్ పేస్ భారాన్ని మోయనున్నారు. ఇటీవలే నేపాల్ చేతిలో ఓడిన విండీస్ పరిస్థితి మరింత దీనంగా ఉంది. గాయాల కారణంగా షామర్ జోసెఫ్, అల్జారీ జోసెఫ్ దూరం కావడంతో జట్టు కష్టాలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో రోస్టన్ చేజ్ సేన భారత్‌కు ఏమేరకు పోటీ ఇస్తుందో చూడాలి.



ప్రాక్టీస్‌లో జడేజా, గిల్

> ఏ వికెట్‌పైనైనా సత్తా చాటగలం. గత కొన్నేళ్లుగా భారత్‌లో టెస్ట్‌లు వేగంగా ముగుస్తున్నాయి. అయితే, ఇంగ్లండ్‌తో సిరీస్ తరహాలో హోరాహోరీగా మ్యాచ్‌లు జరగాలని కోరుకొంటున్నాం. – గిల్

జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్/పడిక్కల్, జడేజా, సుందర్, కుల్దీప్/ప్రసిద్ధ్ కృష్ణ, బుమ్రా, సిరాజ్.

వెస్టిండీస్: తేజ్‌నరైన్ చందర్‌పాల్, కెవలాన్ అండర్సన్, అలిక్ అథనజె, బ్రండన్ కింగ్, షాయ్ హోప్ (వికెట్ కీపర్), రోస్టన్ చేజ్ (కెప్టెన్), జస్టిన్ గ్రీవ్స్, కరే పియర్రీ, జోమెల్ వారికన్, అండర్సన్ ఫిలిప్/జోహన్నా లేన్. జేడెన్ సీల్స్

పిచ్/వాతావరణం

భారత్‌లో ఎక్కువగా స్పిన్ వికెట్లు కనిపిస్తుంటాయి. అయితే, ఈ టెస్ట్‌కు గ్రీన్ పిచ్ సిద్ధం చేయడం ప్రత్యేకం. పచ్చని వికెట్ పేసర్లకు అనుకూలించే అవకాశం ఉంది. వర్ష ఛాయలు ఎక్కువగా ఉన్నా.. మ్యాచ్ రద్దయ్యే స్థాయిలో ఉండదు.

కావాలంటే.. వచ్చి తీసుకెళ్లండి!

ట్రోఫీ విషయంలో మారని నఖ్వీ తీరు

దుబాయ్: ఆసియా కప్ ట్రోఫీని తనతో తీసుకెళ్లడంపై ఎంతగా విమర్శలు వస్తున్నా.. మొహిసిన్ నఖ్వీ తీరు మారడం లేదు. ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) చైర్మన్ అయిన నఖ్వీ.. దుబాయ్ హెడ్ ఆఫీస్‌లోని ట్రోఫీని భారత్ ఎప్పుడైనా తీసుకెళ్లవచ్చని ఎక్స్‌లో తెలిపాడు. అయితే, తన చేతుల మీదుగానే అందుకోవాలనే షరతు విధించాడు. 'ఏసీసీ చైర్మన్‌గా ఎప్పుడైనా ట్రోఫీని వారికి స్వాధీనం చేయడానికి నేను సిద్ధం. వారికి నిజంగా ట్రోఫీ కావాలంటే ఏసీసీ ఆఫీసుకు వచ్చి తీసుకోవాల'ని ఎక్స్‌లో పోస్టు పెట్టాడు. అయితే, ఏజీఎంలో బీసీసీఐను తాను క్షమాపణలు కోరినట్టు వచ్చిన వార్తలను నఖ్వీ ఖండించాడు. కాగా ఆసియాకప్‌లో తమ జట్టు చెత్త ఆటకు బాధ్యత వహిస్తూ నఖ్వీ రాజీనామా చేయాలని మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రీది డిమాండ్ చేశాడు.

నిన్న ఆసుపత్రి బెడ్‌పై.. నేడు పోడియంపై!

ప్రపంచ పారా అథ్లెటిక్స్



న్యూఢిల్లీ: వాంతులు, వడదెబ్బ కారణంగా స్పృహ కోల్పోయిన దశలో మంగళవారం ఉదయం ఆసుపత్రిలో చేరిన పోలెండ్ పారా అథ్లెట్ రోజా కొజాకోవ్‌స్కా.. మరుసటిరోజే ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో విజేతగా నిలిచి తన సంకల్ప బలాన్ని చాటింది. పూర్తి ఆరోగ్యంగా లేకున్నా, బుధవారం పోటీలకు వచ్చిన 36 ఏళ్ల రోజా.. మహిళల క్లబ్ త్రో ఎఫ్32 కేటగిరిలో ఏకంగా స్వర్ణం సాధించి సంచలనం సృష్టించింది.

నిరాశపరచిన తెలుగు అథ్లెట్ అకీరా

తెలుగు అథ్లెట్ అకీరా నందన్ బానోతుకు ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నిరాశ ఎదురైంది. 400 మీటర్ల టీ38 కేటగిరిలో ఫైనల్ చేరిన ఈ తెలంగాణ కుర్రాడు.. పతక వేటలో విఫలమయ్యాడు. మొత్తం ఎనిమిది మంది పోటీపడ్డ ఫైనల్లో అకీరా ఏడోస్థానానికి పరిమితమయ్యాడు.

హైదరాబాద్‌లో వాలీబాల్ లీగ్ సందడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియం ముస్తాబైంది. బుధవారం జరిగిన ట్రోఫీ ఆవిష్కరణలో పది జట్ల కెప్టెన్లు పాల్గొన్నారు. గురువారం జరిగే తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్‌తో ఆతిథ్య హైదరాబాద్ బ్లాక్ హాక్స్‌తో పోటీ పడనుంది.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు

గురువారం | 2-10-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

పెన్షన్లలో ఏపీ టాప్

ప్రతి వంద మందిలో 13 మందికి పింఛన్లు: ముఖ్యమంత్రి

- లబ్ధిదారుల్లో 59% మంది మహిళలే
- సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం
- ఆడబిడ్డలు కష్టపడకూడదనే దీపం 1, 2
- 45 రోజుల్లోనే బస్సుల్లో 10 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణం
- 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' నిధులు విడుదల
- తల్లికి వందనం పథకం కాదు.. పిల్లలపై ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడి
- 15 నెలల్లో 4.7 లక్షల మందికి ఉద్యోగాలు
- 10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయ్
- వీటితో 9 లక్షల ఉద్యోగాలు వస్తాయ్
- 2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి
- ఇకపై ఆకస్మిక తనిఖీలు చేస్తాం
- దత్తి సభలో సీఎం చంద్రబాబు ప్రకటన



విజయనగరం జిల్లా దత్తి గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుడు అప్పలరాజు పరిస్థితిని వివరిస్తూ కన్నీరు పెడుతున్న కుమార్తెను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

విజయనగరం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక పెన్షన్ల పంపిణీలో మన రాష్ట్రమే అగ్రస్థానంలో ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. దేశంలో మరే ప్రభుత్వమూ ఈ స్థాయిలో పింఛన్లు ఇవ్వడం లేదన్నారు. ప్రతి 100 మందిలో 13 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల్లో 59 శాతం మంది మహిళలేనని చెప్పారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేసిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం దత్తి గ్రామంలో బుధవారం

మిగతా 14వ పేజీలో...

22న దుబాయ్‌కి సీఎం

విశాఖ భాగస్వామ్య సదస్సుకు పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకే

18న ఆస్ట్రేలియాకు లోకేశ్

14

అమరావతికి కేంద్రీయ విద్యాలయం

రాష్ట్రానికి కొత్తగా 4 కేవీలు మంజూరు

ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన సీఎం

15

జీఎస్టీ-2.0తో రాష్ట్ర రాబడి పైపైకి!

కేంద్రంలోనూ పెరిగిన వసూళ్లు

దేశవ్యాప్తంగా 9.1% పెరుగుదల

రాష్ట్రంలో 4% మేర పెరిగిన ఆదాయం

శ్లాబులు మారితే తగ్గుతుందన్న నిపుణుల అంచనా తల్లకిందులు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' దసరా శుభాకాంక్షలు



సెలవు దసరా సందర్భంగా మా కార్యాలయాలకు గురువారం సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం (3-10-2025) సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం.

\- మేనేజింగ్ డైరెక్టర్

సోషల్ మీడియా కట్టడికి మంత్రుల కమిటీ 14

బంగాళాఖాతంలో వాయుగుండం 14

అమెరికా ప్రభుత్వం

షట్‌డౌన్




- 2018 తర్వాత ఇదే మొదటిసారి
- బడ్జెట్ బిల్లు ఆమోదానికి కాంగ్రెస్ నో
- నిధులు నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాలన్నీ బంద్

14

ఉద్యోగులకు దసరా, దీపావళి

కానుక

డీఏ 3 శాతం పెంచిన కేంద్రం



- దేశంలో కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

2

దేశంలో అత్యంత సంపన్న మహిళగా

రోష్ని నాడార్



2.84 లక్షల కోట్ల సంపదతో రికార్డు సృష్టించిన హెచ్‌సీఎల్ చైర్‌పర్సన్ 2

- 9.55 లక్షల కోట్లతో ప్రథమ స్థానంలో ముకేశ్ అంబానీ
- 8.14 లక్షల కోట్లతో రెండో స్థానంలో గౌతమ్ అదానీ

ఉద్యోగులకు దసరా, దీపావళి కానుక

డీఏ 3 శాతం పెంచిన కేంద్రం.. దేశంలో కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయాలు.. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు దసరా, దీపావళి పండగలకు కానుక ఇచ్చింది. కరవు భత్యం (డీఏ)ను 3 శాతం పెంచింది. ఈ పెంపు జూలై 1 నుంచి వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. అలాగే మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. మంత్రివర్గ సమావేశం వివరాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఏటా రెండుసార్లు డీఏను సవరిస్తూ ఉంటుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పింఛనుదారులకు ఈ కరవు భత్యాన్ని అందజేస్తారు. ఈ ఏడాది మార్చిలో డీఏను 2 శాతం పెంచారు. తాజాగా 3 శాతం పెంచడంతో 55 శాతంగా ఉన్న డీఏ 58 శాతానికి చేరనుంది. ఈ పెంపుతో 49 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదారులు లబ్ధి పొందనున్నారు. జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన డీఏ బకాయిలను అక్టోబరు నెల జీతంతో కలిపి దీపావళి కంటే ముందే అందిస్తామని వివరించారు. తాజా డీఏ పెంపు వల్ల కేంద్రంపై ఏటా అదనంగా రూ.10,083 కోట్ల భారం పడుతుందని తెలిపారు. కాగా, దేశంలో కొత్తగా 57 కేంద్రీయ విద్యాలయా(కేవీ)లను ప్రారంభించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కేవీలతో 86 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. 57లో ఏడింటి ఖర్చును కేంద్ర హోం శాఖ భరిస్తుందని, మిగిలిన వాటికి రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తాయని వివరించారు. కేవీల ఏర్పాటుకు రూ.5862.55 కోట్ల వ్యయం అవుతుందన్నారు. ఇప్పటి వరకు కేవీలు లేని జిల్లాలు, మావోయిస్టు ప్రభావిత జిల్లాలు, కొండ పాలిత రాష్ట్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కొత్త కేవీల్లో తెలంగాణ, ఏపీలకు నాలుగు చొప్పున కేటాయించారు. బయోమెడికల్ రిసెర్చ్ కెరీర్ ప్రోగ్రామ్ మూడో దశకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద రూ.1500 కోట్లతో 2000 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. గోధుమలకు కనీస మద్దతు ధరను క్వింటాకు రూ.160 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది గోధుమలకు ఎమ్మెస్పీ క్వింటాకు రూ.2425 ఉండగా.. 2026-27 సీజన్‌కు దాన్ని రూ.2585కు పెంచుతున్నట్లు కేంద్ర మంత్రి వైష్ణవ్ వెల్లడించారు. 2026-27 రబీ సీజన్‌కు సంబంధించి కుసుమలకు ఎమ్మెస్పీ క్వింటాకు రూ.600, ఎర్ర కంది పప్పుకురూ.300, ఆవాలురూ.250, శనగలు 225, బార్లీకిరూ.170 చొప్పున పెంచినట్లు తెలిపారు. జాతీయ గేయం 'వందేమాతరం' 150ఏళ్ల ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించినట్లు వైష్ణవ్ చెప్పారు.

లోకం తీరు



ఇద్దరు చిన్నారులను బలిగొన్న దగ్గు మందు!

- మరో 10 మంది పిల్లలకు అనారోగ్యం
- ఆ మందు సురక్షితమేనంటూ తాగిన ఓ వైద్యుడికి అస్వస్థత.. రాజస్థాన్‌లో ఘటన
- ఆ సిరప్ 22 బ్యాచ్‌లపై సర్కారు నిషేధం

జైపూర్, అక్టోబరు 1: దగ్గు మందు సిరప్ తాగి ఇద్దరు చిన్నారులు మృతి చెందగా.. మరో 10 మంది పిల్లలు అనారోగ్యం బారిన పడ్డారు. ఆ సిరప్ సురక్షితమేనని నిరూపించేందుకు తాగిన ఓ వైద్యుడూ అస్వస్థతకు గురై కొద్ది సేపు స్పృహ కోల్పోయారు. రాజస్థాన్‌లో గత రెండు వారాల్లో చోటు చేసుకున్న ఘటనలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. సికార్ జిల్లాకు చెందిన 5 ఏళ్ల నితీశ్ దగ్గుతో బాధపడుతుండగా సెప్టెంబరు 28న చిరానాలోని ప్రభుత్వాస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు అతడికి సిరప్‌ను ఇచ్చారు. రాత్రి అది తాగి పడుకున్న నితీశ్ ఉదయం లేవలేదు. దీంతో కంగారు పడిన తల్లిదండ్రులు అతడిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సెప్టెంబరు 22న మల్హాలో జ్యోతి అనే మహిళ తన ముగ్గురు పిల్లలకు ప్రభుత్వాస్పత్రి నుంచి తెచ్చిన అదే దగ్గు సిరప్‌ను తాగించింది. కాసేపటికే ఆ ముగ్గురూ స్పృహ కోల్పోగా.. ఇద్దరు వాంతులు చేసుకుని ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. 2 ఏళ్ల సామ్రాట్ జాతవ్ పరిస్థితి విషమించడంతో మరణించాడు. అదే నెల 24న బయానాలోని ప్రభుత్వాస్పత్రిలో ఓ మూడేళ్ల చిన్నారికి డాక్టర్ తారాచంద్ యోగి ఆ సిరప్‌ను ఇచ్చారు. అది తాగిన బాలుడు అస్వస్థతకు గురవ్వడంతో తల్లిదండ్రులు డాక్టర్‌ను నిలదీశారు. ఈ క్రమంలోనే ఆ సిరప్ సురక్షితమేనని నిరూపించేందుకు యోగి తాను తాగారు. ఆ తర్వాత కారులో బయలుదేరిన యోగి.. అందులోనే స్పృహ కోల్పోయారు. ఈ నేపథ్యంలో కేసన్ సంస్థ సరఫరా చేసిన 22 బ్యాచ్‌ల దగ్గు మందు సిరప్‌లను నిషేధించి.. వాటి పంపిణీని నిలిపేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మల్లికార్జున ఖర్గేకు పేస్‌మేకర్

- హార్ట్ బీట్‌లో వ్యత్యాసం ఉండడంతో అమర్చిన వైద్యులు

బెంగళూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. మంగళవారం సదాశివనగర్‌లోని నివాసంలో ఉండగా ఆయనకు శ్వాసకోశ సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు వెంటనే బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రికి తరలించారు. హార్ట్ బీట్‌లో వ్యత్యాసం ఉండడంతో వైద్యులు బుధవారం ఆయనకు పేస్‌మేకర్ అమర్చినట్టు ఖర్గే కుమారుడు, కర్ణాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. 'వయో సంబంధిత సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కారణంగా ఖర్గే ఆస్పత్రిలో చేరారు. హృదయ స్పందనలో తేడా ఉండడంతో దాన్ని సరిచేసేందుకు వైద్యులు ఆయన గుండెకు పేస్‌మేకర్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. ఒకరోజు విశ్రాంతి అవసరమని డాక్టర్లు సూచించారు' అని పేర్కొంటూ ప్రియాంక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. సీఎం సిద్దరామయ్య బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఖర్గేను పరామర్శించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. ఖర్గే ఆరోగ్యంగా ఉన్నారని, గురువారం డిశ్చార్జ్ అవుతారని చెప్పారు.

ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. 69మంది మృతి

సెబు(ఫిలిప్పీన్స్), అక్టోబర్ 1: సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో మంగళవారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 69మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.9గా నమోదైంది. సెబు ప్రావిన్స్‌లోని బోగో నగరానికి 19 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉందని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రధానంగా బోగో నగరంలో దాదాపు 90వేల మంది భూకంపం కారణంగా ప్రభావితమయ్యారు. మృతుల్లో దాదాపు సగం మంది ఈ నగరానికి చెందినవారేనని తెలుస్తోంది. భూకంపం ధాటికి అనేక ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాలు ధ్వంసమయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రహదారులు దెబ్బతిన్నాయి. పర్వత ప్రాంతాల్లో ఉన్న గ్రామాలపై కొండచరియలు విరిగిపడటంతో అక్కడికి చేరుకోవడానికి సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. శిథిలాల కింద చిక్కుకుపోయిన వారిని బయటకు తీసేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. బుధవారం ఉదయం వర్షం కురవడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. తొలుత సునామీ హెచ్చరికలు జారీ చేసిన ఫిలిప్పీన్స్ జియోలాజికల్ విభాగం ఆ తర్వాత వాటిని ఉపసంహరించుకుంది. ఇటీవల తుఫాను సృష్టించిన బీభత్సం నుంచి ఫిలిప్పీన్స్ ఇంకా కోలుకోక ముందే, భూకంపం రూపంలో మరోసారి ప్రకృతి విరుచుకుపడింది.

దేశంలోనే తొలి త్రీడీ ప్రింటెడ్ గ్రామీణ గృహం

- రూర్కీలో ప్రారంభించిన కేంద్ర మంత్రి పెమ్మసాని


రూర్కీలో త్రీడీ ప్రింటెడ్ గ్రామీణ గృహాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

న్యూఢిల్లీ, అక్టోబరు 1: దేశంలోనే మొట్టమొదటి త్రీడీ కాంక్రీట్ ప్రింటెడ్ గ్రామీణ గృహాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఉన్న సెంట్రల్ బిల్డింగ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ)లో ఆయన దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అర్హులైన వారందరికీ ఇళ్లు నిర్మించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం దిశగా ఇదొక కీలక ముందడుగని అన్నారు. టెక్నాలజీ సాయంతో గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నిర్మిస్తున్న ఈ త్రీడీ ప్రింటెడ్ ఇళ్లు.. పర్యావరణ అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన (పీఎంఏవై-జీ) పథకం కింద దేశవ్యాప్తంగా 3.85 కోట్ల ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో 2.87 కోట్ల ఇళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ ప్రయాణంలో సీబీఆర్ఐ సహకారం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా 'ఉత్తరాఖండ్‌లో గ్రామీణ గృహనిర్మాణం' పేరుతో రూపొందించిన పుస్తకాన్ని కూడా మంత్రి విడుదల చేశారు. 'అభివృద్ధి అంటే కేవలం ఇళ్లు నిర్మించడమే కాదు. అవి గౌరవం, స్వావలంబనతో వారి జీవితాల్లో వెలుగులు నింపేలా ఉండాలి' అని పెమ్మసాని పేర్కొన్నారు.

దేశంలో అత్యంత సంపన్న మహిళగా రోష్నీ నాడార్ మల్హోత్రా

- రూ.2.84 లక్షల కోట్ల సంపదతో రికార్డు
- రూ.9.55 లక్షల కోట్లతో ప్రథమ స్థానంలో ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ, అక్టోబరు 1: హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా దేశంలోనే అత్యంత సంపన్న మహిళగా నిలిచారు. ఈమేరకు బుధవారం ప్రకటించిన ఎం3ఎం హురున్ ఇండియా రిచ్-2025 జాబితాలో వెల్లడించారు. 2.84 లక్షల కోట్ల సంపదతో దేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో రోష్నీ, ఆమె కుటుంబం మూడో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో ఓ మహిళ మూడో స్థానంలో నిలవడం ఇదే తొలిసారి. అంతేగాక తొలి పది మందిలో నిలిచిన పిన్న వయస్కురాలి(44)గానూ ఆమె రికార్డు సృష్టించారు. కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన రోష్నీ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడమే కాకుండా బలమైన ఐటీ సేవల సంస్థగానూ తీర్చిదిద్దారు. రోష్నీ కేవలం తమ సంస్థ కార్యకలాపాలు చూడడమే కాకుండా శివ్ నాడార్ ఫౌండేషన్ ద్వారా దాతృత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా విద్య, సామాజిక సేవకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార రంగంలో కీలక పాత్ర వహిస్తోన్న మహిళల జాబితాలో వరుసగా నిలవడం ద్వారానూ రోష్నీ ప్రత్యేకత చాటారని హురున్ జాబితాలో పేర్కొన్నారు. 'టెక్నోక్రాటిక్ లీడర్‌షిప్' మాత్రమే కాకుండా సామాజిక సేవలో ముందుండడం ద్వారా ఆమె భారతీయ పారిశ్రామికవేత్తల్లో తన ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. కాగా ఈ జాబితాలో 100 మంది మహిళలు ఉండడం విశేషం. నైకా సంస్థకు చెందిన ఫల్గుణి నాయర్, బయోకాన్ కిరణ్ మజుందార్ షా కూడా ఇందులో నిలిచారు. భారత్‌లో సంపదను సృష్టించడంలో మహిళలది కూడా కీలక పాత్రేనని చాటారు. కాగా తన సంపద విలువ 6 శాతం తగ్గినా రూ.9.55 లక్షల కోట్లతో ముకేశ్ అంబానీ భారత సంపన్నుల జాబితాలో తొలి స్థానంలో నిలిచారు. రూ.8.15 లక్షల కోట్లతో గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం రెండో స్థానంలో ఉంది. సీరం ఇన్‌స్టిట్యూట్ సైరస్ పూనావాలా, ఆదిత్య బిర్లా గ్రూప్ అధిపతి కుమార మంగళం బిర్లా, నీరజ్ బజాజ్ ఆయన కుటుంబం, దిలీప్ సంఘ్వీ, అజీం ప్రేమ్‌జీ ఆయన కుటుంబం, గోపీచంద్ హిందూజా, రాధాకిషన్ దమానీ కుటుంబం హురున్ తొలి పదిమంది భారత సంపన్నుల జాబితాలో ఉన్నారు. దేశంలో సంపన్నుల మొత్తం సంపద విలువ రూ.167 లక్షల కోట్లుగా హురున్ పేర్కొంది. ఇది దేశ జీడీపీలో దాదాపు సగానికి సమానం. కాగా దేశంలో రూ.1000 కోట్లు లేదా అంతకు పైగా సంపద ఉన్నవారు 1,687 మంది. గత రెండేళ్లుగా దేశం ప్రతి వారానికి ఒక బిలియనీర్‌ని సృష్టిస్తోంది. చెన్నైకి చెందిన పెర్‌ప్లెక్సిటీ స్థాపకుడు అరవింద్ శ్రీనివాస్(31) రూ.21,190 కోట్ల సంపదతో ఈ జాబితాలో చోటు సంపాదించిన యువకుడిగా నిలిచారు.

చొరబాటుదారులతో జాగ్రత్త

'జనాభా'ను మార్చేయడమే వారి లక్ష్యం

- ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకల్లో ప్రధాని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 1 : వైవిధ్యం, సమైక్యత..భారత దేశ బలాలని, వాటికి చొరబాటుదారులు ముప్పుగా మారారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్చరించారు. వీరి ప్రయత్నాలు ఫలిస్తే దేశం బలహీనపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరుగుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది వేడుకల్లో బుధవారం మోదీ పాల్గొన్నారు. "జనాభాలో గణనీయమైన మార్పు కోసం చొరబాటుదారులు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల సామాజిక సామరస్యం దెబ్బతిని, అంతర్గత భద్రత ప్రమాదంలో పడుతుంది" అని మోదీ తెలిపారు. చొరబాటుదారులు ఈ దేశ యువత ఉపాధిని లాగేసుకోకుండా చూడటం, సోదరీమణులు, కుమార్తెలను వారినుంచి రక్షించుకోవడాన్ని ఈ మిషన్ లక్ష్యంగా ఆయన నిర్దేశించారు. జాతి నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ గొప్ప భూమికను పోషించిందని మోదీ అన్నారు. సంస్థ తన చరిత్రలో పలు దాడులకు గురయినప్పటికీ, దేశానికి ఎన్నడూ అపకారం తలపెట్టలేదని తెలిపారు. దేశమే ప్రథమం అనే భావనతో ఆర్ఎస్ఎస్ పని చేస్తోందని, పేదల జీవితాలను మార్చేందుకు కృషిచేసిందని కొనియాడారు. "దేశ ప్రజల్లో సామరస్య భావనను వ్యాప్తిచేయడం లక్ష్యంగా దేశమంతా ఆర్ఎస్ఎస్ విస్తరించి పనిచేస్తోంది. సమాజంలోని కుల,మత, జాతి బేధాలను నిర్మూలించడం ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు కార్యక్రమాలను చేపడుతోంది. సమ్మిళిత సమాజ సాధన ఈ సంస్థ ఆశయం" అని మోదీ వివరించారు. దేశం పట్ల అపార ప్రేమను కలిగిన ఆర్ఎస్ఎస్ బ్రిటిషర్ల అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిందని తెలిపారు. "జాతీయోద్యమ కార్యకర్తలకు సంఘ్ వలంటీర్లు ఆశ్రయమిచ్చారు. స్వయంగా ఆ సంస్థ నాయకులు కూడా జైలుపాలయ్యారు. సంస్థ స్ఫూర్తిని అణచివేయడానికి పలు ప్రయత్నాలు జరిగాయి. అబాంఢాలు వేస్తూ తప్పుడు కేసులు నమోదయ్యాయి. అయినా, ఆర్ఎస్ఎస్ ఈ దేశానికి అపకారం తలపెట్టలేదు. మంచి, చెడు.. రెండూ ఉండే సమాజంలో తన సుతాను భాగం చేసుకుని పనిచేస్తోంది" అని మోదీ వివరించారు. 'ఆర్ఎస్ఎస్ చీఫ్ మాధవ్ గోల్వాల్కర్‌పై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన ప్రశాంత చిత్తంతో ఒక మాట అన్నారు. 'కొన్నిసార్లు మన నాలుక పంటి కింద పడి బాధిస్తుంది. అందుకని పళ్లను మనం పీకేసుకోం' అని సెలవిచ్చారు" అని తెలిపారు. ఎమర్జెన్సీ రోజులను మోదీ గుర్తుచేసుకుంటూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ వ్యవస్థల పట్ల ఉన్న తిరుగులేని విశ్వాసమే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్‌ను పోరాడేలా చేసిందని తెలిపారు. కాగా, సంఘ్ శతాబ్ది వేడుకల సందర్భంగా రూ.వంద నాణెం, స్టాంప్‌ను ప్రధాని ఆవిష్కరించారు. నాణెం ఒకవైపు జాతీయచిహ్నం, రెండో వైపు భరతమాత చిత్రం ఉన్నాయి. నాణెంపై భరతమాత చిత్రం ముద్రించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని మోదీ తెలిపారు.

'పంద్రాగస్టు' ప్రసంగాన్ని గుర్తు తెస్తూ

ప్రధాని వ్యాఖ్యలు 'ఆగస్టు 15' ప్రసంగాన్ని గుర్తుకు తెచ్చాయి. ఈ సందర్భంగా 'డెమోగ్రాఫికల్ మిషన్'ను ప్రకటించారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ వేదికపైనా అదే చెప్పారు. బెంగాల్ అసెంబ్లీకి వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతాబెనర్జీ ఓటు రాజకీయాలు చేస్తున్నారని అప్పట్లో మోదీ దుయ్యబట్టారు. ఇందులోభాగంగానే ముస్లిం ప్రాబల్యం కలిగిన బంగ్లాదేశ్‌కు చెందిన చొరబాటుదారులను బలపరుస్తున్నారని ఆయన మండిపడ్డారు. మోదీ వ్యాఖ్యలను ఆనాడు అంతే దీటుగా తృణమూల్ కాంగ్రెస్ తిప్పికొట్టే ప్రయత్నం చేసింది. సరిహద్దు భద్రత కేంద్ర పరిధిపలోని అంశమని, అందులో ఉత్పన్నమయ్యే సమస్యలను కేంద్రమే పరిష్కరించాల్సి ఉంటుందని ఆనాడు మమతాబెనర్జీ స్పష్టం చేశారు.

ఆర్ఎస్ఎస్ సభకు హాజరుకావడం లేదు: సీజేఐ తల్లి కమల్‌తాయ్ గవాయ్

నాగ్‌పూర్, అమరావతి, అక్టోబరు1: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విజయదశమి సందర్భంగా నిర్వహించే సభకు తాను హాజరుకావడం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ మాతృమూర్తి డాక్టర్ కమల్‌తాయ్ గవాయ్ స్పష్టం చేశారు. మహారాష్ట్ర అమరావతిలో అక్టోబరు 5న జరిగే కార్యక్రమానికి హాజరౌతున్నట్లు వార్తలు వెలువడగానే విమర్శలు చెలరేగి వివాదంగా మారడంతో హాజరు కారాదని తాను నిర్ణయించుకున్నట్లు చెప్పారు. తమ కుటుంబం అంబేడ్కర్ సిద్ధాంతాన్ని అనుసరిస్తుందని, అంబేడ్కర్ వాదాన్ని వినిపించేందుకు తన భర్త దాదా సాహెబ్ కావాలనే వేరే సంస్థలు నిర్వహించే సభలకు హాజరయ్యేవారని గుర్తు చేశారు. ఈ నెల 5న జరిగే కార్యక్రమానికి హాజరైతే అదే వేదికపైనుంచి అంబేడ్కర్ వాదాన్ని వినిపించేందుకు అవకాశం లభించి ఉండేదన్నారు. ప్రస్తుతం అనారోగ్య కారణాలతో తాను చికిత్స తీసుకుంటున్నట్లు గవాయ్ చెప్పారు. అంతకు ముందు ఈ నెల 28న కమల్‌తాయ్ చేతిరాత అంటూ ఓ లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయింది. తాను ఆర్ఎస్ఎస్ సభకు హాజరవుతున్నట్లుగా తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఇదంతా ఆర్ఎస్ఎస్ చేస్తున్న కుట్ర అని రాసినట్లుగా ఆ లేఖలో ఉంది. అయితే ఇది నకిలీ లేఖ అని, అది తన తల్లి రాసినది కాదని ఆమె చిన్న కుమారుడు రాజేంద్ర గవాయ్ స్పష్టం చేశారు. దాదాసాహెబ్ గవాయ్ చారిటబుల్ ట్రస్ట్‌కు వ్యవస్థాపక చైర్‌పర్సన్‌గా ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తుండటంతో తన తల్లికి ఆర్ఎస్ఎస్ నేతల నుంచి ఆహ్వానం అందిందని, ముఖ్య అతిథిగా వెళ్లేందుకు ఆమె అంగీకరించారని ఆయన వెల్లడించారు.

నాకు నోబెల్ ఇవ్వకపోతే..

దేశానికే అవమానం!

- నాకివ్వమని అడగట్లేదు
- అమెరికాకు ఇవ్వమంటున్నా
- ఏడు యుద్ధాలను ఆపాం: ట్రంప్

వాషింగ్టన్, అక్టోబరు 1: నోబెల్ శాంతి బహుమతి కోసం కలవరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. "నాకు నోబెల్ ఇవ్వకపోతే.. అది అమెరికాకే అవమానం." అని అన్నారు. అంతేకాదు.. ప్రపంచ దేశాల్లో తలెత్తిన ఏడు యుద్ధాలను తాను ఆపిన తర్వాత కూడా.. నోబెల్ ఇవ్వకపోతే.. అగ్రరాజ్యాన్ని అవమానించినట్టేనని చెప్పారు. తాజాగా గాజా యుద్ధానికి కూడా ముగింపు పలికేలా తాను తీసుకుంటున్న చర్యలను ఆయన ఉటంకించారు. మంగళవారం క్వాంటికోలో సైనిక అధికారులతో ఆయన మాట్లాడుతూ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరో ఒక పుస్తకం రాసిన వ్యక్తికి ఇస్తారని, కానీ, ఈసారి అలా జరగదని భావిస్తున్నట్టు తెలిపారు. ఒకవేళ తనను కాదని ఏ రచయితకైనా ఇస్తే అది అమెరికాకు తీరని అవమానమేనని తేల్చి చెప్పారు. అంతేకాదు.. "నోబెల్‌ను నాకు ఇవ్వమని అడుగుతున్నట్టు భావిస్తున్నారు. నిజానికి నాకు ఇవ్వాలని కాదు. ఈ దేశానికి ఇవ్వాలని కోరుతున్నా. ఎందుకంటే.. గతంలో ఎప్పుడు జరగని పనులు ఇప్పుడు జరిగాయి. దీనిపై ఆలోచన చేయాలని చెబుతున్నా. ఇప్పుడు గాజా విషయాన్నే తీసుకుంటే.. ఇదేమంత తేలికకాదు. చాలా సంక్లిష్టం. అయినా.. సాధిస్తున్నాం. మధ్యవర్తిత్వం, ఒప్పందాల వంటి విషయాలు నాకన్నా ఎవరికీ ఎక్కువగా తెలియవు. నా జీవితమంతా వాటిపైనే ఆధారపడింది. ఇప్పటికే ఏడు సాధించాం. ఇప్పుడు ఎనిమిదోది కూడా సాధించబోతున్నాం. ఇదేమంత తేలికకాదని చెబుతున్నా. అందుకే నోబెల్ మనకే ఇవ్వాలని కోరుతున్నా." అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఫర్నిచర్‌పై ట్రంప్ సుంకాలతో

భారత్‌కు మేలే!

- ఎగుమతులపై ప్రస్తుతం 50% సుంకం
- తాజా నిర్ణయంతో 10-25శాతానికి..

న్యూఢిల్లీ, అక్టోబరు 1: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాల పరంపరలో ఫర్నిచర్ కూడా చేరినా.. ఇది మాత్రం భారత్‌కు లాభమే చేకూర్చనుంది. ఫర్నిచర్‌పై 10 శాతం, కిచెన్ క్యాబినెట్‌లు, అప్‌హోల్‌స్టర్డ్‌పై 25 శాతం చొప్పున సుంకాలు విధిస్తున్నట్లు పేర్కొంటూ సెక్షన్ 232ను ట్రంప్ తాజాగా జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 14 నుంచి ఈ సుంకాలు అమల్లోకి రానున్నాయి. అయితే ఈ నిర్ణయం భారత ఎగుమతులకు మేలు చేస్తుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. ప్రస్తుతం భారత ఫర్నీచర్‌పై 50 శాతం సుంకం అమల్లో ఉందని, ఇది 10-25 శాతానికి తగ్గుతుండడం గొప్ప ఊరట అని జీటీఆర్ఐకి చెందిన అజయ్ శ్రీవాస్తవ అన్నారు. ఫర్నిచర్, కిచెన్ క్యాబినెట్‌లపై సుంకాలు తగ్గుతున్న కారణంగా అమెరికన్ కొనుగోలుదారులకు భారత దిగుమతులే ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి 654.8 మిలియన్ డాలర్ల విలువైన ఫర్నిచర్ ఎగుమతులు జరగనున్నాయి.

ఖతార్‌కు నెతన్యాహు క్షమాపణ

- ఫోన్ పట్టుకుని మాట్లాడించిన ట్రంప్?
- చర్చనీయాంశంగా బ్లాక్‌అండ్‌వైట్ ఫొటో
- దోహాపై దాడులకు ఇజ్రాయెల్ విచారం
- మళ్లీ దాడులు చేయబోమని హామీ
- అమెరికా స్క్రిప్ట్‌ను చదివిన నెతన్యాహు



న్యూఢిల్లీ, అక్టోబరు 1: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఖతార్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బలవంతంగా క్షమాపణ చెప్పించారా? ట్రంప్ స్క్రిప్ట్‌ను యథాతథంగా ఫోన్‌లో చదివి ఖతార్ ప్రధానికి వినిపించారా? అనే ప్రశ్నలు ప్రపంచవ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నాయి. వైట్ హౌస్ విడుదల చేసిన ఫొటో ఒకటి ఆ ప్రశ్నలకు కారణమైంది. ఆ బ్లాక్ అండ్ వైట్ ఫొటోలో ట్రంప్ ల్యాండ్ లైన్ ఫోన్‌ను తన ఒళ్లో పెట్టుకుని ఉండగా, ఓ పేపర్‌లో రాసి ఉన్న స్క్రిప్ట్‌ను నెతన్యాహు చదువుతూ ఆ ఫోన్‌లో అవతలివారికి వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. వైట్ హౌస్ ఓవల్ ఆఫీస్‌లో సోమవారం ఆ ఫొటో తీసి బయటకు విడుదల చేశారు. ఖతార్ ప్రధానమంత్రి షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్‌రహ్మాన్ అల్-తానీతో నెతన్యాహు మాట్లాడుతున్నప్పుడు ఉద్దేశపూర్వకంగానే ఆ ఫొటోను తీసినట్లు చెబుతున్నారు. నెతన్యాహుతో భేటీ సందర్భంగా ఆ ఫోన్ కాల్‌ను ట్రంప్ చేయించారని, దోహాలో హమాస్ నేతలపై దాడి చేసినందుకు క్షమాపణ చెప్పించారని అధికార వర్గాలు చెప్పాయి. దోహాపై ఇజ్రాయెల్ దాడిలో ఐదుగురు చనిపోయిన విషయం తెలిసిందే. వారిలో సీనియర్ హమాస్ నేత ఖలీల్ అల్ హయ్యా కుమారుడు కూడా ఉన్నాడు. ముందస్తు సమాచారం లేకుండా ఇజ్రాయెల్ దాడి చేయడంపై అప్పట్లో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాంబులతో దాడి చేయడం పిరికి చర్య అని, అంతర్జాతీయ చట్టాలను గుడ్డిగా ఉల్లంఘించిందని ఇజ్రాయెల్‌పై ఖతార్ కూడా విమర్శలు చేసింది. దాడులు చేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదంటూ అప్పట్లో నెతన్యాహు కూడా తమ చర్యలను సమర్థించుకున్నారు. కాగా, గాజాపై కాల్పుల విరమణ చర్చల్లో ఈజిప్టుతో పాటు ఖతార్ కూడా కీలక మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో వాషింగ్టన్‌కు చర్చలకు వచ్చిన నెతన్యాహుతో ఉద్రిక్తతలు తగ్గించే ఉద్దేశంతో ఖతార్‌కు ట్రంప్ ఫోన్ కాల్ చేయించారు. ఈ సందర్భంగా పరిపరి విధాలుగా నెతన్యాహు విచారం వ్యక్తం చేశారని, ఖతార్ సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తామని, అలాంటి దాడులు మళ్లీ చేయబోమని హామీ ఇచ్చారని తెలుస్తోంది. అయితే ఈ మాటలు ఆయన సొంతంగా చెప్పినవా? లేక వైట్‌హౌస్ వర్గాలు బలవంతంగా చెప్పించాయా? అనేది చర్చనీయాంశమైంది.

ఖతార్‌పై దాడి జరిగితే అమెరికాపై చేసినట్టే

- ఉత్తర్వులు జారీ చేసిన ట్రంప్

వాషింగ్టన్, అక్టోబరు 1: ఖతార్ రక్షణకు పూర్తి బాధ్యతలు తీసుకుంటున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఖతార్‌పై ఎవరైనా దాడి చేస్తే దాన్ని అమెరికాపై జరిగినట్టుగా భావిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ సోమవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. హమాస్ నాయకులు ఉన్నారన్న కారణంతో ఖతర్ రాజధాని దోహాపై ఇటీవల ఇజ్రాయెల్ క్షిపణి దాడులు చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దాడులు చేయించినందుకు ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహుతో క్షమాపణలు చెప్పించారు కూడా. ఖతర్‌పై దాడికి దిగిన దేశంపై దౌత్య, ఆర్థికపర చర్యలతోపాటు అవసరమైతే మిలటరీ చర్యలకు దిగుతామని హెచ్చరించారు.

ట్రంప్ ప్లాన్‌కు తల ఊపం

- సవరణలు ఉండాలి
- హమాస్‌లో అంతర్గతంగా చర్చలు

దోహా, అక్టోబరు 1: గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన 20 సూత్రాల ప్రణాళికను హమాస్ యథాతథంగా ఆమోదించే పరిస్థితి కనిపించడం లేదు. ప్రత్యేక పాలస్తీనా దేశం ఏర్పాటుపై స్పష్టమైన హామీ లేకపోవడం, ఇతరత్రా అభ్యంతరాలు ఉండడంతో ప్రణాళికలో సవరణలు అవసరం ఉంటుందని భావిస్తోంది. మూడు నాలుగు రోజుల్లో తన ప్రణాళికను ఆమోదించాలని, ఒకవేళ తిరస్కరిస్తే 'విషాదకర ముగింపు' ఉంటుందని మంగళవారం ట్రంప్ తుది హెచ్చరిక జారీ చేశారు. ఈ నేపథ్యంలో అదే రోజు హమాస్ నేతలు ఖతార్, తుర్కియే, ఈజిప్టు అధికారులతో సమాలోచనలు జరిపారు. 'ఆయుధాలను విడిచిపెట్టడంతో పాటు హమాస్, ఇతర చీలిక వర్గాలను పూర్తిగా బహిష్కరించాలి' అన్న ప్రతిపాదనపై అభ్యంతరం చెప్పారు. గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ పూర్తిగా తొలగిపోయేలా అంతర్జాతీయ హామీలు ఉండాలని కోరారు. ఈ ప్రతిపాదనలపై మరింతగా చర్చలు జరపాల్సిన అవసరం ఉందని మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఖతార్ అభిప్రాయపడింది. ఇజ్రాయెల్ బుధవారం కూడా గాజాపై దాడులు చేసింది. దాడుల్లో 16 మంది ప్రాణాలు కోల్పోయినట్టు తెలిసింది.

పాక్ ప్రధానికి సెగ!

షెహబాజ్‌కు వ్యతిరేకంగా ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలు

- బలగాల కాల్పుల్లో పది మంది ఆందోళనకారుల దుర్మరణం

న్యూఢిల్లీ, అక్టోబరు 1: పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై నిప్పులు చెరుగుతూ రోడ్డెక్కారు. తమ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. గత మూడు రోజులుగా ఈ నిరసనలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆందోళనకారులపై భద్రతా బలగాలు మంగళ, బుధవారాల్లో జరిపిన కాల్పుల్లో 10 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. పౌరుల ప్రాథమిక హక్కులను అణచివేస్తున్నారన్న కారణంగా పాక్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంయుక్త అవామీ కార్యాచరణ కమిటీ(జేఏఏసీ) నిరసన చేపట్టింది. తాము ప్రతిపాదించిన 38 డిమాండ్లను అంగీకరించాలని కోరుతూ.. 3 రోజుల బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో మార్కెట్లు, దుకాణాలు, స్థానిక వ్యాపారాలు మూతబడ్డాయి. అదేసమయంలో నిరసనకారులు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ర్యాలీలు చేపట్టారు. అయితే, వీరిని అడ్డుకునేందుకు భద్రతా దళాలు కూడా అదేస్థాయిలో ప్రయత్నించాయి. ఈ క్రమంలో పాక్ రేంజర్లు కాల్పులకు దిగారు. ఈ ఘటనలో బుధవారం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. "70 ఏళ్లుగా అమలుకు నోచుకోని ప్రాథమిక హక్కుల కోసమే మేం నిరసన చేపట్టాం. మా హక్కులను మాకు కల్పించాలి. లేకపోతే ఊరుకునేది లేదు.." అని జేఏఏసీ నేత షౌకత్ నవాజ్ మిర్ తేల్చి చెప్పారు. ప్రస్తుతం తమ నిరసనకు సంబంధించి ప్లాన్-ఏ అమలు చేస్తున్నామని.. ప్రధాని షెహబాజ్ షరీఫ్ దిగిరాకపోతే ప్లాన్-డీ అమలు చేస్తామని, అది చాలా తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

బలోచిస్థాన్‌లో పాక్ డ్రోన్ దాడులు

బలోచ్ లిబరేషన్ ఆర్మీ, బలోచ్ లిబరేషన్ ఫ్రంట్ సంస్థలే లక్ష్యమంటూ పాకిస్థాన్ సొంత ప్రజలపైనే సైనిక చర్యలు ముమ్మరం చేసింది. ఖుజ్‌దార్ జిల్లాలోని జెహ్రీ ప్రాంతాన్ని ఈ సంస్థల ఆధీనం నుంచి తప్పించేందుకు భారీగా డ్రోన్లతో దాడులు చేస్తోంది. ఈ దాడులతో కొచావ్ ప్రాంతంలోని పంట పొలాలు ముఖ్యంగా పత్తి పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరుసగా 4 రోజులుగా ఈ దాడులు జరుగుతుండటంతో ఈ ప్రాంతంలోని ప్రజలకు ఆహారం, నీరు, ఇంధనం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జెహ్రీ ప్రాంతమంతా లాక్‌డౌన్‌లోకి వెళ్లిపోయిందని బలోచిస్తాన్ పోస్ట్ తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అష్టపదుల ఐరాస

'మానవాళి చరిత్రలో మున్నెన్నడు లేని రీతిలో మనం ఒక ఉమ్మడి భవితవ్యం ముంగిట ఉన్నాం. మనం కలిసికట్టుగా ఉంటేనే దాన్ని శ్రేయోదాయకంగా చేసుకోగలుగుతాం. ఇందుకు తోడ్పడేందుకే మనకు ఐక్యరాజ్యసమితి ఉన్నది' అని కోఫీ అన్నన్ పాతిక సంవత్సరాల క్రితం ఉద్ఘాటించారు. ఐరాస 80వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్న తరుణంలో ఆ ప్రపంచ సంస్థ ఏడవ ప్రధాన కార్యదర్శి మాటలు విశేష ప్రాసంగికత సంతరించుకున్నాయి. అతి భీకరమైన, అత్యంత వినాశనకరమైన ద్వితీయ ప్రపంచ యుద్ధం (1939–45)తో కుదేలయిపోయిన దేశాలు శాంతి, శ్రేయస్సులకై అలమటిస్తున్న సమయంలో అమెరికా నేతృత్వంలో విజ్ఞులు, విద్వత్‌పరులు, రాజనీతిజ్ఞుల దార్శనికతతో ఐక్యరాజ్యసమితి ఉనికిలోకి వచ్చింది. ఎనిమిది దశాబ్దాల ప్రస్థానంలో ప్రపంచ శాంతికి ఇతోధికంగా తోడ్పడడంతో పాటు, యుద్ధ బీభత్సాలు, ప్రాకృతిక విపత్తుల బాధితులకు మానవతాపూర్వక సహాయచర్యలు చేపట్టడంలోను మానవ ఆరోగ్యాన్ని హరించివేస్తున్న అంటువ్యాధులు, ప్రాణాంతక రోగాల నిరోధానికి, పర్యావరణ సమతుల్యత, మానవహక్కుల పరిరక్షణకు, సాంకేతికతల ఆదాన ప్రదానాలకు ఐరాస సార్థకమైన కృషి చేసింది. ప్రత్యేక లక్ష్యాలతో ఏర్పాటైన దాని అనుబంధ సంస్థలు ప్రపంచ వ్యాప్తంగా వందలాది కోట్ల ప్రజలకు ప్రాణరక్షకాలుగా ఉన్నాయి. మానవాళి భవిష్యత్తుకు ఒక ఆశాజ్యోతిగాప్రభవించిన ఈ సంస్థ ఇప్పుడు కాలం పదఘట్టనల కింద నలిగిపోతోంది.

21 వ శతాబ్ది ప్రపంచ పరిస్థితులకు ఐరాస వ్యవస్థ ముఖ్యంగా భద్రతా మండలి అనుగుణంగా లేకపోవడం, గాజా, ఉక్రెయిన్ యుద్ధాలు, సంస్థ వ్యవస్థాపక లక్ష్యాలను అగ్రరాజ్యాలు పూర్తిగా ఉపేక్షించడం మొదలైన ధోరణులతో అంతర్జాతీయ వ్యవహారాలలో ఐరాస ప్రభావశీలత, విశ్వసనీయత కోల్పోతోంది. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావంలో కీలక పాత్ర వహించి, దశాబ్దాల పాటు దాని ప్రభావశీలతకు ప్రధాన ఆలంబనగా ఉన్న అమెరికాయే ఇప్పుడు ఈ ప్రపంచ సంస్థ మనుగడ ఇక్కట్లకు కారణమవుతోంది. ఇరవవయో శతాబ్దిలో వివిధ దేశాలలో తలయెత్తిన ఉద్యమాలు సమస్త మానవాళి సంక్షేమాన్ని కాంక్షించాయి. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడుగా ఉన్న డోనాల్డ్ ట్రంప్ వైఖరి అందుకు విరుద్ధంగా ఉన్నది. ప్రపంచ శ్రేయస్సుకు దోహదం చేసే దృక్పథాన్ని అమెరికా ఎందుకు అనుసరించాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. 2017లో తొలిసారి, 2025లో మలిసారి ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే ఐరాసకు అమెరికా అందించే ఆర్థిక సహాయాన్ని గణనీయంగా తగ్గించివేశారు. కీలక మైన ఐరాస ఏజెన్సీల నుంచి అమెరికాను ఉపసంహరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే అమెరికా విధానాలు ఐరాస మనుగడనే దెబ్బ తీస్తున్నాయి.

ఈ విపత్కర పరిస్థితిని నివారించేందుకు ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ఈ ఏడాది మార్చిలో 'యుఎన్ 80 ఇనీషియేటివ్'ను ప్రారంభించారు. ఐరాసను ఆధునికీకరించి దాని ప్రభావశీలత, కార్యాచరణ సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంపొందించేందుకు ఉద్దేశించిన సమగ్ర సంస్కరణ ప్రయత్నమది. ఈ సంస్కరణ సంకల్పాలలో ప్రధానమైనది భద్రతా మండలి విస్తరణ. అభివృద్ధి చెందుతున్న దేశాల ఆకాంక్షలకు అనుగుణంగా మండలి విస్తరణ జరగని పక్షంలో ఐరాస తన ఉపయుక్తతను కోల్పోయే ప్రమాదమున్నది. ఇటువంటి సంభావ్యతను సైతం అమెరికా లక్ష్య పెట్టడం లేదు. భారత్ ఈ పరిస్థితుల్లో మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని కోరుకోవడం మాత్రమే కాకుండా ఐరాసలో తన ప్రభావ ప్రాబల్యాలను పెంపొందించుకోవడం యుక్తంగా ఉంటుంది. సంపద్వంతమవుతున్న భారత్ తన ఆర్థిక వనరులను ఉదారంగా ఐరాసకు వినియోగించి ఆ ప్రపంచ సంస్థను నిలబెట్టడం ద్వారా భారతీయ నాగరికతా ఆదర్శం వసుధైవ కుటుంబకంను అనుష్ఠానించడం ద్వారా మానవాళి శ్రేయస్సుకు తోడ్పడాలి.

ఐరాసను ఉనికిలోకి తీసుకురావడంలో నాటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రుమన్ బ్రిటిష్ కవి టెన్నిసన్ అభిలషించిన 'పార్లమెంట్ ఆఫ్ మ్యాన్' ఆదర్శం నుంచి స్ఫూర్తి పొందారని ప్రతీతి. ప్రస్తుత ఐరాస ఆ ఆదర్శానికి ప్రతిరూపంగా లేదు. తదుపరి ప్రధాన కార్యదర్శి నియామకంలో ఒక మహిళను, మరీ ముఖ్యంగా ఆఫ్రికన్ విదుషీమణి లేదా రాజనీతిజ్ఞురాలును ఎంపిక చేయడం 'మానవుని పార్లమెంటు' దిశగా మొదటి అడుగు కాగలదు.

సద్భావన నిర్మాణశక్తి


అది 1961వ సంవత్సరం. కబడ్డీ బాగా ఆడేవారు సంఘ్ శాఖలో ఉన్నారని, శరీర దారుఢ్యం కోసం వారు నిత్యం ఆటలు ఆడుతుంటారని తెలిసి అక్కడకు వెళ్లాను. ఆ సమయంలో నాకు స్ఫూర్తిప్రదాత అయిన భోగాది దుర్గాప్రసాద్ అక్కడే ఉన్నారు. నన్ను కూడా ఆడమని ప్రోత్సహించారు. అయితే అది బయటవారికి కాదేమో అనుకున్న నాకు, 'ఇక్కడ అలాంటి భేదభావాలేం ఉండవు, ఎవరైనా ఆడొచ్చు' అని తెలిపారు. ఆ స్ఫూర్తి నన్ను ఆకట్టుకుంది. తర్వాత సంఘ్ సభ్యునిగా మారి, మార్గదర్శనం పొందాను. ఈ అడుగు నన్ను విశాలమైన ఆలోచనల దిశగా ముందుకు నడిపింది. ఒక్క మాటలో చెప్పాలంటే జీవితంలో నా ఉన్నతికి సంఘం ఇచ్చిన సంస్కారం, సంఘం నేర్పిన జాతీయ భావం, సామాజిక ఐకమత్యం, వ్యక్తిగత సౌశీల్యం పెంచుకోవడమే కారణమని సగర్వంగా చెప్పగలను. నేనే కాదు ప్రధాని నరేంద్ర భాయ్ మోదీ మొదలుకుని ఎందరో కేంద్రమంత్రుల ఎదుగుదలకు సంఘ్ ఇచ్చిన సౌశీల్యం, ప్రేరణే ప్రధాన కారణం.



శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్ కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్

భగవద్గీతలో 12వ అధ్యాయంలోని ఈ శ్లోకంలో త్యాగం గొప్పతనాన్ని గురించి పరమాత్ముడు వివరించారు. 'అవివేకంతో కూడిన అభ్యాసం కంటే జ్ఞానం మేలు. జ్ఞానం కంటే ధ్యానం ఉత్తమం. ధ్యానం కంటే కర్మఫల త్యాగం మంచిది. ఆ త్యాగం వల్ల మనశ్శాంతి కలుగుతుంది.' అని ఈ శ్లోకం భావం.

ప్రపంచవ్యాప్తంగా వివిధ ఆశయాలతో కూడిన అనేక సంస్థలు ఉన్నాయి. అయితే వందేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) త్యాగాలకు సాటిరాగల మరో సంస్థ మనకు కనిపించదు. వేల సంవత్సరాల భారతీయ సామాజిక విలువలే ఆలంబనగా, సామాజిక జీవనంలో ఏర్పడిన లోటుపాట్లను అధిగమిస్తూ, జీవన విధానంలో దృఢత్వం, సమాజం కోసం అంకితమైన వ్యక్తిత్వంతో ఓ విలక్షణమైన కార్యదీక్ష కలిగిన క్రమశిక్షణాయుత సమూహం ఆరెస్సెస్ సొంతం. అందుకే, కాలగమనంలో అవరోధాలను, అణచివేతలను అధిగమిస్తూ... ప్రతికూల పరిస్థితుల్లో సైతం తన ప్రాబల్యాన్ని విస్తరిస్తూ, భారతీయ సంస్కృతిలోని సనాతన మూలాల నుంచి జాతీయవాద భావనతో ఆవిర్భవించి, మానవతా వాదాన్ని ఆవిష్కరిస్తోంది.



భారతీయ మూలాల్లో బలంగా విస్తరించిన సంస్కృతి విలువలను తెలియజేస్తూనే జాతీయ సమైక్యత, నైతిక విలువలు, సామాజిక సామరస్యం వంటి అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆరెస్సెస్ ఓ శతాబ్దాన్ని పూర్తి చేసుకుంది. ఆరెస్సెస్ కృషి కారణంగా దేశభక్తి ఒక ప్రాథమిక విలువగా అభివృద్ధి చెందిందని చెప్పడానికి గర్విస్తున్నాను.

భారతీయ మూలాల్లో బలంగా విస్తరించిన సంస్కృతి విలువలను తెలియజేస్తూనే జాతీయ సమైక్యత, నైతిక విలువలు, సామాజిక సామరస్యం వంటి అంశాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ఆరెస్సెస్ ఓ శతాబ్దాన్ని పూర్తి చేసుకుంది. సంఘ్ కృషి కారణంగా దేశభక్తి ఒక ప్రాథమిక విలువగా అభివృద్ధి చెందిందని చెప్పడానికి గర్విస్తున్నాను. 'సహనావవతు' అనే సూత్రాన్ని అనుసరించి లక్షలాది మంది కలిసి పనిచేసే స్ఫూర్తి మనసుల్లో విస్తరింపజేసింది. దేశభక్తి అంటే జెండా ఎగరేయడం, దేశభక్తి గీతాలు పాడడం, ఐక్యత ప్రతిజ్ఞ చేయడం కాదని, ఈ స్ఫూర్తి మన ప్రవర్తనలో ప్రతిబింబించి, సమాజంలో పరివర్తనకు బీజాలు వేయాలన్నది ఆరెస్సెస్ లక్ష్యం.

స్వాతంత్ర్యం ముందు కాలం నుంచి ఆరెస్సెస్ వ్యవస్థాపకులు డా.హెడ్గేవార్, ఆ తర్వాతి సంఘచాలక్ గురు గోల్వాల్కర్ దేశ సమగ్రతను కాపాడేందుకు విశేషంగా కృషి చేశారు. ఆరెస్సెస్ శాఖల్లో వ్యక్తిగత నైతిక విలువలకు, క్రమశిక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణ జీవనం గడుపుతూ, సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో అరమరికలు లేకుండా కలిసి పనిచేసే అలవాట్లను ప్రేరేపించారు. ఈ స్ఫూర్తి కారణంగానే వందలాది సంఘ్ ప్రేరేపిత సంస్థలు భారతదేశమంతటా పనిచేస్తున్నా ఎక్కడా అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు చెలరేగడం కనిపించదు. పైగా, వాటి పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం స్పష్టంగా కనిపిస్తుంది. కులం, వర్గం, మతం, ప్రాంతాలకు అతీతంగా ప్రజలు సమైక్యంగా ఉండాలని మాటలు చెప్పడం కాకుండా, ఆచరణలో ఆ విధంగా జీవించే వాతావరణం ఏర్పాటు చేయడంలో ఆరెస్సెస్‌ను మించిన మరో సంస్థ లేదని చెప్పవచ్చు.

యాభై ఏళ్ల క్రితం దేశంలో ప్రజాస్వామ్య హక్కులను హరిస్తూ విధించిన ఎమర్జెన్సీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ చీకటి అధ్యాయం. లక్షమందికి పైగా ప్రతిపక్ష శ్రేణులు, స్వేచ్ఛ కోసం నినదించిన విద్యార్థులు, యువత, ఆరెస్సెస్ వంటి సంస్థల కార్యకర్తలతో జైళ్లను నింపేశారు. వారిలో విద్యార్థి నాయకుడినైన నేనూ ఉన్నాను. హద్దుల్లేని ప్రభుత్వ నిర్బంధాలు కొనసాగాయి. 'ప్రాథమిక హక్కులు అమల్లో లేనందున ప్రభుత్వం ఎవరినైనా కాల్చి చంపినా కోర్టులు ప్రశ్నించలేవ'ని అంటూ ఢిల్లీ ఉన్నత న్యాయస్థానంలో ప్రభుత్వ అటార్నీ జనరల్ వాదించారంటే ఎటువంటి నిరంకుశ వ్యవస్థ కొనసాగిందో అర్థం చేసుకోవచ్చు.

దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించాక ఇందిరాగాంధీ నిషేధించిన తొలి ప్రజాసంస్థ ఆరెస్సెస్. 1975 జూన్ 30న నాటి ఆరెస్సెస్ సర్ సంఘచాలక్ బాలాసాహెబ్ దేవ్‌రస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అదే ఏడాది జూలై 4న ఆరెస్సెస్‌ను నిషేధించారు. దీంతో ఆరెస్సెస్ స్వయం సేవకుల ఇళ్లే ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమానికి కేంద్రాలుగా మారాయి. దేశంలోని ప్రధాన రాజకీయ పక్షాల నేతలు జైళ్లకు, ఇళ్లకు పరిమితమైనప్పుడు ఆరెస్సెస్ ప్రపంచంలోనే అతిపెద్ద నిరసన ఉద్యమం నిర్వహించింది. జైళ్లలో ఉన్నవారిలో అత్యధికులు ఆరెస్సెస్, సంబంధిత సంస్థలకు సంబంధించినవారే. నవంబర్, 1975లో జరిపిన సత్యాగ్రహ ఉద్యమంలో 45వేల మంది (ప్రభుత్వ లెక్కల ప్రకారం, ఇంకా ఎక్కువే ఉంటుంది) అరెస్ట్ అయితే, ఇతర సంస్థలకు చెందినవారు నాలుగోవంతు ఉన్నారు.

రాజకీయాల పరిధిని మించి చూడలేని వారికి ఆరెస్సెస్ కార్యపద్ధతి అర్థం కాదు. దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని చూస్తేనే ఈ సంస్థ సిద్ధాంతం అవగతమవుతుంది. ఆవిర్భావం నుంచి రాజకీయ అధికారం కోసం కాకుండా 'వ్యక్తి నిర్మాణం' కేంద్రంగా, ప్రజలందరి శ్రేయస్సు కోసం ఆరెస్సెస్ పనిచేస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలకు సహాయం చేయడానికి, సహాయ కార్యక్రమాలను నిర్వహించడానికి, పేద పిల్లలకు విద్య, వైద్య సదుపాయాలు అందించడానికి, వృద్ధులకు సేవ చేయడానికి స్వయం సేవక్‌లు అందించే సేవలలో వివక్ష మచ్చుకైనా కనిపించదు. 'దృఢమైన భారతదేశ నిర్మాణం అంటే అన్ని మతాల ప్రజలు' అని సంఘ్ విశ్వసిస్తోంది. ఈ విషయం ప్రస్తుత సర్ సంఘచాలక్ డా. మోహన్ భగవత్ మాటల్లో చెప్పాలంటే 'మనకు సమాజంలో సద్భావన అవసరం'.

సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిద్దుఃఖ భాగ్భవేత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

అన్న శాంతి మంత్రం స్ఫూర్తితో... ప్రజలందరి సుఖసంతోషాలు, ఆరోగ్యం, శుభాలు, ఆనందం కోసం ఆరెస్సెస్ భవిష్యత్ భారత నిర్మాణంలో, తిరిగి విశ్వగురువుగా దేశాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని ఆశిస్తున్నాను. ప్రత్యేకించి యువతరం సంఘ్ నుంచి స్ఫూర్తి పొంది, సంఘ్ శాఖలకు వెళ్లి, శరీర దారుఢ్యాన్ని, మానసిక వికాసాన్ని, సామాజిక చైతన్యాన్ని పొంది... వికసిత భారత నిర్మాణానికి చోదకశక్తులుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను.

▪ ముప్పవరపు వెంకయ్య నాయుడు
మాజీ ఉపరాష్ట్రపతి

(నేడు ఆరెస్సెస్ శతవార్షికోత్సవం)

విహార భూమిలో వలసల రగడ!

బిహార్ అంటే విహార భూమి. బుద్ధుడు విహరించిన నేల. రోజూ కిలోమీటర్ల కొద్దీ నడుస్తూ కుల, మతాలకు అతీతంగా మనిషికి గుర్తింపు ఇవ్వాలని బుద్ధుడు అవిశ్రాంతంగా బోధించిన జ్ఞానభూమి. మోక్షమైనా, నిర్వాణమైనా వ్యక్తి కృషి ద్వారానే లభిస్తుంది తప్ప గుడ్డి ఆరాధనతోనూ, యజ్ఞయాగాదులతోనూ రాదని బుద్ధుడు చెప్పింది బిహార్‌లోనే. మానవ విహారానికి ఎటువంటి ఆటంకాలు ఉండకూడదని రెండున్నర వేల ఏళ్ల క్రితం బుద్ధుడు చెప్పిన చోటే ఇప్పుడు వలసలు, విహారాలపై రాజకీయాలు చెలరేగుతున్నాయి. రెండు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే బిహార్‌లో వలసల సక్రమాలు.. అక్రమాల చుట్టూనే ప్రచారం కేంద్రీకృతం అవుతోంది. సాక్షాత్తూ ప్రధాన మంత్రి, హోంమంత్రి ఈ తరహా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గతంలో బెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బంగ్లాదేశ్ అక్రమ వలసలను ప్రధాన సమస్యగా చేసుకుని ప్రచారం హోరెత్తింది. ఇప్పుడు బిహార్ వంతు వచ్చింది.



కార్మిక వలసల్లేకుండా, వారి శ్రమలేకుండా ఈనాటి ఆర్థిక వ్యవస్థ రథచక్రాలు కదలవు. వనరులనూ, ఉద్యోగాలనూ కొల్లగొడుతున్నారంటూ వలస కార్మికులకు మతం రంగు పూయటం, విదేశీముద్ర వేయటం వైమనస్యాలను పెంచటానికి మాత్రమే పనికివస్తుంది. ఎన్ని ముద్రలు వేసినా వలసకార్మికులు చిందించిన చెమటచుక్కల ప్రవాహాల నుంచే మన సంపదలు పెరుగుతున్నాయి. మన నగరాలు కళకళలాడుతున్నాయి. మన భవనాల్లో సొగసులు కుదురుకుంటున్నాయి.

వలసలు సక్రమం అయినవైనా, అక్రమం అయినవైనా బిహార్ వాటికి ప్రధాన గమ్యస్థానం కాదు. బిహార్ లోపలికి వచ్చే వారి కంటే పొట్ట చేతపట్టుకుని బయటకి వెళ్లే వారే ఎక్కువ. 1830 నుంచి ఇప్పటి వరకూ అదే కొనసాగుతోంది. నితీశ్‌కుమార్ 2005లో బిహార్ ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి అభివృద్ధి పరంగా అద్భుతం జరుగుతోందంటూ ప్రచారం సాగుతున్నప్పటికీ వలసలు పోయే ప్రజల శాతంలో ఆ రాష్ట్రమే అగ్రస్థానంలో ఉంది. ఎక్కడైనా ఉపాధి అవకాశాలు, మంచి జీతాలు ఉన్నచోటకే ప్రజలు వలసలు కడతారు. అవి అంతంత మాత్రం ఉన్న చోటుకు వెళ్లటం సాధ్యంకాదు. బంగ్లా అక్రమ వలసదారులు బిహార్‌ను ముంచెత్తుతున్నారని చెప్పటానికి అంకెలు, ఆధారాల కంటే.. ఒక వర్గం ప్రజల వల్లే సమస్యలన్నీ వస్తున్నాయని చెప్పటంలో రాజకీయ కోణమే కనిపిస్తోంది. ఆ వర్గాన్ని సంతృప్తిపరచే ధోరణితో రాజకీయాలు భ్రష్టుపట్టిపోతున్నాయని ఆరోపించటమూ కష్టం కాదు. కానీ అందుకు హేతుబద్ధమైన సమాచారాన్ని ఇవ్వటమే కష్టం! వలసల గురించి ప్రధానంగా మనకు లభ్యమయ్యే సమాచారం పదేళ్లకొకసారి జరిగే జనాభా లెక్కల వల్లే వస్తుంది. వీటికి తోడు జాతీయ నమూనా సర్వే సంస్థ (నేషనల్ శాంపుల్ సర్వే ఆర్గనైజేషన్– ఎన్ఎస్ఎస్ఓ) అందించే గణాంకాల వల్ల కూడా వలసల సమాచారం దొరుకుతుంది. ఈ రెండు మూలాల నుంచి వచ్చే సమాచారంలో చాలా పరిమితులు ఉన్నాయని బిహార్ వలసలపై పరిశోధించిన అమితాదత్తా (హైదరాబాద్–ఐఐటీ) ఆధారాలతో వివరించారు.

2001 జనాభా లెక్కల ప్రకారం 79 లక్షల మంది పనుల కోసం బిహార్ నుంచి వెలుపలకు వెళ్లారు. 2011 నాటికి ఆ సంఖ్య కొంత తగ్గి 74.5 లక్షలకు చేరుకుంది. ఇలా తగ్గటానికి 2008లో ప్రపంచ వ్యాప్తంగా తలెత్తిన ఆర్థిక సంక్షోభమే ప్రధాన కారణం. అసంఘటిత రంగంపై దీని ప్రభావం అధికంగా పడింది. కార్మికుల్లో అసంఘటిత రంగంలో ఉన్న వారే (85–90%) ఎక్కువ. బిహార్ వలస కార్మికులు అధికంగా ఉపాధి పొందేది ఈ రంగంలోనే. ఆనాటి ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే మన జీడీపీని పరిశీలిస్తే సరిపోతుంది. 2007–08లో మన జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ) 9.3 శాతం ఉంటే ఆర్థిక సంక్షోభం వల్ల అది 6.7 శాతానికి పడిపోయింది. రెండున్నర శాతం జీడీపీ తగ్గిపోవటం మామూలు విషయం కాదు. ఒడిదుడుకులు ఎన్ని ఉన్నా బిహార్‌కు వలసలు కీలకంగా మారిపోయాయి. గ్రామీణ బిహార్‌లో ప్రతి అయిదుగురిలో ఒకరు వలస కార్మికుడిగా పనిచేసే వారే కనపడతారు. కొన్ని గ్రామాల్లో చేసిన సర్వేల్లో వలస కార్మికులు ఉన్న కుటుంబాలు 64.9 శాతం ఉన్నట్లు లెక్కలు తేలాయి.

బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా ప్రజలు వస్తున్నారు. దీన్ని కాదనలేం. సుదీర్ఘ సరిహద్దు ఉండటంతో పాటు వందల ఏళ్ల పాటు ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధ, బాంధవ్యాలు వలసలను ప్రభావితం చేస్తున్నాయి. అక్రమంగా వలసలు వచ్చిన వాళ్లు ఎంతమంది అనటానికి ప్రభుత్వం దగ్గర లెక్కలు పక్కాగా లేవు. బిహార్‌కు సంబంధించి అదింకా నిజం. బిహార్‌లోని ఉద్యోగాలు, వనరులను బంగ్లా ముస్లింలు కొల్లగొడుతున్నారనటానికి అక్కడి ఆర్థిక పరిస్థితులు సహకరించవు. స్వంత ప్రజలు ఎక్కువగా వలసలు పోయే పరిస్థితులు ఉన్నచోట అది సాధ్యమయ్యే పని కాదు. రాజకీయ ప్రచారానికి వాస్తవాలతో పని ఉండదు కాబట్టి ఏదైనా చెల్లిపోతుంది. దీనికి ఏ పార్టీ మినహాయింపు కాదు. ఓట్ల చోరీవల్లే అధికారాన్ని అందుకోలేక పోయామని రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రచారం కూడా ఒకరకంగా అలాంటిదే. ప్రచారాలకూ వాస్తవాలకూ ఎంతో దూరం ఉంటుందనటానికి అస్సాంలో పౌరుల జాతీయ పట్టిక (నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజెన్స్–ఎన్ఆర్‌సీ) వ్యవహారాన్ని చూస్తే అర్థం అవుతుంది. 1971 ముందు నుంచీ అస్సాంలో నివసిస్తున్నట్లుగా సాక్ష్యాధారాలు సమర్పించిన వారినే ఎన్ఆర్‌సీలో చేరుస్తామని ప్రకటించి ఆ మేరకు కసరత్తును అక్కడ పూర్తిచేశారు. 19.06 లక్షల మంది సాక్ష్యాధారాలను సమర్పించలేక పోయారు. అంటే అస్సాం జనాభాలోని 3.3 కోట్ల మందిలో 6 శాతం మంది దగ్గర అవసరమైన పత్రాల్లేవు. అట్లా లేని వారందరూ ముస్లింలే అయివుంటే అక్రమ వలసదారులందరూ ఆ వర్గం వారేనని చెప్పటానికి ఆస్కారం ఉండేది. పత్రాలను సమర్పించలేని వారి సమాచారాన్ని మతాలవారీగా ప్రకటిస్తే అసలు విషయం బయటపడేది. కానీ ప్రభుత్వం ఆ పని చేయలేదు. వివిధ అనధికార అంచనాల ప్రకారం 12 లక్షల మంది హిందువులు (63%) సాక్ష్యాధారాలను సమర్పించలేక పోయారు. ఈ 12 లక్షల మందికీ పౌరసత్వాన్ని కల్పించటానికే పౌరసత్వ చట్టానికి 2019 డిసెంబర్‌లో సవరణను తీసుకువచ్చారు. ఇది తీవ్ర వివాదానికి కారణమైంది. మతాన్ని బట్టి పౌరసత్వాన్ని కల్పించటం రాజ్యాంగానికి విరుద్ధమైందని పేర్కొంటూ పెద్ద ఆందోళనలూ తలెత్తాయి. ముస్లింలు మినహా మిగతా భారతీయ మతాలకు ఆశ్రయమిచ్చే దేశమేదీ ప్రపంచంలో లేకపోవటంతో ఆ సవరణను చేపట్టామని ప్రభుత్వం సమర్థించుకున్నా, అది రాజ్యాంగబద్ధంగా లేదని చెప్పటానికే ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. దేశవిదేశాల్లో ఇదే అభిప్రాయం వ్యక్తమైంది. పత్రాల్లేని అస్సాం ముస్లింలకు పౌరసత్వం కల్పించటానికి ఇతర ముస్లిం దేశాలు ముందుకు రాకపోతే పరిష్కారం ఏమిటి అన్న దానికి ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. ఏడు లక్షల మంది ముస్లింలను బంగ్లాదేశ్ అక్కున చేర్చుకుంటుదని కోరుకోవటం అత్యాశే అవుతుంది.



▪ రాహుల్ కుమార్

అస్సాంలోనే ఈ పరిస్థితి ఉంటే బెంగాల్‌లో ఎన్ఆర్‌సీని రూపొందిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించలేం! బంగ్లా నుంచి తరలి వచ్చిన హిందువులందరూ అనుమతులన్నీ తీసుకుని భారత్‌లోకి అడుగుపెట్టారని చెప్పలేం. పత్రాల్లేని హిందువుల సంఖ్య అక్కడ చాలా ఎక్కువగా ఉండొచ్చు. బంగ్లాదేశ్‌లో 1951 నాటికి హిందువులు 92,39,603 మంది ఉంటే, 2022 నాటికి ఆ సంఖ్య 1,31,30,109కి పెరిగింది. 1947 నుంచి దాదాపు కోటిమందికి పైగా హిందువులు భారత్‌కు దఫదఫాలుగా తరలివచ్చిన తర్వాత కూడా ఈ పరిస్థితి ఉంది. బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడూ, మతాల మధ్య వైషమ్యాలు పెరిగినప్పుడూ హిందువులు ఏదోరకంగా సరిహద్దులు దాటటానికే ప్రయత్నించారు. అందులో సఫలమైన వారి సంఖ్య గణనీయంగానే ఉంటుంది. పక్షపాతం లేకుండా లెక్కలు తీస్తే పశ్చిమబెంగాల్, అస్సాం, త్రిపురల్లో చాలామంది పత్రాల్లేని వారు తేలతారు.

బిహార్‌లోకి అక్రమంగా వస్తున్న విదేశీ వలస కార్మికుల సంఖ్య ఎంతైనప్పటికీ ఆ సమస్యను రాజకీయంగా పెద్దది చేసే అవకాశం ఉండొచ్చు. కాదనలేం. కానీ అక్కడ నుంచి దేశవిదేశాల్లోని పలు ప్రాంతాలకు వలస కార్మికులుగా బిహార్ ప్రజలు ఎందుకు తరలివెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్న ప్రశ్నే కీలకమైంది. రబ్బరు, చెరకు తోటల్లో పనిచేయటానికి కరేబియన్, గుయానా, సొరినామ్, ట్రినిడాడ్ అండ్ టొబాగో, ఫిజీ, మారిషస్‌లకు ఒప్పందపు కూలీలుగా బిహారీలను 1830ల్లో తీసుకువెళ్లారు. ఆ తర్వాత కొన్నేళ్లకు అస్సాం టీతోటల్లో పనిచేయటానికి తరలించారు. కలకత్తా కార్మిక అవసరాలకు బిహారీలు కావాల్సి వచ్చారు. వందేళ్లపాటు అస్సాం, బెంగాల్‌లకు బిహారీ కార్మికుల యాత్ర కొనసాగింది. కలకత్తా కేంద్రంగా నడిచిన పారిశ్రామిక అభివృద్ధి 1930ల్లో మందగించింది. అదే సమయంలో అస్సాం టీతోటల్లో పనికి గిరాకీ తగ్గింది. దాంతో తూర్పు దిక్కుకు బిహారీల వలసలు సన్నగిల్లాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతా బిహార్‌లో పారిశ్రామికాభివృద్ధి పెద్దగా జరగలేదు. ఉమ్మడి బిహార్‌లోని ఖనిజ సంపద దండిగా ఉన్నా దాన్ని సబ్సిడీ రేట్లకు ఇతర ప్రాంతాలకు తరలించాల్సి రావటంతో స్థానిక అవసరాలకు ఉపయోగించుకోలేక పోయారు. 1960, 1970ల నాటి సస్యవిప్లవమూ బిహార్‌లో ప్రభావమూ చూపలేదు. ఆ విప్లవం పుంజుకున్న పంజాబ్, హర్యానా ప్రాంతాలకు బిహారీలు వలస కార్మికులుగా తరలివెళ్లారు. విస్తరిస్తున్న దేశ రాజధాని ఢిల్లీ అవసరాలకు బిహారీలు పెద్దఎత్తున అవసరమయ్యారు. ముంబాయికీ వెళ్లారు. ఆ వలస కార్మికులను వ్యతిరేకిస్తూ, అడపాదడపా వారిపై దాడులు చేస్తూ, విద్వేషాన్ని చిమ్ముతూ శివసేన బలం పుంజుకుంది. ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాత దక్షిణాదికీ బిహారీ వలసలు విస్తరించాయి. వలసలు గ్రామాల్లో చాలా మార్పులను తెచ్చాయి. 50శాతం పైగా ఆదాయాన్ని వలస కార్మికులు గ్రామాల్లోని కుటుంబ అవసరాలకు పంపుతున్నారు. కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితి సాపేక్షికంగా మెరుగుపడింది. గ్రామాలతో పోల్చితే కుల ఆధిక్యతల అహంకారం లేని నగరాల్లో తమకు గౌరవప్రద జీవితం లభిస్తోందని బిహార్ వలస కార్మికులు భావిస్తున్నా చిట్టచివరికి సొంత చోటుకు చేరుకోవాలన్న తపన మాత్రం తగ్గటం లేదు. కుటుంబాలకు దూరంగా ఉండటం, అధికశ్రమతో ఆరోగ్యం దెబ్బతినటం, పని ప్రాంతంలో పరాయివారిగానే చూడటం వాళ్ల మనస్సులను సొంతూళ్ల వైపు లాగేలా చేస్తోంది. కరోనా సమయంలో కాలిబాట పట్టిన లక్షలాది వలసకార్మికులే దీనికి నిదర్శనం.

బిహార్‌లోకి అక్రమంగా వస్తున్న విదేశీ వలస కార్మికుల సంఖ్య ఎంతైనప్పటికీ ఆ సమస్యను రాజకీయంగా పెద్దది చేసే అవకాశం ఉండొచ్చు. కాదనలేం. కానీ అక్కడ నుంచి దేశవిదేశాల్లోని పలు ప్రాంతాలకు వలసకార్మికులుగా బిహార్ ప్రజలు ఎందుకు తరలివెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్న ప్రశ్నే కీలకమైంది.

కార్మిక వలసల్లేకుండా, వారి శ్రమలేకుండా ఈనాటి ఆర్థిక వ్యవస్థ రథచక్రాలు కదలవు. వనరులనూ, ఉద్యోగాలనూ కొల్లగొడుతున్నారంటూ వలస కార్మికులకు మతం రంగు పూయటం, విదేశీముద్ర వేయటం వైమనస్యాలను పెంచటానికి మాత్రమే పనికివస్తుంది. ఎన్ని ముద్రలు వేసినా వలసకార్మికులు చిందించిన చెమటచుక్కల ప్రవాహాల నుంచే మన సంపదలు పెరుగుతున్నాయి. మన నగరాలు కళకళలాడుతున్నాయి. మన భవనాల్లో సొగసులు కుదురుకుంటున్నాయి.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

తల్లి భారతి సేవలో వందేళ్లు

'హిందూ సంస్కృతి నశిస్తే హిందూ సమాజమే ఉండదు. కేవలం మట్టి వల్లే ఒక దేశం ఏర్పడదు. హిందూ సమాజాన్ని సంఘటితం చేయడం ప్రతి హిందువు కర్తవ్యం' అంటూ డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ వంద సంవత్సరాల క్రితం స్థాపించిన 'రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్' నేడు భారతదేశ చరిత్రను పునర్లిఖించే క్రమంలో ఉన్నది. కొద్ది మంది భావసారూప్యత గల యువకులతో 1925 విజయదశమి రోజున నాగపూర్‌లో హెడ్గేవార్ స్థాపించిన ఈ సంస్థ దినదిన ప్రవర్ధమానమై కోట్లాది భారతీయుల ఆలోచనలను నేడు ప్రభావితం చేస్తున్నదంటే సామాన్యమైన విషయం కాదు.



ఈ మార్పునకు దోహదం చేసిన హెడ్గేవార్ తెలుగువారు కావడం, ఆయన స్థాపించిన ఆరెస్సెస్ 60 లక్షలమందికి పైగా సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయవాద సంస్థగా రూపొందడం గర్వించదగ్గ విశేషం. ఆరెస్సెస్ ప్రేరణతో శ్యాం ప్రసాద్ ముఖర్జీ నేతృత్వంలో 1951 అక్టోబర్ 21న 'భారతీయ జనసంఘ్' ఏర్పడడం, అది 1977లో జనతా పార్టీగా, 1980 ఏప్రిల్ 16న 'భారతీయ జనతా పార్టీ'గా రూపాంతరం చెందడం చారిత్రక పరిణామంలో భాగం. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ అయిన బీజేపీ సారథ్యంలో నేడు భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.

'దేశం కోసం మనం' ఇది ఆరెస్సెస్ ఆశయం, 'నమస్తే సదా వత్సలే మాతృభూమే' ఇది ఆ సంఘ్ ప్రాణగీతం. సంఘ్ కేతనంలోని కాషాయ రంగు భారతీయ సంస్కృతిలోని 'త్యాగం, శౌర్యం, ఆత్మనిబద్ధత'కు నిదర్శనం. హిందువులంతా కలిసి తల్లి భరత మాతను ఈ ప్రపంచానికే విశ్వగురువుగా నిలబెట్టాలన్నది ఆరెస్సెస్ ఏకైక లక్ష్యం. అందుకోసం ప్రతి భారతీయుడినీ, ముఖ్యంగా యువతను దేశ నిర్మాణంలో పాలు పంచుకునేలా చేయాలన్నదే ధ్యేయం. ఆరెస్సెస్ ఓ మహా వృక్షమైతే 'స్వదేశీ జాగరణ మంచ్, సేవాభారతి, విద్యాభారతి, ఏబీవీపీ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, భారతీయ కిసాన్‌సంఘ్, భారతీయ మజ్దూర్ సంఘ్, న్యాయవాద పరిషత్, వనవాసి కల్యాణ పరిషత్, సంస్కార భారతి' వంటివి దాని శాఖలు. ఇవేగాక, మనదేశంలోని ముస్లింల కోసం 'ముస్లిం రాష్ట్రీయ మంచ్, మహిళల కోసం 'రాష్ట్ర సేవికా సమితి' వంటివి సంఘ్‌కు అనుబంధంగా పనిచేస్తున్నాయి.

స్వాతంత్ర్య పోరాటంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాలుపంచుకోలేదనేది చరిత్ర తెలియని దేశ వ్యతిరేకుల ఆరోపణ. స్వాతంత్ర్యం కోసమే దేశ భక్తులను సంఘ్ తయారు చేసింది. హెడ్గేవార్ 1921, 1931లో జైలు నిర్బంధానికి గురయ్యారు. కలకత్తాలో మెడిసిన్ చదువుతున్నప్పుడు ఆయన 'అనుశీలన సమితి' అనే విప్లవ సంస్థలో పాల్గొన్నారు.


వార్ధాలో హెడ్గేవార్‌ను కలుసుకున్న గాంధీజీ సంఘ్ క్రమశిక్షణను ప్రశంసించిన విషయం చరిత్ర పుటల్లో నమోదైంది. ఆరెస్సెస్ సుశిక్షితులైన కార్యకర్తల సంస్థ. ప్రాథమిక, ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్ష పేరుతో సంఘ్ ప్రచారక్‌లకు నాలుగు రకాలుగా శిక్షణ ఇస్తున్నది. వాజపేయి, ఆద్వాణీ నుంచి నరేంద్ర మోదీ వరకూ ఈ శిక్షణ పొందినవారే.

దేశం పెను ప్రమాదాలు, విపత్తులు ఎదుర్కొన్నప్పుడు స్వయం సేవకులు తమ ప్రాణాలు కూడా లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించారు. పాక్, చైనాలతో భారత్ యుద్ధం చేసిన సమయంలో భారత సైన్యానికి అండగా నిలబడ్డారు. దేశ విభజన, పంజాబ్, బెంగాల్ ప్రాంతాల్లోని హింస, దోపిడీ, అత్యాచారాలను నిలువరించడం, వలస వచ్చిన శరణార్థులకు శిబిరాల ఏర్పాటు, కరువు సమయంలో నిత్యావసర వస్తువులను అందించడం వంటి చర్యల ద్వారా సంఘ్ చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. 1947 అక్టోబర్‌లో జమ్మూ పట్టణ దిగ్బంధాన్ని స్వయం సేవకులు అడ్డుకుని, శ్రీనగర్‌ను కాపాడుకున్నారని ఎంతమందికి తెలుసు? 1977 నాటి దివిసీమ ఉప్పెనకు బలైన 20వేల మంది మృతదేహాలను ఖననం చేయడానికి సైనికులు సైతం వెనుకంజ వేసినప్పుడు.. స్వయం సేవకులే రంగంలోకి దిగి ఆయా మృతదేహాలను, పశువుల కళేబరాలనూ ఖననం చేశారు. 1975 నాటి ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన లక్షా 30 వేల మందిలో దాదాపు లక్షమంది వరకూ స్వయం సేవకులు ఉన్నారు.

హిందూధర్మం అనంతవాహినిగా ప్రవహించే గంగ లాంటిది. ఆరెస్సెస్ శక్తికి కాలమే సాక్షి, కాలమే పరీక్ష. డాక్టర్ హెడ్గేవార్, గురూజీ మొదలుకొని మోహన్ భగవత్ వరకు ఆరెస్సెస్ ఒక అఖండ ధార, ఒక ప్రవాహం. సంఘ్‌ను అర్థం చేసుకోవడానికి, అనుభూతి చెందడానికి గొప్ప సంస్కారం, పరిణతి కావాలి. ఆరెస్సెస్ 'శతాబ్ద ప్రస్థానం' కేవలం ఒక చారిత్రక జ్ఞాపకం కాదు. అది మన కర్తవ్యాన్ని గుర్తుచేసే విశిష్ట చరిత్ర.



• సత్యకుమార్ యాదవ్
ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖామాత్యులు



అమ్మ దీవెన

తప్పొప్పులను క్షమాగుణంతో మన్నించి
నిత్య శోభితమైన ఆనంద వీచికలు
నిరంతరం వెలుగై ప్రసరించే అమ్మ దీవెన
అమ్మ దీవెన కోటి వరాల కానుక

ఒడిదుడుకుల జీవన ప్రయాణం దారుల్లో
అలజడులు లేని గమ్యాన్ని చేరువ చేసి
కష్టాల కడలి సునాయాసంగా దాటే శక్తిని
నొసంగు దుర్గమ్మను కొలిచిన తరుణాన

ఈతి బాధలతో జీవితాన్ని ఈడుస్తూ
సంకటాల కుంపటి నెత్తిన మోసే తీరులో
దోషాలను సంహరించే మహాకాళిగా
వెన్నంటి నడిపించును తలచినంతనే

గ్రహ బాధల దీనావస్థల చీకటి తెరలలో
రుణ బాధల కడగండ్ల కన్నీటితో
అలమటించే మనిషి మననంలో దుర్గమ్మ
కొలువైన తక్షణం శాంతి చేకూరు జీవితాన

సమభావమే జీవన పరమార్థమై
మానవతే మనిషి నిరంతర బ్రతుకై
కొలమానం లేని భక్తి తత్పరతతో కీర్తించి
నమ్మిన భక్తులెల్లరకు అమ్మవారే ప్రతినిత్యం
దీవించి కరుణించి వరమిచ్చే శరణ్యం

– నరెద్దుల రాజారెడ్డి

రాజమండ్రి టు తిరుపతి విమాన సర్వీసు ప్రారంభం

- ప్రారంభ కానుకగా మూడు నెలలపాటు

తొలి 35 సీట్లు రూ.2వేలకే.. తర్వాత 35 సీట్లు రూ.4 వేలకు

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి

న్యూఢిల్లీ, రాజమహేంద్రవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నుంచి పుణ్యక్షేత్రమైన తిరుపతికి బుధవారం విమాన సర్వీసు ప్రారంభించారు. ఢిల్లీ నుంచి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ పురందేశ్వరి వర్చువల్ విధానంలో దీనిని ప్రారంభించగా.. రాజమండ్రి నుంచి తిరుపతి బయలుదేరిన తొలి విమానానికి మంత్రి కందుల దుర్గేశ్ జెండా ఊపారు. రాజమండ్రి విమానాశ్రయంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి, బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఈ సర్వీసుతో రాజమండ్రి-తిరుపతి మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందన్నారు. తిరుపతికి టికెట్ల బుకింగ్ ప్రారంభించిన కొద్దిసేపటికే అన్నీ అయిపోయాయని తెలిపారు. ప్రారంభ కానుకగా ఈ విమానంలో మూడు నెలలపాటు మొదటి 35 సీట్లు రూ.2వేలకు, తర్వాత 35 సీట్లు రూ.4 వేలకు అందిస్తారని చెప్పారు. రాజమండ్రిలో రెండో టెర్మినల్ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. షిర్డి, గోవా, అహ్మదాబాద్, వారాణసీతోపాటు బెంగళూరుకు మరో సర్వీసు నడపడానికి ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ పుష్కరాల నాటికి దేశంలోని అన్ని ప్రధాన ప్రాంతాలతో విమాన సర్వీసులను అనుసంధానం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. రాజమండ్రి ఎయిర్‌పోర్టులో ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వారంలో మంగళ, గురు, శనివారాల్లో ఉదయం 7.40గంటలకు తిరుపతిలో బయలుదేరే విమానం 9.25కి రాజమండ్రి చేరుకొని, తిరుగు ప్రయాణంలో 9.50కి బయలుదేరి 11.20కు తిరుపతి చేరుతుందన్నారు.



రాజమండ్రి-తిరుపతి విమాన సర్వీసును ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి



రాజమండ్రిలో కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి శ్రీనివాస్, నల్లమిల్లి, బలరామకృష్ణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు




రాజమండ్రి ఎయిర్‌పోర్టులో తిరుపతి విమాన సర్వీసుకు వాటర్ క్యాన్ ఆన్ స్వాగతం పలుకుతున్న సిబ్బంది

ప్రధాని మౌనానికి అర్థం ఏమిటి?

- బీజేపీ ప్రతినిధి

బెదిరింపులపై సిద్దరామయ్య

బెంగళూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఛాతీలోకి బుల్లెట్ దింపాలని బీజేపీ అధికార ప్రతినిధి చేసిన బహిరంగ వ్యాఖ్యలపై ప్రధాని మౌనం వహించడంలో అర్థమేమిటని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రశ్నించారు. దీనిపై బుధవారం ఎక్స్‌లో స్పందిస్తూ.. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మౌనం అంగీకారమేనా? అంటూ ప్రశ్నించారు. బెదిరింపుల ద్వారా సిద్ధాంతపరమైన వ్యతిరేకులను అణగదొక్కాలని చూడడం, లేనిపక్షంలో వారిని లేకుండా చేయడం అనేది బీజేపీ, సంఘ్‌పరివార్‌కు కొత్తేమీ కాదన్నారు. గతంలో తెర వెనుక ప్రయత్నాలు చేసేవారని, ప్రస్తుతం నేరుగా రంగంలోకి దిగుతున్నారని ఆరోపించారు. ప్రత్యర్థుల సవాళ్లను చర్చల ద్వారా సిద్ధాంతపరంగా ఎదుర్కొనలేక భౌతికంగా ముగిస్తామనడం దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. సంఘ్ పరివార్ కారణంగా ప్రాణాలు కోల్పోయినవారు ఒకరా.. ఇద్దరా... మహాత్మాగాంధీ నుంచి ఈ పరంపర కొనసాగుతూనే ఉందని పేర్కొన్నారు.




Dharma Productions & Mentor Disciple Entertainment presents
a Dharma Productions film
Revenge Never Looked This Festive!
Sunny sanskari ki Tulsi kumari
in cinemas TODAY
directed by Shashank Khaitan
a Dharma Productions Worldwide release


LAXMI LAXMAIAH PRESENTS
దసరా శుభాకాంక్షలు
PUBLIC OFFICER FOR LEGAL INVESTIGATIONS AND CRIMINAL EMERGENCIES
VARUN SANDESH
కానిస్టేబుల్
CONSTABLE
RELEASING ON 10th OCT
DISTRIBUTORS
GLOBAL
NIZAM : GLOBAL CINEMAS
ANDHRA: SREE VEERANJANEYA FILMS
CEEDAD: VARALAKSHMI FILMS
ODISHA : AYUSH MOVIES
TAMIL NADU : JMM MOVIES
KERALA : JMM MOVIES
KARNATAKA: KESARI ENTERPRISES
NORTH INDIA : JAI VIRATRA ENTERTAINMENT LTD
OVERSEAS: NANMA INTERNATIONAL PTY LTD
AHYAN SUBHAN SK


VADDE JISHNU PRESENTS
VADDE CREATIONS LLP
VADDE NAVEEN
TRANSFER
త్రిమూర్తులు
PRODUCER VADDE NAVEEN
DIRECTOR KAMAL TEJA NARLA
దసరా శుభాకాంక్షలు


DINESH VIJAN PRESENTS
MADDOCK FILMS
దసరా శుభాకాంక్షలతో
థామా
DUBBED IN TELUGU
DIRECTED BY ADITYA SARPOTDAR
PRODUCED BY DINESH VIJAN AND AMAR KAUSHIK
Yeh Diwali... THAMMAke wali
A MADDOCK FILMS PRODUCTION
దీపావళి విడుదల
IN CINEMAS 21ST OCTOBER


DVV
SMT. D PARVATHI PRESENTS
దసరా శుభాకాంక్షలు
PAWAN KALYAN IN
THEY CALL HIM
OG
WRITTEN & DIRECTED BY SUJEETH
DVV DANAYYA KALYAN DASARI
A THAMAN S MUSICAL
RAVI K CHANDRAN (ISC) MANOJ PARAMAHAMSA (ISC) NAVIN NOOLI A S PRAKASH DARSHAN JALAN & NEELANCHAL KUMAR GHOSH
HARISH PAI SATHYANARAYANA GUGGILLA SOMARAJU PVV ASHWIN MANI MALLESH T RAGHAV TAMMAREDDY MANIKANTA RONGALA
UDAY ALLA ARUN THEVAR LOKESH SRINIVASAN KISHORE SARELLA LAKSHMIVENUGOPAL
NETFLIX
IN CINEMAS NOW
SONY MUSIC





క్యూలైన్లలో భవానీలు



అరుణకీలాద్రి

భారీగా తరలివచ్చిన భవానీలు

- ఎరుపెక్కిన దుర్గమ్మ ఆలయ పరిసరాలు
- కాలినడకన వస్తున్న భవానీలే అధికం
- దర్శనానంతరం ఇరుముడుల సమర్పణ
- ఉత్సవాల్లో కొనసాగుతున్న రద్దీ



కార్తీక్, కారుణ్య మ్యూజిక్ మస్తీ



విజయవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి ఎరుపెక్కుతోంది. క్యూల నిండా సాధారణ భక్తులతో పాటు భవానీలు కనిపిస్తున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గమ్మ మహిషాసురమర్దినీ అలంకారంలో దర్శనమివ్వగా, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రి 7.30 గంటల సమయానికి 80,500 మంది అమ్మవారిని దర్శించున్నారు. దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. 30,200 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మూల నక్షత్రం రోజు మాదిరిగానే భక్తులను మిగతా 8లో..



హంస వాహనం సిద్ధం



కృష్ణవేణి ఘాట్‌లో రద్దీ



దుర్గమ్మకు దక్షత్ర హారతి




రాజమండ్రి నుంచి కాలినడకన వస్తున్న భవానీ (ఇన్‌సెట్‌లో) కాలుకు గాయాలు

రోజంతా సిటీలోనే..

నేడు సీఎం చంద్రబాబు పర్యటన

- గాంధీహిల్‌పై ప్రముఖులతో సమావేశం
- తుమ్మలపల్లిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి..
- ఎస్ఎస్ కన్వెన్షన్‌లో 'ఖాదీసంత'కు కూడా..
- బందరురోడ్డుపై మెగా కార్నివాల్ ప్రారంభం
- విజయవాడ ఉత్సవ్ ముగింపు సభకు హాజరు





గాంధీహిల్‌పై కొత్తగా ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయదశమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం నగరంలో పర్యటించనున్నారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీహిల్ రీ డెవలప్‌మెంట్ పనులు పరిశీలిస్తారు. గాంధీ ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్ మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి గాంధీహిల్ సొసైటీ ఇచ్చే పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తారు. గాంధీహిల్ అభివృద్ధికి సంబంధించి పుర ప్రముఖుల సమావేశంలో పాల్గొంటారు. గాంధీ స్మారక కేంద్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశాలపై చంద్రబాబు చర్చిస్తారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా సాయంత్రం బందరు రోడ్డులో నిర్వహించే మెగా కార్నివాల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. 3 వేల మంది కళాకారులతో జరిగే ఈ కార్నివాల్‌ను ఆయన డీ అడ్రస్‌మాల్ ఎదురుగా ఏర్పాటుచేసిన వేదిక నుంచి వీక్షిస్తారు. ఈ మెగా కార్నివాల్‌కు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించేందుకు నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు. గొల్లపూడిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే విజయవాడ ఉత్సవ్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఎస్ఎస్ కన్వెన్షన్‌లో నిర్వహించే 'ఖాదీసంత' కార్యక్రమంలో కూడా ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఖాదీ ఉత్పత్తులను పరిశీలిస్తారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటారు.



దసరా ధమాకా

- విజయవాడ ఉత్సవ్‌లో మ్యూజిక్ మ్యాజిక్
- కార్తీక్, కారుణ్య, రాహుల్ పాటలు అదుర్స్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కార్తీక్ హార్ట్‌బీట్స్. కారుణ్య ఫాస్ట్‌బీట్స్. రాహుల్ వెల్లల్ ఆధ్యాత్మిక పాటలతో విజయవాడ ఉత్సవ్ మార్మోగిపోయింది. గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సింగర్ కార్తీక్ తనదైనశైలిలో మిగతా 8లో..

వరద.. వణుకు

విజయవాడ-అవనిగడ్డ కరకట్టను తాకిన నీరు

- నీట మునిగిన పంట పొలాలు
- భవానీ ద్వీపంలోకి ప్రవాహం
- రీటైనింగ్ వాల్ వెంబడి ఇళ్లలోకి ఊట నీరు

8లో



భవానీద్వీపంలోకి చేరిన వరద నీరు

ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో కృష్ణమ్మ నిండుగా ప్రవహిస్తోంది. విజయవాడ-అవనిగడ్డ కరకట్టను తాకుతూ కడలివైపు పరుగులు తీస్తోంది. వరద మరింత పెరిగితే కరకట్ట రోడ్డుపైకి నీరుచేరే ప్రమాదం పొంచి ఉంది. రాకపోకలు నిలిచిపోవడంతో పాటు బలహీనంగా ఉన్నచోట కట్టకు గండ్లు పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంట పొలాలు నీటమునగగా, భవానీ ద్వీపంలో నాలుగు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. రీటైనింగ్ వాల్ వెంబడి ఇళ్లలోకి ఊటనీరు వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు.

గ్రాండ్ షో.. మెగా కార్నివాల్

నేటితో విజయవాడ ఉత్సవ్ ముగింపు

- ఎంజీ రోడ్డులో 2 కిలోమీటర్ల కార్నివాల్
- 3 వేల మంది కళాకారులతో అతిపెద్ద కార్నివాల్
- అమ్మవారి రథోత్సవం ఊరేగింపు
- ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు కోసం ప్రయత్నం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- దేశవిదేశాలకు చాటిచెప్పేలా విజయవాడ ఉత్సవ్ : ఎంపీ చిన్ని

10లో

దుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

» టీటీడీ బోర్డు సభ్యులు



కమిషనర్, ఈవోలకు పట్టువస్త్రాలను అందజేస్తున్న సభ్యులు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దుర్గమ్మ ఆశీస్సులతో రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు సుచిత్రా ఎల్లా, నన్నపనేని సదాశివరావులు అన్నారు. దుర్గగుడిలో జరుగుతున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం టీటీడీ సభ్యులు సుచిత్రా ఎల్లా, నన్నపనేని సదాశివరావు, టి.జానకిదేవి, ఎ.రంగశ్రీలు దుర్గమ్మకు టీటీడీ తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, అర్చకులు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి తదితరులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదఆశీస్సులు.. అర్చకులు శ్రీనివాస శాస్త్రి సభ్యులకు అమ్మవారి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం సుచిత్రా ఎల్లా, నన్నపనేని సదాశివరావులు మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించటం ఆనందంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. ప్రజలందరికీ ఆయురారోగ్య, ఐశ్వర్యాలు ప్రసాదించమని అమ్మవారిని ప్రార్థించినట్టు తెలిపారు. అమ్మవారి కృప అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. హైటెక్ సిటీ తరహాలో క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధి చెందాలని, ముఖ్యమంత్రికి శక్తి సామర్థ్యాలు ప్రసాదించాలని అమ్మవారిని కోరినట్టు తెలిపారు.

దుర్గమ్మకు సారె సమర్పించిన ఉత్సవ కమిటీ

ఇంద్రకీలాద్రి: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహిషాసురమర్దినీ గా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మకు దుర్గగుడి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌తో కలిసి దసరా ఉత్సవ కమిటీ సభ్యులు సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ దసరా ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు.

తొమ్మిది రోజుల ఆదాయం రూ.3.55 కోట్లు

ఇంద్రకీలాద్రి: దుర్గగుడి దసరా మహోత్సవాలలో ఈనెల 22 నుంచి 30 వరకు తొమ్మిది రోజుల పాటు దేవస్థానానికి రూ 3,55,82,374ల ఆదాయం వచ్చినట్టు ఈవో శీనానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శన రుసుం రూ.300 టికెట్ల ద్వారా రూ.35,20,800లు, రూ.100టికెట్ల ద్వారా రూ.12,65,700లు, రూ. 15 లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా రూ.32,99,955లు, రూ.100 లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.2,51,51,000 వచ్చినట్టు తెలిపారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ(రూ.3000)ద్వారా రూ.4,50,000లు, టికెట్ రూ.5000 ద్వారా రూ.1.75లక్షలు, చండీహోమం రూ.4000 రుసుం ద్వారా రూ.1,20,000లు, ప్రత్యేక, పరోక్ష శ్రీచక్ర నవావరణార్చన (రూ.3000) ద్వారా రూ.33 వేలు, ఖడ్గమాలార్చన ద్వారా రూ.3,06,960లు, పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్లద్వారా రూ.73,372లు, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.10,92,960, ఇతరత్రా ఆదాయం రూ.93,627లు మేరకు వచ్చినట్లు ఈవో పేర్కొన్నారు.

నేడు దుర్గగుడిలో
వీఐపీ దర్శనాలు లేవు

» ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం దసరా పండగను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునే వీఐపీలకు దర్శనాలు రద్దు చేసినట్టు దేవస్థానం ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ, కృష్ణా నది ఉధృతి వలన అమ్మవారి తెప్పోత్సవం, జలవిహారం కార్యక్రమాలను రద్దు చేసినట్టు చెప్పారు. గురువారం ఉదయం నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంతో దసరా ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి దర్శనానికి భవానీ దీక్షాధారులు అధికంగా తరలివస్తున్నందున గురువారం వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలను రద్దు చేసినట్టు వివరించారు. దసరా రోజున కూడా అన్ని క్యూలలో ఉచిత దర్శనాలు కొనసాగుతాయని తెలిపారు. శివాలయం నుంచి దుర్గాఘాట్ వరకు ఊరేగింపుగా వెళ్లి శాస్త్రోక్తంగా జరపవలసిన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచే దర్శనానికి అనుమతి ఇస్తామన్నారు. క్యూలలో భక్తులందరికీ ఉచిత ప్రసాదం పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. బుధవారం సాయంత్రానికి వివిధ రూపాల్లో దేవస్థానానికి రూ.62,16,970లు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. సాయంత్రం 5 గంటల వరకు 85,094 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు చెప్పారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు



దుర్గమ్మ సన్నిధిలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా ఉత్సవాలలో పదోరోజు బుధవారం మహిషాసుర మర్దిని అలంకారంలో దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందచేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఏపీ హైకోర్టు జడ్జి వి.శ్రీనివాస్, మండపేట ఎమ్మెల్యే, అంచనాల సంఘం (ఎస్టిమేట్స్ కమిటీ) చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తదితరులు ఉన్నారు.

ఇంద్రకీలాద్రిపై త్వరలో న్యూ క్యూ కాంప్లెక్స్



- కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ఇంద్రకీలాద్రిపై క్యూ కాంప్లెక్స్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. దుర్గగుడి అభివృద్ధికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, దేవస్థానం, పోలీసుశాఖ సంయుక్తంగా పటిష్ఠ ఏర్పాట్లు చేయటంతో లక్షలాది భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మ దర్శనం చేసుకుంటున్నారన్నారు. తెలుగు ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే..

- సినీనటుడు రాజేంద్రప్రసాద్



లబ్బీపేట : అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని సినీనటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ, దుర్గమ్మ దయవల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని, చిన్నతనంలో అమ్మ చనిపోవడంతో తన మేనమామ దుర్గమ్మ దగ్గరకు తీసుకువచ్చి ఈ అమ్మే మీ అమ్మ అని చూపించాడని అప్పటి నుంచి అమ్మ సూచించిన మార్గంలో నడిచి ఈస్థాయికి వచ్చానని తెలిపారు.

గత 15సంవత్సరాల నుంచి భవాని మాలాధారణ చేస్తున్నానని ఎంతో మంచి జరిగిందని తెలిపారు. దసరా ఏర్పాట్లు చాలా బాగున్నాయని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

ఏఆర్‌లో ఆయుధపూజ



ఆయుధ పూజలో కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు

విజయవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహర్నవమి సందర్భంగా సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు దంపతులు హాజరయ్యారు. ఆయుధాలతోపాటు వాహనాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో డీసీపీలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అన్ని పోలీస్‌స్టేషన్లలో ఆయుధ పూజలను స్టేషన్ హౌస్ ఆఫీసర్లు నిర్వహించారు.

దుర్గమ్మ దర్శనానికి అమ్మ తోడుగా

చిట్టినగర్ : అమ్మ కనకదుర్గమ్మ ఆశీస్సుల కోసం ఓ దివ్యాంగ బాలుడు అమ్మతో కలిసి ఇంద్రకీలాద్రి వచ్చాడు. భవానీ దీక్షా ధారిగా ఇంద్రికీలాద్రి చేరుకుని అమ్మను దర్శించుకుని తన్మయత్వం పొందాడు.



FLAT FOR SALE

» VJA టిక్కిల్ రోడ్ Food Plaza వెనుక, స్మిత టవర్స్, 1st బ్లాక్, 2nd ఫ్లోర్ 3 BHK Flat అన్ని సౌకర్యాలతో అమ్మకం. ✆ 81426 68666

AJB-235825

BUILDING FOR SALE

» విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ ప్రక్కన, నక్కల రోడ్డును ఆనుకొని ఉన్న 6 ఫ్లోర్ల కమర్షియల్ బిల్డింగ్, ఫ్లోర్ 5337 Sft వెస్ట్ ఫేస్ ఫ్లోర్‌గా గాని, బిల్డింగ్ మొత్తంగా గాని అమ్మకమునకు కలదు. సంప్ర: ✆ 88856 64444, 92479 86114

AJB-235640

PLOTS FOR SALE

» విజయవాడ గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, పరిటాల పరిసర ప్రాంతాలలో ప్లాట్లు అమ్మదలచిన , కొనదలచిన వారు సంప్ర : 93947 17262

AJB-235824

» వామకుంట గ్రామం, తిరువూరు మండలం, ఖమ్మం దగ్గర, విజయవాడకు అతి చేరువలో DTCP అప్రూవ్డ్ ప్లాట్స్ అమ్మకం. లాంచింగ్ ఆఫర్ 10 గ్రాముల గోల్డ్. ✆ 9642223242

AJB-1314

» విజయవాడ పోరంకిలో 40' రోడ్స్ CRDA గేటెడ్ కమ్యూనిటీలో 174, 182, 220, 340, 480, 550, 1050 చ.గ ప్లాట్లు స్పాట్ రిజిస్ట్రేషన్‌కై సంప్రదించండి (బ్యాంకు లోను సదుపాయం కలదు) ✆ 98498 65959

AJB-236122

» అమరావతి-కాజా-గ్రేటర్ విజయవాడలో ORR దగ్గరలో CRDA అప్రూవ్డ్ గల 133 గజాలు పైన గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లు, క్లబ్ హౌస్ ఎమినిటీస్‌తో అమ్మకానికి కలవు. ✆ 95028 22335

AJB-235823

» విజయవాడ పాత బస్టాండు ఎదురుగా బందరు రోడ్డుకు 50 మీ. దూరంలో మనోరమ హోటల్ దగ్గర 300 చ.గ. ప్లాటు (45 x 58) అమ్మకమునకు కలదు. సంప్ర. సెల్ : 94403 31155

AJB-235642

HOUSE FOR SALE

» గుంటూరు బ్రాడీపేట 4/15 నందు 250 గజాల స్థలంలో గల 2 అంతస్తుల పాత భవనం పడమర ఫేసింగ్ భవనం అమ్మకం. సంప్ర : 99085 12652

AJB - 235816

TO-LET COMMERCIAL

» విజయవాడ, కామయ్యతోపు, చలసానినగర్‌లో బందరు రోడ్డుకు అతి దగ్గరలో 3 అంతస్థుల బిల్డింగ్ (Each Floor 2000 S.Ft.) కార్ పార్కింగ్‌తో అద్దెకు. సెల్ : 63034 98345, 94410 83767

AJB - 235818

EDUCATION

➾ Admissions Online - Phase 2, BA Hist or Spl Eng, BCom Comp App, BSc AI / CSc, PLNM Degree College, opp ANU, 9177408565, visit college, get fee discount

AJG-248891

➾ Join BSc AI / CSc over 60%, Maths in 10+2 get 5000 Fee dis, Join M.Com / MA Eng / MSW by 6/10, 3000 Fee dis, 9177408565

AJG-248895

DISTANCE EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్శిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA. ✆ 99493 08940

AJB-235758

WANTED

» విజయవాడ ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌కు అనుభవము ఉన్న లేడీ రిసెప్షనిస్ట్, టీం లీడర్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సెల్ : 84999 40666

AJB - 235817

» భవానీపురం DTDC Office లో పనిచేయుట కొరకు Male / Female Persons కావలెను. (పార్ట్ టైం / ఫుల్ టైం వర్కింగ్) సెల్ : 94907 50473

AJB - 236133

» ప్రముఖ ఆటోఫైనాన్స్ నందు అనుభవం కలిగిన లేడి కంప్యూటర్ ఆపరేటర్, టెలీకాలర్ కావలెను & కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ సొంత బైకు ఉండాలి. Qul: డిగ్రీ. సెల్ : 9949558181

AJB - 235822

పాఠకులకు ముఖ్య గమనిక





ప్రకటన

నా క్లయింట్లు గుంటుపల్లి రమణయ్య గారి కుమారుడు గుంటుపల్లి వెంకట గాంధీ గారు, జో.నెం.13-467, 2వ క్రాస్ స్ట్రీట్, పిన్నమనేని టీచర్స్ కాలనీ, కానూరు, విజయవాడ రూరల్ మరియు మందలపు కోదండయ్య గారి కుమారుడు మందలపు హనుమంతరావు గారు, డోరు నెం. 12-353/2/6, పార్క్ విల్లె, విల్లా నెం. 61, గాదేపల్లి గ్రామం, గుంటూరు జిల్లా, కాపురస్తులు వారి సంయాయిషీ పొంది ఈ క్రింది విధముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా... నా క్లయింట్లు జాయింట్‌గా N.T.R జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన పటమట గ్రామ ఆర్.యస్.నెం. 166/1A2 దఖలా చ.గ. 440.44 లేక చ.మీ. 368. 251 ల స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమును శెట్టిపల్లి శ్రీకాంత్ గారి భార్య చలసాని రేఖ గారు విజయవాడ టౌన్, మొగల్రాజపురం రోడ్డు, మాధవ ప్లాజా, ఫ్లాట్ నెం. B3, డో.నెం. 40-7-2/B కాపురస్తులు, ది.21-02-2024న Doc. నెం. 9583/2024 గా పటమట సబ్ రిజిస్ట్రారు వారి ద్వారా స్థిరాస్తిని దఖలు దస్తావేజు రీత్యా స్వాధీన పరచుకొని నేటి వరకు సర్వ స్వాధీన, హక్కు భుక్తములను అనుభవించుచున్నారు. ఇట్టి స్థితిలో నా క్లయింట్ సదరు ఖాళీ నివేశన స్థలమును క్రయము పొందవలెనని (రిజిస్ట్రేషన్) స్వాధీనము చేయుదలంచుటకై తీర్మానించినందున సదరు పైన పేర్కొన్న నివేశన స్థలము పై నా క్లయింట్లు అన్ని విషయాలు విపులంగా గ్రహించి సదరు నివేశన స్థలము చ.గ. 440.44 లేక చ.మీ. 368.251 రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేయవలెనని నిశ్చయించి రూ.50,000/- బయానా జాయింట్‌గా చెల్లించినారు. ఇట్టి స్థితిలో సదరు ఆస్తి మీద ఎటువంటి అభ్యంతరములు ఉన్న తగాయిదాలు ఉన్న తనఖాలు ఉన్న మరియు జప్తులు ఉన్న యెడల 15 రోజులలోపు వ్రాతపూర్వకమైన అభ్యంతరములు రిజిష్టర్ పోస్టు ద్వారా మాకు తెలియపరచగలరు. లేనియెడల సదరు క్రయము రిజిస్ట్రేషన్ మరియు స్వాధీనము ఎవ్వరికి ఎట్టి అక్షేపణలు లేవని భావించబడును. తర్వాత వచ్చు అక్షేపణలు స్వీకరించబడవు. 15 రోజుల తరువాత ఏమి వ్రాతపూర్వకమైన అభ్యంతరములు లేవని వాటికి బాధ్యులు, మా క్లయింట్లు కాదని తీర్మానము చేసుకొని నా క్లయింట్లు రిజిస్ట్రేషన్ చేయించు కుంటారు. కావున తెలియజేయటమైనది.

షెడ్యూలు: N.T.R జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా పటమట గ్రామ ఆర్.యస్. నెం. 166/1A2 ఆస్తికి సమీప డో.నెం. 59A-21/1-3, దఖలా చ.గ. 440.44 లేక చ.మీ. 368.251ల. **తూర్పు**: మొవ్వా వెంకట కృష్ణారావు గారి ఆస్తి ...అ. 52.00 లు. **దక్షిణం**: అ.80.0లు వెడల్పుగల మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు ...అ. 76.89 లు, **పడమర**: అ.40.0లు వెడల్పుగల మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు ...అ. 52.00 లు, **ఉత్తరం**: కోనేరు గంగయ్య గారు యితరులకు విక్రయించిన ఆస్తి ... అ. 76.89 లు. పైన పేర్కొన్న హద్దుల మధ్య ఖాళీ నివేశన స్థలము.

వమిడిమర్రి రాము,
అడ్వకేట్, ఫోన్: 92 90 26 76 86
షాపు నెం. 1, అన్నేరామతులసి
కళ్యాణమండపం దగ్గర, కానూరు,
విజయవాడ (రూరల్) - 520007

విజయవాడ, తేది: 02-10-2025 ఫోన్: 7013032951

వరద.. వణుకు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదికి భారీగా వస్తున్న వరద విజయవాడ - అవనిగడ్డ కరకట్టను తాకింది. కరకట్ట రోడ్డు అంచులను ఆనుకుని ప్రవహిస్తోంది. వరద మరింత పెరిగితే కరకట్ట రోడ్డుపైకి చేరే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే అవనిగడ్డ - విజయవాడకు కరకట్ట మార్గంలో రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు కూడా ఆందోళన చెందుతున్నారు. విజయవాడ - అవనిగడ్డ కరకట్ట మార్గం ఇప్పటికే పలుచోట్ల కుంగింది. ఆయా ప్రాంతాల్లో గోతులు ఏర్పడ్డాయి. కృష్ణా వరద పంట పొలాలను ముంచెత్తుతూ కరకట్ట రోడ్డును తాకింది. రోడ్డు బలహీనంగా ఉన్న చోట కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. గత నాలుగు రోజులుగా కరకట్ట రోడ్డును వరద తాకుతూ ప్రవహిస్తోంది మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ప్రవాహం పెరిగే అవకాశం కనిపిస్తోంది. విజయవాడకు భారీగా వరద వస్తే విజయవాడ - కరకట్ట రోడ్డు మీదకు వరదనీరు వచ్చే అవకాశం ఉంది. కరకట్ట మీదకు వరద నీరు వస్తే మాత్రం విజయవాడ - అవనిగడ్డ కరకట్ట రోడ్డుపై పూర్తిగా వాహనాల రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. ఇదే జరిగితే బందరు రోడ్డుపై ట్రాఫిక్ ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

ముంపులో భవానీ ద్వీపం

భవానీద్వీపం వరద ముంపునకు గురైంది. ఆదివారం ఉదయం నుంచి భవానీ ద్వీపంలోకి వరద నీరు వస్తోంది. ఆరు లక్షల క్యూసెక్కుల వరద నీరు దాటితే భవానీ ద్వీపానికి వరద నీరు వస్తుంది. గత రెండు రోజులుగా తగ్గుతూ, పెరుగుతున్న వరద కారణంగా ద్వీపంలో ఆ మేరకు వరద ప్రవహిస్తోంది. ప్రస్తుతం భవానీ ద్వీపంలో నాలుగు అడుగుల మేర వరద నీరు ఉంది. నేల మీద లాన్, మొక్కలు, ఓపెన్ జిమ్, ఓపెన్ మ్యూజిక్ ఎక్విప్‌మెంట్స్, పాత్‌వేలు, సెల్ఫీ పాయింట్స్ వంటివి వరద ముంపులో చిక్కుకున్నాయి. కాటేజీలకు మాత్రం ఎలాంటి నష్టం జరగలేదు. ఏడు లక్షల క్యూసెక్కుల వరద దాటితే మాత్రం హరిత బెర్మ్ పార్క్ నీట మునిగే అవకాశం ఉంది. హరిత బెర్మ్ పార్క్‌కు ఇప్పటికే వరదనీరు చేరుకుంది. లోపలికి వరద రాకుండా ఉండటానికి బెర్మ్‌పార్క్ అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున ఇసుక బస్తాలను సిద్ధం చేసి వరదనీరు చేరే చోటు వేస్తున్నారు. దీంతో ప్రస్తుతానికి అయితే వరద లోపలికి రాలేదు. వరద తీవ్రత ఏ కాస్త పెరిగినా కూడా బెర్మ్ పార్క్ లోపలికి చేరే అవకాశం ఉంది.

ఇళ్లలోకి ఊట నీరు

బ్యారేజీ దిగువున పద్మావతి ఘాట్ నుంచి రామలింగేశ్వరనగర్ వరకు కృష్ణా రీటెయినింగ్ వాల్ వెంబడి ఉంటున్న ప్రాంతాలలో వరద ప్రమాదం లేకున్నా.. భూమిలో నుంచి ఊట నీరు వస్తోంది. రామలింగేశ్వరనగర్, తారకరామా నగర్, కృష్ణలంక, రణదివెనగర్ తదితర ప్రాంతాలలో ఊట ఇళ్లలోకి చేరుతోంది. ఇదే సందర్భంలో కృష్ణానదిలో కలిసే మురుగునీటి కాల్వలను కూడా నిలుపుదల చేయటం వల్ల మురుగునీరు భారీగా ఈ ప్రాంతాలకు వస్తోంది. కార్పొరేషన్ అధికారులు మోటార్లను ఉపయోగించి మురుగు నీటిని తోడి కృష్ణానదిలోకి వదులుతున్నారు. గతంలో మూడు సార్లు భారీ వరదలు వచ్చినప్పటికీ ఈ కృష్ణా రీటెయినింగ్ వాల్ కృష్ణలంక, రాణిగారితోట, రామలింగేశ్వరనగర్ ప్రాంతాల వారికి వరద రాకుండా అడ్డుకుంది. ఈ దఫా మాత్రం ఊట వస్తోంది. ఈ సమస్యపై కూడా కార్పొరేషన్, ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

తగ్గని వరద ఉధృతి

ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. బుధవారం 5,81,723 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. 69 గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి 5,07,727 క్యూసెక్కులు, కీసర నుంచి 10,760, పాలేరు నుంచి 933 క్యూసెక్కుల నీరు వస్తోంది. తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలకు 14,863 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అరుణకీలాద్రి

(7వ పేజీ తరువాయి)

వీఎంసీ ఎదురుగా ఏర్పాటుచేసిన హోల్డింగ్ పాయింట్‌లోని కంపార్టుమెంట్ల నుంచి దర్శనానికి పంపుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భవానీల రాక పెరిగింది. దసరా ఉత్సవాల్లో దీక్షలు చేపట్టిన భక్తులు విజయదశమి రోజున విరమణ చేస్తారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి భవానీలు విజయవాడకు చేరుకుంటున్నారు. కాగా, తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు భవానీమాలలో అమ్మవారిని దర్శించుకున్నారు. గురువారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో వీఐపీ దర్శనాలను క్రమబద్ధీకరించాలని అధికారులు భావిస్తున్నారు.

దసరా ధమాకా

(7వ పేజీ తరువాయి)

'హలో విజయవాడ' అంటూ పలకరించగానే హర్షధ్వానాలు మిన్నంటాయి. పున్నమిఘాట్‌లో వరుసగా రెండు మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్స్ జరిగాయి. ముందుగా సింగర్ రాహుల్ వెల్లల్ కర్నాటక సంగీతంతో ఆకట్టుకున్నారు. అన్నమయ్య కీర్తనలకు కర్నాటక సంగీతాన్ని జోడించి ఆయన పాడిన పాటలు అందరిలో భక్తిభావాన్ని నింపాయి. ఆ తర్వాత సింగర్ కారుణ్య ఆధునిక సంగీతంతో అలరించారు.

జల్లు స్నానాల వద్ద రద్దీ



పాత రాజరాజేశ్వరిపేట : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలలో బుధవారం భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. జల్లు స్నానాల వద్ద రద్దీ నెలకొనగా భవానీ దీక్షా దారులు ఇరుముళ్లతో వచ్చి స్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి తరలివెళ్లారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	127,136, 147
చికెన్ విత్ స్కిన్	242
చికెన్ స్కిన్‌లెస్	252

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 525



సీనియర్ సిటిజన్లకు సన్మానం



భారతీనగర్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం పటమట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో పొన్నగంటి సాంబశివరావు అధ్యక్షతన సీనియర్ సిటిజన్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుమ్మా సాంబశివరావు, గోళ్ల నారాయణరావు, వెన్నా వల్లభరావు పాల్గొన్నారు. సెక్రటరీ కొల్లిపర రామమోహనరావు, ట్రెజరర్ శివశంకర్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కరెన్సీనగర్ దాసాంజనేయ దేవాలయంలో



కృష్ణలంక త్రిశక్తిపీఠంలో



కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో



ఆటోనగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో



సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీలో



ధనకొండ అమ్మవారు

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ

భారతీనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల పదవ రోజైన బుధవారం కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో అమ్మవారిని శ్రీ మహిషాసురమర్దినిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. గురువారం సాయంత్రం ఏడు గంటలకు శమీ(జమ్మిచెట్టు) పూజ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ●గుణదల పాత పంచాయతీ కార్యాలయం సమీపంలోని శ్రీమద్దిరావమ్మతల్లిని మహిషాసురమర్దిని దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

15వేల మందికి అన్నదానం

ఆర్ఆర్ గార్డెన్‌లోని శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీ మహిషాసురమర్దిని దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 15 వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత అమ్మిశెట్టి వాసు, పలువురు నేతలు పాల్గొన్నారు. ● పటమట దర్శిపేటలోని శ్రీరాజరాజేశ్వరి లలితా పరమేశ్వరి అమ్మవారిని, పటమట దత్తపీఠంలోని శ్రీమరకత రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శ్రీ మహిషాసురమర్దిని దేవిగా అలంకరించారు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు మహాపూర్ణాహుతి జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. కృష్ణలంక: త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారికి అభిషేకం, హోమాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. తదనంతరం పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణచేశారు. ● కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో అమ్మవారు, పాతపోస్టాఫీసు రోడ్డులోని సిద్ధేశ్వరీ అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. **రామలింగేశ్వరనగర్:** పటమట ఎన్ఎస్ఎం స్కూల్ పక్కన కౌండిన్యనగర్‌లో దేవీభక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. అన్న సంతర్పణ జరిపించారు. **ఆటోనగర్:** ఆటోనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. **మొగల్రాజపురం:** మొగల్రాజపురం ధనకొండ మీద అమ్మవారిని బుధవారం మహిషా సురమర్దనిదేవిగా అలంకరించారు. ● సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లో అమ్మవారిని మహిషాసురమర్దనిదేవిగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు. వేదిక అలంకార దాతగా ఎక్స్‌పర్ట్ సిస్టమ్‌వారు, స్వర్ణాభరణ అలంకరణ దాత శ్రీనివాస జ్యూయలరీస్ వారు ఉన్నారు.

దసరా ఉత్సవాలు సద్గుణాల ఆవిష్కరణకు ప్రతీక : ఎంపీ చిన్ని



ఎంపీ శివనాథ్ దంపతులను సత్కరించి చిత్రపటం బహూకరిస్తున్న కమిటీ చైర్మన్ తదితరులు

మొగల్రాజపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు చెడును అంతం చేసి సద్గుణాల ఆవిష్కరణకు ప్రతీక అని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జరుగుతున్న దసరా వేడుకలకు ఎంపీ కేశినేని శివనాథ్, ఆయన భార్య జానకీ దేవి హాజరయ్యారు. వీరికి కమిటీ చైర్మన్ అక్కయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి వైట్ల కృష్ణ ప్రసన్న ఇతర సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటం బహూకరించారు. అనంతరం వారు అమ్మవారిని హంసవాహనం మీద జరిగే ఊరేగింపు, ప్రభ, సంప్రదాయ నృత్యాలతో జరిగే నగరోత్సవాన్ని తిలకించారు. ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, హనుమంతురావు, లక్ష్మణరెడ్డి, సురేష్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

కళానగర్‌లో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె

లబ్బీపేట, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): 16వ డివిజన్ కళానగర్‌లోని దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారు అందరిని క్షేమంగా చూడాలని కోరుకున్నానని తెలిపారు. టీడీపీ నాయకులు వంగవీటి రాధాకృష్ణ, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు. **రాణిగారితోటలో:** రాణిగారితోట లోని మహాశక్తి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ముగిసిన యోగాసన చాంపియన్‌షిప్

మొగల్రాజపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న జాతీయ జానియర్, సీనియర్-సీ జాతీయ యోగాసన చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల ద్వారా అమరావతికి గుర్తింపు వచ్చిందన్నారు. యోగాభారత్ ప్రధాన కార్యదర్శి జైదీప్ ఆర్య మాట్లాడుతూ ఈ పోటీల నుంచి వచ్చే ఏడాది జపాన్‌లో జరిగే ఏషియన్ చాంపియన్ షిప్‌లో తలపడే జట్టును ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ సంఘం గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలను నగరంలో నిర్వహించడానికి మూడు నెలలుగా కమిటీలు విశేషంగా కృషి చేసాయని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి శేషసాయి, ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు మలినేని రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సంకల్పం వల్లే రిటైనింగ్ వాల్ పూర్తి: ఎమ్మెల్యే గద్దె


కృష్ణలంక, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం వల్లే కృష్ణానది రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయిందని తూర్పు మ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. 21వ డివిజన్ పాత పోలీసుస్టేషన్ రోడ్డు చివర (అర్చిరోడ్డు)లో రిటైనింగ్ వాల్‌ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం ఉదయం పరిశీలించారు. వరద పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం డివిజన్‌లోని సామాజిక పింఛన్ లబ్ధిదారులకు కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారని, నీటి ఊట వలన కేవలం 50 లోపు ఇళ్లవారికి ఇంటి ఆవరణలోకి నీరు చేరిందని తెలిపారు. అది కూడా ఇక్కడి భౌగోళిక పరిస్థితులు, స్థలం పల్లంగా ఉండటం, వాల్ నాలుగున్నర కిలోమీటర్ల మేర డ్రెయినేజీ నిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు గద్దె వెల్లడించారు. వాల్ దాటి నీరు వచ్చే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, వేముల దుర్గారావు, కొప్పూరి కిరణ్, కొర్రా అప్పన్న, కేశనం భావన్నారాయణ, గల్లా శ్రీను, మోకా దేవ, ఆర్.రమాదేవి పాల్గొన్నారు.

తోపుడుబండి అందజేత

రామలింగేశ్వర నగర్, ఆంధ్రజ్యోతి: రామలింగేశ్వర నగర్‌కు చెందిన నిరుపేద మహిళ వనమాల మాధవికి జీవనోపాధికై 15వ డివిజన్ జనసేన నాయకుడు అమ్ములు ఆధ్వర్యంలో పటమట పడవలరేవు వంతెనపై తోపుడు బండి అందజేశారు.

మది నిండా.. ఆధ్యాత్మిక పండుగ!





అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు ● ఆధ్యాత్మికతను పెంచిన రాహుల్ పాటలు ● కాక రేపిన కారుణ్య గీతాలు ● ఊపేసిన కార్తీక్ గానం ● నేటితో ముగియనున్న ఉత్సవ్



విజయవాడ కల్చరల్/విజయవాడ సిటీ/ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కనకదుర్గా నగర్‌లో ఏర్పాటుచేసిన కళావేదికపై ఉదయం కవులూరుకు చెందిన ఉదయశ్రీ గీత బృందం భక్తి సంకీర్త, సందీప్ మృదంగలయ విన్యాసం, పీవీఏ ప్రసాద్ భక్తి సంగీత విభావరి, కామేశ్వరి బృందం భక్తిరంజని, ఏలూరుకు చెందిన రమేష్ బాబు బృందం బుర్రకథ ఘనంగా జరిగాయి. నగరానికి చెందిన ఎస్ రిషిత సహస్ర బృందాలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యరీతులు భక్తులను భక్తి పారవశ్యంలో నడిపించాయి. నగరోత్సవం వేడుకల్లో మల్లేశ్వరి బృందం కోలాటం, రేవతి బృందం చెక్క భజనలు తెలుగు ప్రాచీన కళా వైభవాన్ని భక్తుల ముందు సాక్షాత్కారింపచేశాయి. నగరానికి చెందిన స్వాతివాహిని బృందం, శోభ బృందం కూచిపూడి కళా వైభవాన్ని ఇనుమడింపజేశాయి. కళాబృందాలు అమ్మవారి ప్రసాదం, జ్ఞాపిక అందుకుని దుర్గమ్మ దర్శనంతో పరవశించారు. వీఆర్వో గంగాధర్, సైదా పర్యవేక్షించారు.



సంగీత కళాశాలలో..

ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో ఘంటసాల పవన్‌కుమార్ శిష్యులు హవీషా చౌదరి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు జనరంజకం చేశాయి. అమలాపురానికి చెందిన వీ సత్యనారాయణ తోలుబొమ్మలాట కనువిందు చేసింది. విశాఖపట్నానికి చెందిన విజయ్‌కుమార్ డాల్ డాన్సులు, రోబోట్ డాన్సులతో పరమానందభరితుల్ని చేశారు. జి.ప్రియ శాస్త్రీయ నృత్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది. "కలహాల కాపురం" నాటిక నవ్వులతో పాటు సందేశాన్ని పంచిది.



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

హైదరాబాద్‌కు చెందిన మయూరి డాన్స్ అకాడమీ బృందం, వైదేహి శుభాస్ బృందాలు పుష్పాంజలి, మహిషాసుర మర్దిని, కామాక్షి స్తుతి, రామకీర్తన, మహాకాళి వంటి అంశాలతో చూడచక్కని ప్రదర్శన చేసి ఆహూతులను ఆద్యంతం మైమరిపించారు. గుంటూరుకు చెందిన పెరవలి నందకుమార్ సంగీత కచేరి శ్రోతలకు వీనులు విందునందించింది. గుంటూరుకు చెందిన పీవీ రమణ బృందం లెనిన్, నాగరాజు బృందంగా సాగించిన జానపద గేయాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. జయహో జయహో జానపదం, కోనసీమ, రామచంద్రపురానికి చెందిన ప్రేమానందం బుర్రకథ నవరసభరితంగా సాగింది. కాకినాడకు చెందిన వనపర్తి ఏడుకొండలు బృందం ప్రదర్శించిన తోలుబొమ్మలాట ప్రేక్షకులను అలరించింది. జోరుగా ప్రదర్శించిన శిక్షణ రాయబారం నాటకం రక్తికట్టించింది. చివరగా శ్రీ కృష్ణ రాయబారం నాటక ప్రదర్శన జరిగింది.

ముగిసిన కొండపల్లి విజయనర్తనం

కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న విజయనర్తనంలో భాగంగా చివరిరోజు వందమంది విద్యార్థులు శాస్త్రీయ జానపద నృత్యాంశాలను ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రియదర్శిని బృందం 30 మందితో ఆనంద నర్తన గణపతి, శంభో శివా, ప్లేట్ డాన్స్, తిల్లానా వంటి అంశాలతో అలరించగా, వాసుదేవరావు బృందం పుష్పాంజలి,



శ్రీ విఘ్నరాజ భజే, పర్వదేవిస్తుతి, నామ రామాయణం, తిల్లానా, దాండియా అంశాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. నగరానికి చెందిన సీహెచ్ అజయ్‌కుమార్ శిశు బృందం 40 మంది కూచిపూడి నృత్యాంశాలు, జానపదాలు ప్రదర్శించి పెద్దల ప్రశంసలు అందుకున్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్, కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చిట్టిబాబు, కమిషనర్ రమ్యకీర్తన పాల్గొని కళాకారులను అభినందించి సత్కరించారు.

పున్నమి ఘాట్‌లో..

అన్నమాచార్య అద్భుత కీర్తనలకు కర్నాటక శాస్త్రీయ సంగీతాన్ని జోడించి మధురమైన కంఠంతో రాహుల్ వెల్లల్ పాడిన కీర్తనలు పున్నమి ఘాట్‌లో ఆధ్యాత్మికతను ఉప్పొంగించాయి. బెంగళూరుకు చెందిన రాహుల్ కర్ణాటక సంగీతంలో సిద్ధహస్తుడు. ప్రపంచంలోనే ఎన్నో ప్రాంతాల్లో తన అద్భుతమైన గాత్రంతో ప్రేక్షకులను మెప్పించారు. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమి ఘాట్‌లో బుధవారం రాత్రి అతడు తన గాత్రంతో మైమరిపించాడు. దాదాపు 45 నిమిషాల పాటు విరామం లేకుండా ఆధ్యాత్మిక గానకచేరి చేసి ప్రేక్షకుల మెప్పు పొందాడు. కూచిపూడి నర్తకి అనన్య రెడ్డి బృందం ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. మహిషాసుర సంహారాన్ని, అమ్మవారి ఉగ్రరూపాన్ని ఈ బృందం అద్భుతంగా ప్రదర్శించింది. సింగర్ అయ్యప్ప సాయి కృష్ణన్ ఓం శివోహం.. ఓం శివోహం..రుద్ర నామం భజేహం అంటూ భక్తి గితాలు ఆలపించి ప్రేక్షకులను ఆధ్యాత్మిక లోకానికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత పలు సినీ గితాలు ఆలపించి యువతలో జోష్ నింపాడు.

కాకరేపిన.. కారుణ్య

పున్నమి ఘాట్‌లో బుధవారం రాత్రి జరిగిన కారుణ్య లైవ్ కాకరేగింది. ప్రఖ్యాత సింగర్ కారుణ్య తన మధురమైన కంఠంతో తన అభిమానులను, ప్రేక్షకులను మరోలోకంలోకి తీసుకెళ్లాడు. వేదికపై జరుగుతున్న కారుణ్య గాన లహరికి యువత కాలు కదిపింది. వేదిక ముందుకు దూసుకెళ్లి డ్యాన్సులు చేశారు. ప్రేమలో విఫలమైన మజ్నులను దృష్టిలో ఉంచుకుని వారికోసం ప్రత్యేకంగా విరహ గీతాలను ఆలపించి ఓలలాడించాడు. సరిగమ.. పదనిసలను కృష్ణాతీరంలోని సుతిమెత్తని అలల మాదిరిగా ఆలపించి రంజింపజేశాడు.

గొల్లపూడిలో ఊపేసిన కార్తీక్ గానం

అతడు పాడిన ప్రతి పాట అద్భుతం, అమోఘం, అనిర్వచనీయం. అతడు గొంతు విప్పితే స్వరం కలపాల్సిందే. పాట అయిపోయే వరకు చప్పట్లు కొట్టాల్సిందే. ప్రతి ఒక్కర్నీ తన స్వరాల ఝరిలో ఓలలాడించి మైమరిపించారు సింగర్ కార్తీక్ ! విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానంలో బుధవారం కార్తీక్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ ఆద్యంతం అదిరిపోయింది. అద్భుతంగా సాగింది. ఇప్పటి వరకు జరిగిన కాన్సర్ట్‌లన్నీ ఒక లెక్క అయితే కార్తీక్ కన్సర్ట్ మరో లెక్క అన్నట్లుగా సాగింది. దసరాకు పండుగ ముందు రోజు ఎగ్జిబిషన్‌కు ప్రేక్షకులు భారీగా తరలి వచ్చారు. కార్తీక్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ ఎప్పుడు మొదలవుతుందా అని ఎదురు చూశారు. వారి ఆశలకు తగ్గట్టుగానే షో కొనసాగింది.

మిత్రమండలి, డెకాయిట్ చిత్రాల టీజర్స్ విడుదల

దసరా ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బుధవారం తెలుగు మూవీ మిత్రమండలి టీమ్ సందడి చేశారు. ఈ సందర్భంగా చిత్రం ఈజర్ ప్రదర్శించారు. చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ ఆర్ ఆర్ ధ్రువన్ చిత్రంలోని పాటను పాడి ఆడియన్స్‌ను అలరించారు. హీరో ప్రియదర్శి, సోషల్ మీడియా క్వీన్ నీహారిక, ప్రసాద్ బెహరా, లద్దూ సందడి చేశారు. సుడిగాలి సుధీర్ నటించిన హైలెస్సో ప్రమోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అడవిశేషు నటించిన డెకాయిట్ చిత్రం టీజర్‌ను ప్రదర్శన చేశారు. కార్తీక్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్, మిత్రమండలి టీజర్ విడుదలకు ముందు స్టేజ్‌పై సత్య మాస్టర్ బృందం వారు పలు చిత్రాల్లోని పాటలకు డాన్స్ చేసి ఆడియన్స్‌ను అలరించారు.





మలేషియా బృందానికి సీఆర్‌డీఏ అధికారుల స్వాగతం

కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1 నుంచి 5 వరకు 5 రోజుల పాటు రాజధాని అమరావతిలో పర్యటించేందుకు మలేషియా బృందం అమరావతికి చేరుకొంది. బృందంలోని సభ్యులైన మలేషియాలోని క్లాంగ్ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు వైబీ తువాన్ గణపతిరావు వీరమన్, మలేషియా-ఆంధ్ర బిజినెస్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి సతీశరావు వెంకటేశం బృందం గన్నవరం విమానాశ్రయానికి చేరుకొన్నారు. సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ అమిలినేని భార్గవ్ తేజ, సీఆర్‌డీఏ ఆఫీస్ మేనేజ్‌మెంట్ విభాగ డైరెక్టర్ వల్లభనేని శ్రీనివాసరావు, సీఆర్‌డీఏ కమ్యూనికేషన్స్ విభాగ జేడీ జీ రామరాజు, డిప్యూటీ డైరెక్టర్ అండ్ దక్షిణాసియా ఇన్వెస్టెమెంట్ ఇన్‌చార్జి ఎం సిద్ధార్థ వర్మ మలేషియా ప్రతినిధులకు బొకేలిచ్చి స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అమరావతిలో అడుగుపెట్టిన ప్రతినిధులకు సిబ్బంది సంప్రదాయ పద్ధతిలో తిలకం దిద్ది స్వాగతం పలికారు.

బాలికకు రాయపాటి శైలజ పరామర్శ

● వైద్యుల నుంచి వివరాలు తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్

వన్‌టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నున్న పోలీసుస్టేషన్ పరిధిలో బాబాయి నుంచి లైంగిక దాడికి గురై విజయవాడ పాత ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను బుధవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాధితురాలిని సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కేసు విచారణను తక్షణమే చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత బాలికకు కౌన్సెలింగ్ ఇవ్వాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీకి సూచించారు. బాధిత బాలిక పిన్ని, అమ్మమ్మను ఆమె ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిశార్జి తరువాత బాలిక నిర్ణయం మేరకు హోమ్‌లో పెట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం, నోడల్ ఆఫీసర్ సాయిగీత, డీసీటీవో ఎం రాజేశ్వరరావు, ఓఎస్‌సీ సిబ్బంది, డీసీపీయూ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ కొండను పరిశీలించిన కలెక్టర్, సీపీ

వన్‌టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం వన్‌టౌన్‌లోని గాంధీ కొండపై పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు సంబంధిత అధికారులు, గాంధీ కొండ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపై చేపట్టిన ఏర్పాట్లు గురించి కలెక్టర్, సీపీలు అధికారులను, గాంధీ కొండ ప్రతినిధులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.పోలీసు కమిషనర్ మాట్లాడుతూ గాంధీకొండ పరిసర ప్రాంతాల్లో, వీవీఐపీలు ప్రయాణించే మార్గాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమన్వయం చేసుకుని కట్టుదిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయటం జరుగుతుందన్నారు. గాంధీ కొండ కమిటీ చైర్మన్ డాక్టర్ గాంధీ వీసీ కాజ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, కొత్తపేట సీఐ పాల్గొన్నారు.

వీవీఐపీ కారులో దర్జాగా కొండపైకి హేమ..!

విజయవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిపై అధికార పార్టీకి ఒక రకంగా, ప్రతిపక్షానికి మరో రకంగా మర్యాదలు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. వాటిని బలపరిచేలా బుధవారం పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్సీ కారులో సినీ నటి హేమను కొండపైకి తీసుకువచ్చి వీవీఐపీ దర్శనం చేయించటం చర్చనీయాంశంగా మారింది. సినీనటి హేమను తన కారులోనే ఆ ఎమ్మెల్సీ పంపినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కలెక్టరేట్ రిఫరల్ వీవీఐపీ కారులో వచ్చినట్టుగా మరో వాదన ఉంది. ఏ కారులో వచ్చిందన్నదానిపై చర్చ. ఏ కారులో వచ్చినా హేమను వైసీపీ ఎమ్మెల్సీ దర్శనానికి రిఫర్ చేశారు. హేమ దర్జాగా అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

గ్రాండ్ షో.. మెగా కార్నివాల్

● 3 వేల మంది కళాకారులతో అతిపెద్ద కార్నివాల్
● ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు





ఆంధ్రజ్యోతి, విజయవాడ: పది రోజులుగా నగరంలో తళుక్కుమనిపించిన 'విజయవాడ ఉత్సవ్' ముగింపు సందర్భంగా గురువారం నగరంలో 'మెగా కార్నివాల్' నిర్వహిస్తున్నారు. తొలి ప్రయత్నంలోనే ప్రపంచంలోనే అత్యద్భుతమైన మెగా కార్నివాల్‌ను నిర్వహిస్తున్నారు. ప్రపంచం గుర్తించేలా మెగా కార్నివాల్‌కు గిన్నిస్ రికార్డు సాధించే ప్రయత్నాన్ని చేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి బెంజిసర్కిల్ వరకు 2 కిలోమీటర్ల మేర మెగా కార్నివాల్ సాగుతుంది. ఇందులో దసరా థీమ్‌తో పగటి వేషాల ప్రదర్శన, అమ్మవారి ఉత్సవ మూర్తులున్న రథం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దసరా ఉత్సవాలంటే మైసూరు, కలకత్తాలే కాదని ఆ స్థాయిలో అంతకు మించి విజయవాడలోనూ నిర్వహించగలమని ఇప్పటికే నిర్వాహకులు జాతీయస్థాయిలో పది రోజులుగా విజయవాడ ఉత్సవ్ నిర్వహణ ద్వారా గుర్తింపు తీసుకువచ్చారు. గిన్నిస్ నిర్వాహకుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగబోతోంది.

3 వేల మంది కళాకారులతో మెగా కార్నివాల్

స్టేడియం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్నివాల్‌లో నాసిక్ డోలు, కాళికా వేషాలు, పోతురాజులు, లంబాడి సంప్రదాయ నృత్యం, గుస్సాడి, కేరళ డ్రమ్స్, క్రరసాము, తీన్మార్, సన్నాయి మేళం జరగనున్నాయి. వీటితో పాటు కథాకళి, స్టిక్ వాకర్స్ పగటి వేషాలు, వీరనాట్యం, గరగలు, కొమ్ముకోయ, థింసా, తప్పెటగుళ్ల, వీరాగాసలు, బేబీనాట్యం, చెక్కభజనలు, పులివేషాలు, కోలాటం, గారడి, యక్షకళలు, బేతాళసెట్టు, అఘోరాలు, గొరిల్లా డాన్స్‌లు, డప్పు వాయిద్యాలు వంటి దసరా వేషధారణల్లో 3వేల మంది కళాకారులు పాల్గొంటారు. ఈ కళాకారులు రాష్ట్రం నలుమూలలా మండపపేట, రావులపాలెం, రంపచోడవరం, అరకు, బొబ్బిలి, రేపల్లె, విజయనగరం, విజయవాడ (కృష్ణలంక, వన్‌టౌన్, అజిత్ సింగ్ నగర్, యనమలకుదురు), శ్రీకాకుళం, రాజమండ్రి, భద్రాచలం, ఖమ్మం, వరంగల్, కర్ణాటక, గుంటూరు, తాడేపల్లి గూడెం, ధర్మవరం, కర్నూల్ ప్రాంతాలకు చెందిన కళాకారులకే కాకుండా ఇతర రాష్ట్రాల్లోని పుణే, బొంబాయి, హైదరాబాద్ నుంచి కూడా వచ్చి దసరా కార్నివాల్‌లో పాల్గొంటున్నారు.

ప్రధాన ఆకర్షణగా అమ్మవారి రథోత్సవం

కార్నివాల్‌లో ప్రధాన ఆకర్షణగా అమ్మవారి ఊరేగింపునకు ప్రత్యేకంగా రథాన్ని రూపొందించారు. రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలుంటాయి. మంగళవాయిద్యాలు, బృందాల నృత్యాలు, సంప్రదాయ వేషధారణలు, సాంస్కృతిక విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. విజయవాడ దసరా మహోత్సవాలకు మరింత శోభ తీసుకురావడమే కాకుండా ప్రజల్లో భక్తి నింపే వేదికగా నిలవనుంది.

కార్నివాల్‌ను ప్రారంభించనున్న సీఎం

నగరంలో నిర్వహించే మెగా కార్నివాల్‌కు ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బందరు రోడ్‌లోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు కార్నివాల్ సాగుతుంది.

ప్రపంచానికి చాటిచెప్పేలా...

విజయదశమి సందర్భంగా విజయవాడ నగరానికి ప్రపంచవ్యాప్త గుర్తింపును తీసుకురావడమే లక్ష్యంగా మెగా కార్నివాల్‌ను నిర్వహిస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. బుధవారం బందరు రోడ్డులో మెగా కార్నివాల్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. 3 వేల మంది కళాకారులు పాల్గొని దసరా సంబరాలను మరింత వైభవంగా మార్చనున్నారన్నారు. కార్నివాల్‌ను గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించేందుకు 'సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ' ఆధ్వర్యంలో ప్రయత్నం చేస్తున్నామన్నారు. విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ, స్థానిక కళాకారులకు కొత్త ఉత్సాహాన్ని నింపే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

గొల్లపూడిలో..
సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు
మూవీ ఈవెంట్స్
లైవ్ మ్యూజిక్ కన్సర్ట్

పున్నమిఘాట్‌లో..
అనన్య రెడ్డి క్లాసికల్ డ్యాన్స్
సందీప్ నారాయణ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్
డిజె చెండా అండ్ వాటర్ డ్రమ్స్

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..
భవ్య శ్రీ, కృష్ణవేణి, కూచిపూడి నృత్య ప్రదర్శన
మంజూష కూచిపూడి నృత్య ప్రదర్శన
పోపూరి గౌరినాథ్ శిష్య బృందం సంగీత విభావరి
రాజీవ్ బ్రదర్స్ బృందం డప్పుల ప్రదర్శన
తోట దేవుడు బృందం తోలు బొమ్మలాట
పౌరాణిక పద్య నాటకం భక్త ప్రహ్లాద

ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో..
బుర్రా కృష్ణవేణి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన
సంగీత కచేరీ
స్వర్ణలత బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన
రాజేశ్వరి బృందంతో బుర్రకథ
టీ రాజు బృందంతో ఫోక్ సాంగ్స్
జానపద పౌరాణిక పద్య నాటకం బాలనాగమ్మ

కొనుగోలుదారుల సందడితో సోనోవిజన్ దసరా సేల్

గుణదల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి జీఎస్‌టీ తగ్గింపు ధరలతో సోనోవిజన్‌లో అమ్మకాలు నిర్వహిస్తుండటంతో కొనుగోలుదారులు టీవీలు, సెల్‌ఫోన్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, మిక్సీ వంటివి కొనుగోలు చేయడానికి బారులు తీరారు. దీనికి తోడు ఎనికేపాడులో నూతనంగా ప్రారంభించిన సోనోవిజన్ షోరూమ్‌తో పాటు మిగిలిన సోనోవిజన్ షోరూమ్‌లో ప్రతి రూ.2వేల కొనుగోలుపై వినియోగదారులకు స్క్రాచ్ కార్డ్ ఇవ్వడం జరుగుతుంది. ఇందులో రూ.100 నుంచి రూ.లక్ష వరకు తక్షణ నగదు బహుమతిని అందుకునే సౌలభ్యం కల్పించారు. దీంతో కొనుగోలు దారులు సెప్టెంబరు 22 నుంచి వస్తువుల కొనుగోళ్లకు గాను సోనోవిజన్ షోరూమ్‌కు భారీగా తరలివస్తున్నారు. సోనోవిజన్‌లో ఈఎమ్‌ఐపై కొనుగోలు చేసే వారికి 10 నుంచి 15శాతం వరకు క్యాష్ బ్యాక్ ఆఫర్ ఇస్తుండటంతో వినియోగదారులు మరింత ఆసక్తిగా సోనోవిజన్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. సోనోవిజన్ మేనేజింగ్ పార్టనర్ పొట్లూరి భాస్కరమూర్తి మాట్లాడుతూ ఉదాహరణకు రూ.55వేలున్న 1.5 టన్ను 5 స్టార్ ఏసీపై జీఎస్‌టీ తగ్గింపు దసరా డిస్కౌంట్ పోను అమ్మేరేటు రూ.41వేలుంటుందని, దానిపై స్క్రాచ్ కార్డ్ స్కీములో రూ.2500 పైన తగ్గింపుతో 38,500కే వస్తుందన్నారు. మళ్లీ దీనిపై క్రెడిట్ కార్డ్ ద్వారా వడ్డీలేని ఈఎమ్‌ఐలో తీసుకుంటే ఈ ధర కన్నా మరో రూ.4వేలు తగ్గుతుందన్నారు. అలాగే సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్‌పై రూ.13,000, ఫ్రంట్‌లోడ్ వాషింగ్ మెషిన్ మీద రూ.7వేలు, మొబైల్స్‌పై రూ.12వేలు, ల్యాప్‌టాప్‌పై రూ.11 వేలు ఇలా మోడల్‌ను బట్టి క్యాష్ బ్యాక్‌లున్నాయన్నారు. క్వాలిటీ ప్రొడక్ట్స్ తక్కువ ధరలు, వినియోగదారులకు క్యాష్‌బ్యాక్ అందించడంలో సోనోవిజన్ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు.

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

'ఆహా.. ఏమి నాణ్యత..!' ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

గుణదల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆహా..! ఏమి నాణ్యత పేరుతో ఆంధ్రజ్యోతి సిటీ ఎడిషన్లో బుధవారం ప్రచురితమైన కథనానికి వీఎంసీ అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఇన్నర్ రింగ్‌రోడ్ కాంక్రీట్ ఊడిపోవడంతో రంధ్రం ఏర్పడిన విషయం విదితమే. దీనిపై ఆహా ఏమి నాణ్యత పేరుతో కథనం రావడంతో వీఎంసీ అధికారులు సమస్య మరింత జటిలం కాకముందే యుద్ధ ప్రాతిపదికన బుధవారం సాయంత్రానికి ఎట్టకేలకు మరమ్మతులు పూర్తిచేశారు.

సూపర్ జీఎస్టీతో సూపర్ సేవింగ్

● ప్రచారాన్ని ప్రారంభించిన ఎంపీ కేశినేని శివనాథ్

భారతీనగర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పన్ను సంస్కరణల ద్వారా సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించిందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలకు జీఎస్‌టీ తగ్గింపుల ద్వారా లభిస్తున్న లాభాలపై అవగాహన కల్పించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ ప్రచారాన్ని బుధవారం గురునానక్ కాలనీలోని తన కార్యాలయంలో ప్రారంభించారు. రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్క రఘురామరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్ పాల్గొన్నారు.

వ్యవసాయరంగంలోని వారికి లాభం: జేసీ

కలెక్టరేట్: సూపర్ జీఎస్టీతో రైతులకు, వ్యవసాయ రంగంలో ఉన్నవారికి లాభం చేకూరుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా అన్నారు. బుధవారం విజయవాడ గ్రామీణం నున్నలో సూపర్ జీఎస్టీపై జరిగిన అవగాహన, ర్యాలీలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఉపయోగించే వస్తువులు పనిముట్లపై 5శాతం జీఎస్టీ మాత్రమే ఉంటుందన్నారు. కొత్త జీఎస్టీలో బిందు సేద్యంపై రైతులకు వివిధ పంటల్లో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.

రూ.2.6కోట్ల విలువైన 13.27 కేజీల గంజాయి స్వాధీనం

గుణదల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలింపులో ఆరితేరిన వ్యక్తిని ఈనెల 28న డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్) అధికారులు తమిళనాడులోని సేలం సమీపంలో అరెస్టు చేశారు. అతడిచ్చిన సమాచారం మేరకు చత్తీస్‌గఢ్ వద్దనున్న సుక్మా యేరియా నుంచి గూడ్స్ క్యారియర్ ట్రక్కులో పైపుల మధ్యన గంజాయి ప్యాకెట్లు అమర్చి సరఫరా చేస్తుండటాన్ని డీఆర్ఐ అధికారులు పసిగట్టి రామవరప్పాడు రింగ్ వద్ద బుధవారం పట్టుకున్నారు.అందులో 561 ప్యాకెట్లలో రూ.2.6 కోట్ల విలువైన 13.27 కేజీల గంజాయి ప్యాక్‌ను అధికారులు గుర్తించి లారీలోని ఇద్దర్ని అరెస్టుచేసి అశోక్‌నగర్లోని డీఆర్ఏ కార్యాలయానికి తరలించినట్టు తెలిపారు.

కుమార్తె మృతి.. మనస్తాపంతో తల్లి ఆత్మహత్య

విద్యాధరపురం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా కొల్లిగూడ గ్రామానికి చెందిన సుశీల సబర (42) భర్తతో విభేదించి ముగ్గురు సంతానంతో రెండున్నరేళ్ల క్రితం విజయవాడ వచ్చింది. రవికిషోర్ సహాయంతో హెచ్‌బీ కాలనీలోని ఎంఐజీ బ్లాక్‌లో ఉంటూ తాపీ పనులు చేసుకుంటుంది. కుమార్తెకు వివాహం కాగా బెంగళూరులో ఉంటుంది. కుమారుడు జిత్తు సబర కూడా అక్కడే ఉంటున్నాడు. 5 నెలల క్రితం కుమార్తె అంజలి ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి సుశీల మనస్తాపంతో మద్యం తాగుతోంది. గతనెల 29న రాత్రి ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుసుకున్న ఇంటి ఓనర్ రవికిషోర్ బెంగళూరులోని జిత్తు, అతడి బంధువులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వీఎంసీ అదనపు కమిషనర్‌గా రవీంద్రరావు

ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా ఎ.రవీంద్రరావును ప్రభుత్వం బుధవారం నియమించింది. రవీంద్రరావు గతంలో విజయవాడ రూరల్, సెంట్రల్ తహసీల్దారుగా పనిచేశారు. నందిగామ ఆర్డీవోగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లాలో ఎఫ్ఎస్‌వోగా పనిచేస్తున్నారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ అయిన రవీంద్రరావును ప్రస్తుతం వీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించింది.

నేడు విజయ దశమి

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ రాజరాజేశ్వరీదేవి

ఆశ్వయుజ శుద్ధ దశమి (విజయదశమి) గురువారం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు శరన్నవరాత్రి మహోత్సవాల్లో చివరి రోజైన విజయదశమి నాడు శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారు. సకల భువన బ్రహ్మాండాలకు అధిదేవత ఆమె. షోడశ మహామంత్ర స్వరూపిణి అయిన అమ్మను మహాత్రిపుర సుందరిగా, అపరాజితాదేవిగా భక్తులు ఆరాధిస్తారు. అపరాజితాదేవి పేరు మీద 'విజయదశమి' ఏర్పడింది. విజయాన్ని సాధించింది కాబట్టి 'విజయ' అని అంటారు. పరమ శాంత స్వరూపంతో, చిరునవ్వులు



చిందిస్తూ, చెరుకుగడ చేతితో పట్టుకుని ఆమె దర్శనమిస్తుంది. మణిద్వీపంలో శ్రీపురంలో నివాసం ఉండే ఆమెను 'చింతామణి'గా పిలుస్తారని ప్రతీతి. పరమేశ్వరుడి అంకం ఆసనంగా... ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను భక్తులకు అనుగ్రహిస్తుంది. యోగమూర్తిగా మాయామోహిత మానవ చైతన్యాన్ని ఉద్దీపనం చేస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీ చక్రానికి ఈ తల్లి అధిష్ఠాన దేవత. ఆమెను కొలిస్తే సమస్త శక్తులూ సమకూరుతాయనీ, ఆ అమ్మ భక్తుల కోరికలను నెరవేరుస్తుందనీ, మనసారా కొలిస్తే బ్రహ్మజ్ఞానం కలుగజేస్తుందనీ నమ్మిక. అమ్మవారిని ఎరుపు రంగు గాజులతో అలంకరించి, కుంకుమార్చన చేయడం శ్రేష్ఠం.

నైవేద్యం :
పరమాన్నం, ఆరు రుచులతో కూడిన (షడ్రసోపేత) పదార్థాలు

అలంకరించే చీర రంగు : ఆకుపచ్చ, తెలుపు

అర్చించే పూల రంగు : ఎరుపు

పారాయణ చెయ్యాల్సింది :
లలితా సహస్రనామం

అర్చన: ఎర్రటి గాజులతో అలంకరించి, కుంకుమార్చన

పర్వదినం



నమామి దుర్గా...

ఈ జగత్తును నడిపించేది కంటికి కనిపించని ఒక మహా శక్తి. ఆ మహా శక్తికి వెయ్యికి పైగా నామాలు ఉన్నాయి. చైతన్య స్వరూపిణి అయిన ఆమె అంతటా ఉంది, అందరిలోనూ ఉంది. ఆమె నిర్గుణ, నిరాకార, నిరంజన పరమేశ్వరి. ప్రకృతి మాతగా తన సంతానాన్ని, రక్షిస్తోంది, పోషిస్తోంది. ఆమె... సరస్వతి, మహాలక్ష్మి మహాదుర్గ... ముగ్గురమ్మల మూలపుటమ్మ. బ్రహ్మ విష్ణు శివాత్మిక. సృష్టి, స్థితి, లయకారిణి. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తుల కలబోత. ఆమెను దుర్గాదేవిగా శరత్కాలంలో పూజించడం దేశమంతటా ఉన్న సంప్రదాయం. ఈ ఆరాధనోత్సవాలు తొమ్మిదిరోజుల పాటు జరుగుతాయి. ఈ నవరాత్రులు శరత్కాలంలో జరుగుతాయి కాబట్టి శరన్నవరాత్రులనీ, దుర్గా దేవికి సంబంధించినవి కాబట్టి దుర్గా నవరాత్రులని, దేవి నవరాత్రులనీ పిలుస్తారు. 'నవ' అంటే తొమ్మిది అని ఒక అర్థం. అది పూర్ణ సంఖ్య. జగన్మాత పూర్ణస్వరూపం అని చెప్పే సంకేతం ఇది. మరొక అర్థంలో 'శరత్' అంటే సంవత్సరం. ఏడాదంతా దేవిని పూజించలేకపోయినా శరన్నవరాత్రులలో ఆరాధిస్తే, సంవత్సరమంతా పూజించిన ఫలం దక్కుతుందంటారు.

'దయ, తృప్తి, శ్రద్ధ, క్షమ, ధ్రుతి, పుష్టి, శాంతి, లజ్జ తదితర గుణాలన్నీ పరాశక్తివే' అని 'చండీ సప్తశతి' పేర్కొంది. మరొక ప్రత్యేకమైన సాత్విక గుణం లలిత. అంటే అతి సుందరమైనది. త్రిభువనాలలో సుందరమైనది. అందుకని ఆమెను 'లలితా త్రిపురసుందరి'గా పూజిస్తారు. సర్వాభీష్ట సిద్ధి ఆశించే దేవతలకు, మానవులకు ఆరాధ్య దేవత లలితా త్రిపుర సుందరి. శరన్నవరాత్రులలో దుర్గను రోజుకొక్క రూపంలో, తొమ్మిది రోజుల పాటు తొమ్మిది నామాలతో అర్చిస్తారు. వారిని 'నవదుర్గలు'గా పూర్వులు పేర్కొన్నారు.

ప్రథమం శైల పుత్రీం ద్వితీయా బ్రహ్మచారిణీ తృతీయా
చంద్రఘంటేతి, కూష్మాండేతి చతుర్థకీ, పంచమాం
స్కందమాతేతి, షష్ఠా కాత్యాయనీతిచ, సప్తమా
కాళరాత్రీతి, మహాగౌరీతిచాష్టమీ,
నవమా సిద్ధిధాత్రీతి, నవదుర్గాః ప్రకీర్తితా...

ఇది దుర్గకు గల నామ, రూపాలను తెలిపే శ్లోకం. శరన్నవరాత్రులో ఈ రూపాలతో దుర్గాదేవిని పూజిస్తారు. ఈ రూపాల విశిష్టతలను తెలుసుకుందాం.

శైలపుత్రి: హిమవంతుని కూతురు కాబట్టి అమ్మవారికి శైలపుత్రి, హైమవతి, పార్వతి (పర్వత పుత్రిక) అనే నామాంతరాలు ఉన్నాయి. ఆమె వృషభ వాహిని. కోరిన కోర్కెలు తీర్చే తల్లి.

బ్రహ్మచారిణి: దక్షుని కుమార్తె సతీదేవి. తండ్రి చేసిన అవమానం భరించలేక యోగాగ్నిలో తనువు చాలించింది. నారదుని ఉపదేశంతో గత జన్మ వృత్తాంతాన్ని తెలుసుకొని, శివుణ్ణే పతిగా పొందాలనే కోరికతో తపస్సు చేయడానికి ఉపక్రమించిన రూపమే బ్రహ్మచారిణి. శివుని కోసం తపస్సు చేయడానికి బ్రహ్మచర్యం అవలంబించింది కాబట్టి 'బ్రహ్మచారిణి' అని పిలుస్తారు. ఆమెను ఆరాధిస్తే చేపట్టిన కార్యాల్లో విజయం చేకూరుతుంది.

చంద్రఘంట: పది చేతుల్లో ఆయుధాలు ధరించి, యుద్ధ సన్నద్ధురాలైన ఈమెను పూజిస్తే ధైర్యంతో పాటు శత్రు జయం లభిస్తుంది.

కూష్మాండ: కూష్మాండ అంటే భూమికి సంకేతం. ఈ విశ్వాన్ని సృష్టించినది అనే అర్థంతో... ఆ పేరుతో పూజలు అందుకుంటోంది. ఆమెకు ఎనిమిది భుజాలు. ఆమెను ఆరాధించడం వల్ల రోగాలు నాశనమై, ఆయురారోగ్యాలు చేకూరుతాయి.

స్కందమాత: స్కందుడికి (కుమారస్వామికి) తల్లి కాబట్టి ఆమెకు 'స్కందమాత' అని పేరు. స్కందమాత శాంతస్వరూపిణి. ఆమెను పూజించడం వల్ల శాంతి, సౌఖ్యం, జ్ఞాన విజ్ఞానాలు లభిస్తాయంటారు.

కాత్యాయని: త్రిమూర్తుల తేజంతో మహిషాసురుణ్ణి మర్దించడం కోసం... కాత్యాయన ముని ఆశ్రమంలో జన్మించి, ఆయనతో పూజలందుకుంది కాబట్టి ఆమెకు 'కాత్యాయని' అనే పేరు వచ్చింది. నాలుగు భుజాలు కలిగిన ఆమెను ఆరాధిస్తే జీవితంలో దుఃఖాలు, బాధలు, కష్టాలు ఉండవని విశ్వాసం.

కాళరాత్రి: నాలుగు భుజాలతో, నల్లని దేహంతో... గార్ధభ వాహనాన్ని అధిరోహించి, వరద, అభయ ముద్రలతో భక్తులను ఆమె అనుగ్రహిస్తుంది. ఆమె దుష్టులకు భయంకరి, శిష్టులకు అభయంకరి. కాళరాత్రి అమ్మవారిని పూజిస్తే గ్రహదోషాలు నశించి, జీవన సౌఖ్యం లభిస్తుంది.

మహాగౌరి: నాలుగు భుజాలు కలిగిన ఆమె వరద, అభయ హస్తాలతో భక్తులను కటాక్షిస్తుంది. శ్వేతవర్ణంలో ఉండే ఈ మాతను పూజిస్తే, పాపాలు తొలగిపోతాయి, శుభాలు సమకూరుతాయి.

సిద్ధిధాత్రి: నాలుగు చేతుల్లో శంఖ, చక్ర, గదా, పద్మాలను ధరించి భక్తులను రక్షిస్తుంది. సర్వసిద్ధులను ప్రసాదించే తల్లి కాబట్టి ఆమెను 'సిద్ధిధాత్రి' అంటారు. ఆమెను పూజిస్తే జీవితంలో సుఖ సంతోషాలు నెలకొంటాయి.

ఇలా తొమ్మిది రూపాలతో అర్చనలు అందుకుంటున్న దుర్గాదేవి ఎందరో అసురులను నిర్జించింది. నవరాత్రుల తరువాత... దశమి తిథినాడు దుర్గాదేవిని అపరాజితగా, రాజరాజేశ్వరిగా నుతిస్తూ ఉత్సవాలు జరుపుకొంటారు. ఆ రోజును 'విజయదశమి'గా వ్యవహరిస్తారు.

• ఆయపిళ్ళ రాజపాప

పాలపిట్ట దర్శనం...

దసరా పండుగలో శమీ వృక్షంతో పాటు పాల పిట్టకు ఉన్న ప్రాధాన్యం కూడా ఎక్కువే. పాలపిట్టను పవిత్రంగా భావించడం వెనుక ఉన్న జానపద గాథ ప్రకారం... పాండవులు అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేసి తిరిగి వస్తూ ఉండగా, వారికి పాలపిట్ట కనిపించింది. వారు దాన్ని చూసినప్పటి నుంచీ వరుసగా అన్నీ విజయాలే కలిగాయట! పాల పిట్ట దర్శనం వల్ల చేసే ప్రతి పనిలోనూ గెలుపు తప్పకుండా లభిస్తుందన్న విశ్వాసం ఉంది.అందుకే విజయ దశమి రోజున పాలపిట్టను దర్శించడం శుభప్రదంగా భావిస్తారు.



శమీ పూజ...


విజయదశమి రోజున అపరాజితాదేవిని శమీవృక్షం వద్ద పూజించే సంప్రదాయం ఉంది. శమీ వృక్షం (జమ్మి చెట్టు)లో అపరాజితా దేవి కొలువై ఉంటుందని విశ్వాసం. అమ్మవారి సహస్ర నామాల్లో 'అపరాజిత' ఒకటి. అంటే 'పరాజయం లేనిది' అని అర్థం. విజయానికి ఆమె అధిదేవత. 'యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణ సంస్థితా' అని 'అపరాజితా స్తోత్రం' వర్ణించింది. అపరాజితా దేవి సర్వ జీవుల్లో శక్తి రూపంలో ఉంటుందని భావం. దానవీయ గుణాలపై గెలుపు సాధించడానికి మనలో ఉన్న శక్తిని ప్రేరేపించాలని అమ్మవారిని ప్రార్థించాలి. దేవ దానవులు క్షీరసాగర మథనం చేసినప్పుడు ఉద్భవించిన పవిత్రమైన దేవతా వృక్షాల్లో జమ్మి చెట్టు ఒకటి.. అందుకే యాగాల కోసం నిప్పు రాజెయ్యడానికి జమ్మి చెట్టు కలపనే వినియోగించేవారు. రావణ సంహారానికి ముందు శ్రీరాముడు శమీ వృక్షానికీ, అపరాజితా దేవికీ పూజలు ఆచరించాడని పురాణాలు పేర్కొంటున్నాయి. పాండవులు అజ్ఞాతవాసం మొదలుపెట్టడానికి ముందు తమ ఆయుధాలను శమీ వృక్షం మీద దాచారనీ, అజ్ఞాతవాసం ముగిసిన తరువాత వాటిని తిరిగి తీసుకున్నారనీ మహాభారతంలోని విరాటపర్వంలో కథ ఉంది. విజయదశమి రోజున...

శమీ శమయతే పాపం
శమీ శత్రువినాశిని
అర్జునస్య ధనుర్ధారి
రామస్య ప్రియదర్శిని...

అనే శ్లోకం పఠించి, జమ్మి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తే... అపరాజితాదేవి కటాక్షంతో శత్రు భయం తొలగి విజయం చేకూరుతుందనీ, దోషాలు తొలగిపోయి సకల కార్యసిద్ధి కలుగుతుందనీ పెద్దలు చెబుతారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఓ ఇంటివాడవుతున్న
అల్లు శిరీష్



నటుడు అల్లు శిరీష్ తన అభిమానులకు ఓ తీపి కబురు చెప్పారు. నయనిక అనే యువతితో వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నట్లు, ఈ నెల 31న తమ నిశ్చితార్థం జరగనున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. 'మా తాత అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా... నా మనసుకు బాగా దగ్గరైన విషయాన్ని మీతో పంచుకుంటున్నా. నేను, నయనిక ఈ నెల 31న నిశ్చితార్థం చేసుకోబోతున్నాం. నేను పెళ్లి చేసుకోవాలని మా నానమ్మ ఎప్పుడూ కోరుతుండేది. ఆవిడ ప్రస్తుతం మా మధ్య లేకపోయినా తన ఆశీస్సులు మాకు ఉంటాయి' అని పేర్కొన్నారు ఈఫిల్ టవర్ దగ్గర కాబోయే భార్య చేతిలో చేయి వేసి దిగిన ఫొటోను శిరీష్ షేర్ చేశారు. నయనిక హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి కుమార్తె అని సమాచారం.

డ్రగ్స్‌తో పట్టుబడిన బాలీవుడ్ నటుడు



'స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్ 2' (2019) హిందీ చిత్రంలో సమ్రాట్ పాత్రతో అందరినీ ఆకట్టుకున్న నటుడు విశాల్ బ్రహ్మ(32) ఇప్పుడు డ్రగ్స్ తో పట్టుబడి పోలీసుల అదుపులో ఉన్నారు. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో ఆయన దగ్గర నుంచి రూ. 40 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అస్సాంకు చెందిన విశాల్ బ్రహ్మ చిత్ర పరిశ్రమలో అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. 2024లో ఆయన 'బిహు అటాక్' చిత్రంలో నటించినా ఆ చిత్ర నిర్మాత పారితోషికం ఇవ్వకపోవడంతో ఆ విషయం గురించి ఎవరికీ చెప్పినా ఫలితం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్ని తట్టుకోలేక స్నేహితుల ద్వారా డ్రగ్స్ దందా చేసే నైజీరియా ముఠాకు దగ్గరయ్యాడని అంటున్నారు. కంబోడియా వెళ్లమనీ, అన్నీ ఖర్చులు తామే భరిస్తామనీ, భారత్‌కు డ్రగ్స్ తీసుకువస్తే అదనంగా డబ్బు ఇస్తామనీ నైజీరియా ముఠా ఆశ చూపించినట్టు తెలుస్తోంది. దాంతో రెండు వారాల క్రితం ఢిల్లీ నుంచి కాంబోడియా వెళ్లారు విశాల్ బ్రహ్మ. అక్కడనుంచి తిరిగి వచ్చేటప్పుడు ఓ నైజీరియన్ అతనికి ట్రాలీ బ్యాగ్ ఇచ్చాడనీ, అందులోనే డ్రగ్స్ ఉన్నట్లు సమాచారం.

శంకరవరప్రసాద్ కోసం శశిరేఖ వచ్చింది



మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్రం శరవేగంతో రూపుదిద్దుకుంటోంది. సాహు గారపాటి, సుస్మిత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇంతకు ముందు చిరంజీవి స్టయిలిష్ ఫస్ట్‌లుక్ విడుదల చేసి సినిమా మీద అంచనాలు భారీగా పెంచారు దర్శకనిర్మాతలు. ఇప్పుడు విజయదశమి సందర్భంగా హీరోయిన్ నయనతార పోషిస్తున్న శశిరేఖ లుక్‌ను రిలీజ్ చేశారు. పసుపురంగు చీరలో మెరిసిపోతున్న నయనతార అందరినీ ఆకట్టుకుంటున్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే సాధారణంగా సినిమా ప్రమోషన్స్‌కు దూరంగా ఉండే నయనతార 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్ర ప్రచార కార్యక్రమాల్లో మొదటి నుంచీ చురుకుగా పాల్గొంటున్నారు. పండగ సందర్భంగా గురువారం ఓ స్పెషల్ సర్‌ప్రైజ్ ను అనౌన్స్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

అంచనాలను మించి అలరిస్తుంది



రిషబ్‌శెట్టి

గతంలో తెలుగు ప్రేక్షకులు 'కాంతార' చిత్రానికి అఖండ విజయాన్ని అందించారు. ఇప్పుడు 'కాంతార చాప్టర్ 1' చిత్రంతో మీ ముందుకు వస్తున్నాం. మీరంతా ఈ చిత్రాన్ని గొప్పగా ఆదరించాలి' అని రిషబ్‌శెట్టి కోరారు. ఆయన కథానాయకుడిగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రమిది. దసరా సందర్భంగా నేడు ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం విజయవాడలో చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రిషబ్‌శెట్టి మాట్లాడుతూ చిత్రబృందం ఎన్నో వ్యయప్రయాసల కోర్చి తెరకెక్కించిన చిత్రమిది. ప్రేక్షకుల అంచనాలకు మించి సినిమా ఉంటుంది. తప్పకుండా అభిమానులకు కొత్త అనుభూతిని పంచుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.

విభిన్నంగా విలయతాండవం



కార్తీక్‌రాజు, పార్వతీ అరుణ్ జంటగా రూపుదిద్దుకుంటున్న 'విలయతాండవం' చిత్రం టైటిల్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. వీఎస్ వాసు దర్శకత్వంలో మందల ధర్మారావు, గుంపు భాస్కరరావు నిర్మిస్తున్నారు. ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆకాశ్ పూరి, దర్శకుడు భీమనేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరై సినిమా మంచి విజయం సాధించాలని కోరారు. హీరో కార్తీక్ రాజు మాట్లాడుతూ 'ప్రస్తుతం కంటెంట్ ఉన్న చిత్రాలను జనం ఆదరిస్తున్నారు. దర్శకుడు వాసు కొత్త పాయింట్‌తో ఈ సినిమాను రూపొందించారు. టీజర్, ట్రైలర్ వచ్చాక అందరూ ఆశ్చర్యపోతారు. సినిమాలో నేను, పార్వతి, జగదీశ్ ముఖ్య పాత్రలు పోషించాం. మా అందరికీ పెద్ద విజయం అందించాలని ప్రేక్షకుల్ని అభ్యర్థిస్తున్నాం' అన్నారు. అద్భుతమైన కథతో 'విలయతాండవం' చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా తీశామని నిర్మాతలు చెప్పారు. తన ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని దర్శకుడు వాసు తెలిపారు.

"మా ప్రభుత్వంలో బడులకు రంగులేశాం. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చాం. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాం" అని ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న జగన్ ప్రభుత్వం అసలు పనితీరు బయటపడింది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపును గాలికొదిలేసి 'నాడు-నేడు' అంటూ ఊదరగొట్టిన వ్యవహారం వెలుగు చూసింది. చివరికి బడులకు రంగులు మిగిలాయి తప్ప విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మాత్రం పెరగలేదు. పైగా, అనేక జిల్లాల్లో ఫలితాలు దారుణంగా పడిపోయాయి.

ఫలితాలు తక్కువ.. ప్రచారం ఎక్కువ!



జగన్ పాలనలో అభ్యసన ఫలితాల్లో జాతీయ స్థాయిలో రాష్ట్రం వెనుకంజ

- పరఖ్ సర్వేలో బయటపడిన నిజాలు.. 24 జిల్లాల్లో జాతీయ సగటు కంటే తక్కువ
- పూర్తిగా వెనకబడ్డ ఏలూరు, కర్నూలు.. 78 అంశాల్లో 23 మాత్రమే మెరుగు
- సైన్స్, గణితం, ఆంగ్లం.. అన్నింటా అంతంతమాత్రం ఫలితాలేనని వెల్లడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం 2024లో నిర్వహించిన 'పరఖ్' సర్వేలో రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన ఫలితాలు అత్యంత దారుణంగా ఉన్నాయని వెలుగుచూసింది. పాఠశాల విద్యాశాఖ ఇటీవలి కలెక్టర్ల సదస్సులో జిల్లాల వారీగా ఈ సర్వే ఫలితాలను ప్రదర్శించింది. వైసీపీ హయాంలో మొత్తం 26 జిల్లాల్లో 24 జిల్లాలు జాతీయ సగటు కంటే చాలా వెనకబడ్డాయి. విశాఖపట్నం, విజయనగరం రెండు జిల్లాలు మాత్రమే మెరుగ్గా ఉన్నాయి. ఇక, ఏలూరు, కర్నూలు జిల్లాలైతే ఏ ఒక్క తరగతిలోనూ, ఏ ఒక్క సబ్జెక్టులోనూ మెరుగైన పనితీరు కనబరచలేదు. దేశవ్యాప్తంగా 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఈ సర్వే జరిగింది. మూడో తరగతి విద్యార్థులకు ఆంగ్లం, గణితం సబ్జెక్టులపై, ఆరో తరగతి విద్యార్థులకు ఆంగ్లం, గణితం, తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆంగ్లం, గణితం, సైన్స్ సోషల్ సబ్జెక్టులపై ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రంలో జరిగిన ఈ సర్వేలో మొత్తం 78 అంశాలను ప్రామాణికంగా తీసుకుంటే 55 అంశాల్లో జాతీయ సగటు కంటే రాష్ట్రం వెనకబడింది. కేవలం 23 అంశాల్లో మాత్రమే మెరుగ్గా ఉంది. అందులోనూ ప్రాథమిక దశలో కొంత ఫర్వాలేదని అనిపించినా, 6, 9 తరగతుల విద్యార్థులు మాత్రం బాగా వెనకబడిపోయారు.

జిల్లాల వారీగా..

'పరఖ్' సర్వేలో కొన్ని జిల్లాల ఫలితాలు చూసి విద్యాశాఖ అధికారులే షాక్ అయ్యారు. విద్య సహా ఇతర రంగాల్లోనూ ముందుండే ఏలూరు జిల్లా అన్ని తరగతులు, అన్ని సబ్జెక్టుల్లో జాతీయ సగటు, రాష్ట్ర సగటు కంటే వెనకబడిపోయింది. ప్రతి జిల్లాలో మూడు తరగతులకు 9 సబ్జెక్టులపై సర్వే చేయగా.. అనంతపురం, తూర్పుగోదావరి, ఏలూరు, కాకినాడ, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాలు 9 సబ్జెక్టుల్లో జాతీయ సగటుకంటే కూడా వెనుకబడ్డాయి. అదేవిధంగా పల్నాడు 4, ప్రకాశం 8, తిరుపతి 8, పశ్చిమ గోదావరి, కడప 7 సబ్జెక్టుల్లో జాతీయ సగటు కంటే వెనుక నిలిచాయి.

రాష్ట్ర సగటు ఇలా!

- జాతీయ స్థాయిలో మూడో తరగతి విద్యార్థుల్లో 64 శాతం మందికి ఆంగ్లంపై అవగాహన ఉంటే ఆ సగటు రాష్ట్ర స్థాయిలోనూ 64 శాతంగానే ఉంది. గణితంపై అవగాహన జాతీయ స్థాయిలో 60 శాతం ఉంటే రాష్ట్రంలో కొంత మెరుగ్గా 61శాతం ఉంది.
- ఆరో తరగతి విద్యార్థుల్లో ఆంగ్లంలో 57శాతం మంది జాతీయ స్థాయిలో మెరుగ్గా ఉన్నారు. కానీ, రాష్ట్ర స్థాయిలో కేవలం 48శాతం మాత్రమే మెరుగైన ఫలితాలు సాధించారు. గణితంలో జాతీయ సగటు 46శాతంగా ఉంటే రాష్ట్ర సగటు 41శాతం ఉంది. పరిసరాలపై అవగాహనలో జాతీయ సగటున 49శాతం ఉంటే, ఏపీ సగటు కేవలం 40శాతం మాత్రమే ఉంది.
- తొమ్మిదో తరగతి విద్యార్థుల్లో.. ఆంగ్లంలో జాతీయ సగటు 54 శాతంగా ఉంటే, రాష్ట్ర సగటు 50 శాతంగా ఉంది. గణితంలో జాతీయ సగటు 37 శాతం అయితే, రాష్ట్ర సగటు 35శాతం మాత్రమే. సైన్స్‌లో జాతీయ సగటు 40శాతం అయితే ఏపీలో 36శాతం ఉంగా ఉంది. సోషల్‌లో జాతీయ సగటు 40 శాతం ఉంటే, రాష్ట్ర సగటు 37శాతంగా నమోదైంది.

బొబ్బిలి కోటలో ఆయుధ పూజ

దసరా ఉత్సవాల్లో భాగంగా విజయనగరం జిల్లా బొబ్బిలి కోటలో బుధవారం ఆయుధ పూజ ఘనంగా జరిగింది. రాజవంశీయులైన మాజీ మంత్రి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్వీ సుజయ్‌కృష్ణ రంగారావు, ఆయన సోదరులు రామకృష్ణ రంగారావు, ఎమ్మెల్యే ఆర్వీఎస్‌కేకే రంగారావు దర్బార్ మహల్‌లో ఆయుధ పూజ చేశారు. తమ పూర్వీకులు వినియోగించిన బంగారు, వెండి సింహాసనాలను ప్రధాన కోట నుంచి దర్బారు మహల్‌కు మేళతాళాలతో తీసుకువచ్చారు. దర్బారు మహల్‌లో ఏర్పాటు చేసిన స్వర్ణ సింహాసనంపై దివంగత బొబ్బిలి రాజా, నాటి మద్రాసు ఉమ్మడి రాష్ట్రాల ముఖ్యమంత్రి రాజా ఆర్ఎస్ఆర్‌కే రంగారావు (బొబ్బిలి రాజవంశంలో ఆఖరి పట్టాభిషిక్తులు) చిత్రపటాన్ని, వెండి సింహాసనంపై ఆయన తనయుడైన ఆర్వీజీకే రంగారావు చిత్రపటాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

- బొబ్బిలి, ఆంధ్రజ్యోతి



యుద్ధ సామగ్రికి పూజలు చేస్తున్న రాజవంశీయులు

నేత్రోత్సవం.. మహారథోత్సవం



తిరుమల మాడ వీధుల్లో భారీ భక్త జనసందోహం మధ్య కొనసాగుతున్న మహారథోత్సవం

తిరుమల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీవారి మహారథోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున ఆలయంలో ఆగమోక్తంగా కైంకర్యాలు అందుకున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని మహోన్నత రథం(చెక్కతేరు)పై అధిష్ఠింపజేయగా ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. రథంలో కొలువుదీరిన గోవిందుడికి భక్తజనం అడుగడుగునా నీరాజనాలు సమర్పించారు. గోవిందనామస్మరణలతో ఆలయ మాడవీధులు మారుమోగాయి. రాత్రి 7 గంటలకు బ్రహ్మోత్సవాల్లో చివరి వాహనమైన అశ్వ వాహనసేవ కనువిందుగా సాగింది. కాగా, గురువారం ఉదయం శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు. రాత్రి ఆలయంలో జరిగే ధ్వజావరోహణంతో తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ



విజయవాడ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ బుధవారం మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. దసరా శరన్నవరాత్రులు చివరి దశకు చేరుకోవడంతో భవానీ దీక్షాధారుల రాక పెరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భవానీ భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అమ్మవారికి టీటీడీ బోర్డు సభ్యులు సారె సమర్పించారు. అమ్మవారు గురువారం శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. కాగా.. దశమి రోజున శ్రీ గంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను దుర్గా ఘాట్ వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి హంస వాహనంపై పూజలు నిర్వహించి, నదీ విహారం చేయిస్తారు. అయితే కృష్ణానదిలో 6.80 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండడంతో జలవనరుల శాఖ తెప్పోత్సవానికి అనుమతి ఇవ్వలేదు.

రైల్వే కమిటీ చైర్మన్‌గా సీఎం రమేశ్

- పట్టణ వ్యవహారాల కమిటీకి మాగుంట
- పార్లమెంటరీ కమిటీల పునర్నియామకం
- రక్షణ శాఖ కమిటీలో కేశినేని శివనాథ్



న్యూఢిల్లీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలను పునర్నియమించారు. వివిధ పార్లమెంటరీ కమిటీలకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు నియమితులయ్యారు. ఈ మేరకు పార్లమెంటరీ సెక్రటరీ జనరల్ కేఎస్ సోమశేఖర్ బుధవారం కమిటీల జాబితాలను వెలువరించారు. రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా సీఎం రమేశ్, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా మాగుంట శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు.

- వాణిజ్య పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా రేణుకా చౌదరి, సానా సతీశ్ బాబు నియమితులయ్యారు.
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా కడియం కావ్య, పరిశ్రమల కమిటీలో మల్లు రవి, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, అభిషేక్ మను సింఘ్వీలను నియమించారు.
- పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ కమిటీ సభ్యుడిగా మాధవనేని రఘునందన్ రావు, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల కమిటీ సభ్యులుగా కేఆర్ సురేశ్‌రెడ్డి, పాకా వెంకట సత్యనారాయణ, గడ్డం వంశీకృష్ణ నియమితులయ్యారు.
- రవాణా, పర్యాటక, సాంస్కృతిక కమిటీ సభ్యుడిగా గొల్ల బాబూరావు, కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ కమిటీ సభ్యులుగా పోరిక బలరాంనాయక్, ఈటెల రాజేందర్, దగ్గుమళ్ల ప్రసాదరావులను నియమించారు.
- బొగ్గు, గనులు, ఉక్కు కమిటీ సభ్యులుగా మందాడి అనిల్ కుమార్ యాదవ్, కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సభ్యులుగా ఎస్. నిరంజన్‌రెడ్డి, కలిశెట్టి అప్పలనాయుడు, రామసహాయం రఘురామిరెడ్డి, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ కమిటీ సభ్యురాలిగా సుధామూర్తిలు నియమితులయ్యారు.
- రక్షణ శాఖకు చెందిన కమిటీ సభ్యులుగా ధీవకొండ దామోదర్ రావు, కేశినేని శివనాథ్, విదేశీ వ్యవహారాల కమిటీ సభ్యులుగా ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కె. లక్ష్మణ్, డీకే అరుణ, వైఎస్ అవినాశ్ రెడ్డిలను నియమించారు.
- ఆర్థికవ్యవహారాల కమిటీ సభ్యులుగా వైవీ సుబ్బారెడ్డి, లావు శ్రీకృష్ణ దేవరాయలు, సీఎం రమేశ్, పీవీ మిథున్‌రెడ్డి, బాలశౌరి వల్లభనేని, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల కమిటీ సభ్యులుగా గుమ్మ తనూజారాణి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు.
- కార్మిక, వస్త్ర, నైపుణ్యాభివృద్ధి కమిటీ సభ్యుడిగా జి. లక్ష్మీనారాయణ, పెట్రోలియం, సహజవాయువుల కమిటీ సభ్యులుగా వద్దిరాజు రవిచంద్ర, పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, బాలశౌరి వల్లభనేని, రైల్వే కమిటీ సభ్యులుగా కె. లక్ష్మణ్, మేడా రఘునాథరెడ్డి, సామాజిక న్యాయం, సాధికారత కమిటీ సభ్యుడిగా దిగ్గజ దర్శకుడు రాజమౌళి తండ్రి, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్ నియమితులయ్యారు.

రమావాణీ సేవిత రాజరాజేశ్వరిగా భ్రమరాంబిక దర్శనం



- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

శ్రీశైలం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తి పీఠం కలిగిన శ్రీశైలం క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు రమావాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం కుమారి పూజ నిర్వహించారు. రాత్రి అమ్మవారు మల్లికార్జున స్వామితో కలసి అశ్వ వాహనంపై విహరించారు. దసర మహోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి బుధవారం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

బాలిక హత్య.. యువకుని ఆత్మహత్య

- ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానం
- రెండు కుటుంబాల్లో విషాదం..

కాకినాడ జిల్లా సామర్లకోటలో ఘోరం




గొల్లపల్లి దీప్తి, కొమ్మూరి అశోక్

సామర్లకోట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పనసపాడు శివారు కాలువ గట్టు వద్ద 17 ఏళ్ల బాలిక దారుణ హత్యకు గురైంది. 19 ఏళ్ల యువకుడు వేట్లపాలెం గ్రామ శివారు గూడపర్తి వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనలు బుధవారం సామర్లకోట మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో జరిగినా మృతులిద్దరినీ దుర్గాడ గ్రామస్తులని నిర్ధారించారు. ఈ ఘటనకు వీరిద్దరి మధ్య రెండేళ్లుగా కొనసాగుతున్న ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. వివరాలు.. దుర్గాడకు చెందిన గొల్లపల్లి దీప్తి కాకినాడలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన కొమ్మూరి అశోక్‌తో రెండేళ్ల క్రితం జరిగిన పరిచయం ప్రేమగా మారింది. చెన్నైలో ఒక ప్రైవేట్ సంస్థలో ఉద్యోగ అవకాశం పొందిన అశోక్ రెండ్రోజుల క్రితం దుర్గాడ చేరుకున్నాడు. దీప్తి తన పెదనాన్న నివశిస్తున్న సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో ఉన్నట్టు తెలుసుకుని మంగళవారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై అక్కడకి వెళ్లాడు. ఈ క్రమంలో ఆమె తన పెదనాన్న కుమార్తెతో కలిసి స్థానికంగా ఉన్న షాపునకు వెళ్లి తాను తర్వాత ఆమె వస్తానని పంపించింది. రాత్రైనా దీప్తి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లభించకపోవడంతో సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం కాలవ గట్టు వద్ద బాలిక గొంతు కోసి దారుణంగా హత్యకు గురై ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. మరోవైపు.. వేట్లపాలెం గ్రామ శివారు గూడపర్తి వద్ద రైలు పట్టాల పక్కన సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను బుధవారం ఉదయం గమనించిన రైల్వే ట్రాక్ పెట్రోలింగ్ చేస్తున్న ట్రాక్ మెన్ వెంకటనాయుడు.. అశోక్ మృతదేహాన్ని గుర్తించి సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్‌కు సమాచారం అందించారు. రైల్వే పోలీసుల దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాలను పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి సామర్లకోట పోలీసులు, సామర్లకోట రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కారవాన్ లోపల సోఫాలు

కారవాన్‌లో విహరిద్దాం..!

- స్టార్‌హోటల్ హంగులతో కారవాన్ టూరిజం
- ఏసీ సదుపాయం.. బెడ్లు, సోఫాలు, వాష్‌రూమ్‌లు
- వినోదం కోసం రెండు టీవీలు, వై-ఫై సదుపాయం
- లోపల రెండు కుటుంబాలకు సరిపడా వసతులు
- భోజన ఏర్పాట్లు.. ఎక్కడికంటే అక్కడకు విహారయాత్ర
- విశాఖపట్నంలో పర్యాటకులకు అందుబాటులోకి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కారవాన్ టూరిజం.. ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరిది..! సాధారణ ఏసీ బస్సును.. స్టార్ హోటళ్లలో లభించే విలాసవంతమైన సౌకర్యాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దితే అదే కారవాన్..! ఇలాంటి వాటిని ఎక్కువగా సినిమా షూటింగ్‌లకు వినియోగిస్తుంటారు. వీటి నిర్వహణ ఖరీదైన వ్యవహారం కాబట్టి.. మనరాష్ట్రంలో ఇలాంటివి చాలా అరుదు. అయితే.. ఈ కారవాన్లను పర్యాటక రంగంలో ఉపయోగిస్తే మధ్య తరగతి ప్రజల ఆదరణ పొందే అవకాశం ఉంటుందని విశాఖకు చెందిన వ్యాపారి శివాజీ గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో పర్యాటకులకు ఉపయోగపడేలా ఓజీ డ్రీమ్‌లైనర్ కంపెనీకి చెందిన బస్సులను కార్‌వాన్‌లుగా తీర్చిదిద్దారు. వాటిని విశాఖలో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. వీటిని రోడ్లపై పరుగులు తీసే స్టార్ హోటల్స్‌గా అభివర్ణిస్తున్నారు.


స్టార్ హోటల్‌లో బస చేసినట్టే..!

కారవాన్‌లో రెండు పెద్ద కుటుంబాలు ప్రయాణించేందుకు అనువైన వసతులు ఉన్నాయి. ఏసీ సదుపాయంతో కూర్చోవడానికి సోఫాలు, విశ్రాంతి తీసుకోవడానికి బెడ్‌లు, వినోదం కోసం రెండు టీవీలు, మ్యూజిక్ సిస్టమ్, వై-ఫై, వాకీ-టాకీతోపాటు నచ్చిన ఆహారం వండుకోవడానికి కిచెన్, ఓవెన్, ఫ్రిజ్, వాష్‌రూమ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. ఇందులో పది మంది పెద్దలు సౌకర్యవంతంగా పడుకోవచ్చు. పిల్లలకు ప్రత్యేకంగా బంకర్ సదుపాయం ఉంది. వాటిలో నలుగురు ఉండొచ్చు. అరకులోయ, లంబసింగి, పాడేరు వంటి పర్యాటక ప్రాంతాలకు కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి వెళ్లాలనుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రాత్రి బస కోసం వేరొక హోటల్‌కు వెళ్లాల్సిన పని, ఆ పేరుతో రూమ్‌లకు అద్దెలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. నచ్చిన ప్రాంతంలో కారవాన్‌ను పార్క్ చేసుకొని హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు. దీన్ని ఏదైనా టూర్‌కు బుక్ చేసుకుంటే ప్రయాణంలో అవసరమైనవన్నీ నిర్వాహకులే సమకూరుస్తారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్, రాత్రికి డిన్నర్ అందిస్తారు. నచ్చిన వంటకం చెబితే వారే తయారుచేస్తారు. కారవాన్‌లో పైలట్‌తో పాటు గైడ్ కూడా ఉంటారు. పుణ్యక్షేత్రాలకు వెళితే... అక్కడి దేవదాయ శాఖ అధికారులతో మాట్లాడి త్వరగా దర్శనం పూర్తయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు.

ఒప్పందం పూర్తికాగానే టూర్లు: శివాజీ



'కారవాన్ టూరిజంపై ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)తో రెండు రోజుల్లో ఒప్పందం జరుగుతుంది. అది పూర్తికాగానే టూర్లు, ప్యాకేజీలు ప్రకటిస్తాం. ఈ కారవాన్ విశాఖపట్నం బీచ్ రోడ్డులో టూరిస్ట్ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటుంది. అరకు, లంబసింగి, అన్నవరం, అరసవిల్లి వంటి ప్రాంతాల పర్యటనతో పాటు సిటీ టూర్ కూడా ఏర్పాటు చేస్తాం. మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని దీన్ని తీసుకువచ్చాం. వారికి సరసమైన ధరల్లో మంచి అనుభూతిని అందించడమే మా లక్ష్యం' అని కారవాన్ యజమాని శివాజీ తెలిపారు.



కారవాన్



వాష్‌రూమ్

రాష్ట్రంలో ఎన్‌సీసీ ప్రత్యేక డైరెక్టరేట్!

- కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం
- గుంటూరులో ఏర్పాటు చేసే అవకాశం
- ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డీడీజీ నర్సింగ్



తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులో ఎన్‌సీసీ జాతీయ సమగ్రతా శిబిరంలో సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో తీయించుకుంటున్న డీడీజీ నర్సింగ్ (కుడివైపున)

దివాన్‌చెరువు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్‌సీసీ ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు ప్రతిపాదనలు పురోగతిలో ఉన్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్‌కమాండర్ నర్సింగ్ సైలాని అన్నారు. కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతి వచ్చిన వెంటనే గుంటూరులో ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువులోని శ్రీప్రకాశ్ విద్యానికేతన్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమగ్రతా శిబిరాన్ని ఆయన సందర్శించారు. తొలుత ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం క్యాడెట్ల టగ్ ఆఫ్ వార్‌ను తిలకించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు ఏర్పాటు చేసిన సెల్ఫీపాయింట్‌లను సందర్శించి, వారితో సంభాషించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. తర్వాత విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌సీసీ విభాగాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే ఆలోచన ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్యాడెట్లు హాజరయ్యారని తెలిపారు. కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్‌ఎం అగర్వాల్ నేతృత్వంలో ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది క్యాడెట్లు హాజరయ్యారన్నారు. యువతను క్రమశిక్షణ, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఈ శిబిరంలో వివిధ కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు.

శిథిలావస్థలో పశు వైద్యశాలలు

పైసా కూడా విడుదల చేయని గత ప్రభుత్వం

- గత టీడీపీ హయాంలో జరిగిన పనులకు
- పెండింగ్‌లో 120 కోట్ల బిల్లులు
- పూర్తిగా పనికిరాని స్థితిలో 777 భవనాలు
- తక్షణ మరమ్మతులకు 300 కోట్లు అవశ్యం
- మంత్రులకు లేఖలు రాసిన పలువురు ఎమ్మెల్యేలు

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా అనేక పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. దెబ్బతిన్న భవనాలకు గత ప్రభుత్వం కనీస మరమ్మతులకు పైసా కూడా విడుదల చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా 323 ఏరియా పశు వైద్యశాలలు ఉన్నాయి. అలాగే 1,577 డిస్పెన్సరీలు ఉండగా.. 1,218 రూరల్ లైవ్ స్టాక్ యూనిట్లు ఉన్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వంలో నాబార్డు-ఆర్‌ఐడీఎఫ్ కింద 273 నూతన భవనాలు మంజూరైనాయి. 2015-16లో 46, 2017-18లో 227 పనులను మార్కెటింగ్ శాఖ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేశారు. వీటిల్లో ఫర్నిచర్, పరికరాలు అమర్చి పశుసంవర్ధక శాఖకు అప్పగించారు. ఈ పనులకు సంబంధించి రూ.120 కోట్లు దాకా కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు చెప్తున్నారు. 2019 నుంచి కొత్త భవనాలకు నిధులు కేటాయించలేదు. ఏడాది క్రితమే 1,090 భవనాలు శిథిలావస్థలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి నిర్మాణానికి రూ.750 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఇందులో 777 భవనాలను కొత్త నిర్మించాల్సిందే. వాటికి రూ.510 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రస్తుతం ఆర్‌ఐడీఎఫ్ కింద పశుసంవర్ధక శాఖ భవన నిర్మాణాలకు నాబార్డు నిధులు ఇవ్వడం లేదని సమాచారం. ఈ కారణంగా ప్రభుత్వం కొత్త భవనాలపై దృష్టి సారించడం లేదు. తక్షణ మరమ్మతులు చేపట్టాలన్నా కనీసం రూ.300 కోట్లు అవసరమని సమాచారం. తమ నియోజకవర్గాల్లో పశు వైద్యశాలలకు మరమ్మతులు చేపట్టాలని, పూర్తిగా శిథిలమైన చోట కొత్త భవనాలు నిర్మించాలని స్వయంగా ఎమ్మెల్యేలు కోరుతున్నారు. దీనిపై ఆర్థిక, పశుసంవర్ధక శాఖ మంత్రులకు పలువురు ఎమ్మెల్యేలు లేఖలు రాసినట్లు సమాచారం.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా బాలయోగి

▸ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



పార్లమెంటులో బాలయోగి చిత్రపటానికి నివాళులర్పించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీ సానా సతీశ్, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్

న్యూఢిల్లీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 'జీఎంసీ బాలయోగి... కోనసీమ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యున్నత రాజ్యాంగ పదవులలో ఒకటైన లోక్‌సభ స్పీకర్ పదవిని చేపట్టారు. బాలయోగి ప్రస్థానం ప్రజలపట్ల ఆయనకున్న అంకితభావాన్ని, ప్రజాస్వామ్య విలువల పట్ల ఆయన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది' అని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా పార్లమెంటులో ఆయన చిత్రపటానికి ఎంపీ సానా సతీశ్, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్‌తో కలసి కేంద్ర మంత్రి నివాళి అర్పించారు. 'నిరాడంబరమైన జీవనశైలితో బాలయోగి ప్రజల మనసులను గెలుచుకున్నారు. భారత పార్లమెంటరీ చరిత్రలో మాత్రమే కాదు... ప్రజల హృదయాల్లోనూ ఆయన చిరస్థాయిగా నిలిచిపోయారు' అని రామ్మోహన్‌నాయుడు అన్నారు.

8న చర్చలకు రండి

▸ విద్యుత్ ఉద్యోగుల జేఏసీకి ట్రాన్స్‌కో పిలుపు

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఆందోళన చేస్తున్న రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీని ట్రాన్స్‌కో యాజమాన్యం చర్చలకు ఆహ్వానించింది. ఈనెల 8న చర్చలకు రావాలని కోరింది. గతనెల 15 నుంచి 22వ తేదీ వరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించిన జేఏసీ తాజాగా సమ్మె నోటీసు ఇచ్చేందుకు సిద్ధమైంది. తొలుత గతనెల 10న ట్రాన్స్‌కో యాజమాన్యం చర్చలకు ఆహ్వానించగా.. ఆ ఆహ్వానాన్ని జేఏసీ తిరస్కరించింది.

ఇన్‌స్టిట్యూట్-ఇండస్ట్రీ కనెక్ట్ పోర్టల్ ప్రారంభం

▸ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించే పరిశ్రమలకు ఆహ్వానం

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు ఇన్‌స్టిట్యూట్-ఇండస్ట్రీ కనెక్ట్ పోర్టల్‌ను ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి బుధవారం ప్రారంభించారు. దీనిపై ఆసక్తి ఉన్న పరిశ్రమలు ఈనెల 5 నుంచి 22వ తేదీ వరకు ఈ వెబ్‌సైట్ (www.iic.apsche.ap.gov.in) లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఒక ప్రకటనలో సూచించారు. స్టైపండ్ ఉన్న లేదా స్టైపండ్ లేని ఇంటర్న్‌షిప్ కార్యక్రమాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఒకసారి వెబ్‌సైట్ ద్వారా అనుమతి పొందితే ఇంటర్న్‌షిప్‌లు ప్రారంభించుకోవచ్చని పేర్కొన్నారు.

టీడీపీ మాపై కేసులు పెట్టడం మామూలే

▸ 2014లో కూడా తప్పుడు కేసులు పెట్టారు: మిథున్‌రెడ్డి



తిరుపతి(జీవకోన), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కేసులు పెట్టి తమను వేధించడం మామూలేనని రాజంపేట వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. 2014లో కూడా తప్పుడు కేసులు పెట్టారని.. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టంచేశారు. బుధవారం తిరుపతిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'నాపై కేసు పెట్టి మా తల్లిదండ్రులను మానసికంగా వేధించడం, పైశాచిక ఆనందం పొందడం తప్ప సాధించిందేమీ లేదు. ప్రభుత్వం చేయాల్సిన పనులను పక్కన పెట్టి, పాలిటిక్స్ చేయడంపై దృష్టి సాధించింది. జైలులో ఉన్నన్ని రోజులు, కష్టకాలంలో అండగా ఉన్న వైఎస్ జగన్, వైసీపీ కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు. మేం బీజేపీలో చేరతామని టీడీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. జైలులో ఓ టెర్రరిస్టులా, తీవ్రవాదిలా పెట్టారు. సీసీ కెమెరా నిఘా ఉంచారు. ఇతరులతో మాట్లాడే పరిస్థితి లేదు. కోర్టు ఆదేశాలిచ్చే వరకు ఏ వసతీ కల్పించలేదు. ఖైదీలకు ఇచ్చే వసతులు కూడా నాకు ఇవ్వలేదు' అని ఆరోపించారు. కోర్టు ఆంక్షల మేరకు అన్ని విషయాలూ మాట్లాడలేనని, బెయిల్ ఆర్డర్‌ను అందరూ చదవాలని.. అందులో అన్ని విషయాలూ స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. సమావేశంలో వైసీపీ నేతలు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, సునీల్, రెడ్డెప్ప, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఖాదీ సంత పోస్టరును ఆవిష్కరిస్తున్న బీజేపీ అధ్యక్షుడు మాధవ్, పార్టీ నాయకుడు రమేశ్ తదితరులు

స్వదేశీ ఉద్యమంతో ఆంక్షలకు చెక్

▸ మన ఉత్పత్తులు మనమే కొనుగోలు చేద్దాం

▸ 'ఖాదీ సంత'లకు వెళ్దాం... దేశాభివృద్ధికి తోడ్పడదాం: మాధవ్

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 'అమెరికా ఆంక్షలు మన ఆత్మగౌరవం ముందు తల వంచాల్సిందే. స్వదేశీ నినాదంతో సొంత ఉత్పత్తులనే కొనుగోలు చేద్దాం. ఖాదీ సంతల్లో మన నేతన్నల వస్త్రాలు తీసుకుందాం. వికసిత భారత్ పరాయి దేశంపై ఆధార పడదని చాటి చెబుదాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జయంతి(అక్టోబరు 2) సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ 90 రోజుల పాటు బీజేపీ ఆధ్వర్యంలో 'ఖాదీ సంత'లు నిర్వహిస్తున్నారు. విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సంతలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేశ్ నాయుడు, మట్టా ప్రసాద్, అడ్డూరి శ్రీరామ్ తదితరులతో కలసి మాధవ్ విలేకరులతో మాట్లాడారు. 'భారత దేశ ఖ్యాతి బీజేపీ పాలనలో విశ్వవ్యాప్తమయింది. కార్గిల్ యుద్ధ సమయంలో తుపాకులు కూడా విదేశాల నుంచి కొనాల్సి వచ్చింది. వాజపేయీ పోఖ్రాన్‌తో మనశక్తి చాటితే... మోదీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మన బ్రహ్మోస్ సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసింది. కాంగ్రెస్ పాలకులు విదేశాలపై ఆధారపడటం వల్ల మన దేశం బలహీనంగా ఉండేది. అమృతకాలంలో ఉన్న మన దేశం 2047నాటికి ప్రపంచ శక్తిగా ఎదిగేందుకు ప్రణాళికా బద్ధంగా ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నాలపై అమెరికా సుంకాల ప్రభావం లేకుండా చేయడానికి స్వదేశీ ఉద్యమాన్ని చేపడదాం. ఖాదీని పక్కన పెట్టడం వల్ల దేశం నష్టపోయింది. చిన్న బొమ్మలు కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం మనకు అవసరమా? ప్రతి ఖాదీ సంతలో వంద స్టాళ్లు ఏర్పాటు చేశాం. వాటిలో స్థానిక ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతి ఒక్కరూ ఆత్మ గౌరవ ఉద్యమంలో పాల్గొనాలి. స్వదేశీ ఉత్పత్తులు కొనుగోలు చేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి' అని మాధవ్ పిలుపునిచ్చారు.

షర్మిల మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మాధవ్ ఆరోపించారు. 'ఆలయాలు వద్దు... మరుగు దొడ్లు ముద్దు' అంటూ ఆమె హిందువులను తీవ్రంగా అవమానించారని మండిపడ్డారు. చర్చిలు, మసీదుల నిర్మాణాల విషయంలో ఇటువంటి వ్యాఖ్యలు చేయగలరా? అని ప్రశ్నించారు. హిందువులు సౌమ్యులు కదా! అని ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆర్‌ఎస్‌ఎస్ అంటే అర్థం ఏంటో కూడా తెలియని పీసీసీ అధ్యక్షురాలు దేశ సేవలో వందేళ్లు పూర్తి చేసుకొంటున్న గొప్ప సంస్థ గురించి మాట్లాడటం వినడానికే విడ్డూరంగా ఉందని మాధవ్ ఎద్దేవా చేశారు.





విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమిఘాట్‌లో మహిషాసుర మర్దిని కళారూపం ప్రదర్శిస్తున్న కళాకారులు

'మిత్రమండలి'
మూవీ టీమ్ సందడి

గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ కళావేదికపై 'మిత్రమండలి' సినిమా బృందం సందడి చేసింది. ప్రధాన పాత్రలలో నటిస్తున్న ప్రియదర్శి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా, విష్ణు ఓయ్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రేక్షకులను అలరించారు. దీంతో పాటు సుడిగాలి సుధీర్ నటించిన 'హైలెస్సో' ప్రమోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అడవిశేష నటించిన 'డెకాయిట్' చిత్రం టీజర్‌ను ప్రదర్శించారు.

సంగీతఝరిలో ఓలలాడి

విజయవాడ ఉత్సవ్‌కు భారీ ఆదరణ

▸ ఉత్సవ్ వేదికలపై సంగీత విభావరులు.. గొల్లపూడిలో దుమ్మురేపిన కార్తీక్ కన్సర్ట్

▸ పున్నమిఘాట్‌లో రాహుల్ భక్తి పాటలు.. ఉర్రూతలూగించిన కారుణ్య ఫాస్ట్ బీట్స్

▸ తుమ్మలపల్లిలో జానపద, శాస్త్రీయ కచేరీలు.. హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

వచ్చే ఏడాది మోదీని తీసుకొస్తామని వెల్లడి



సింగర్ కారుణ్య

విజయవాడ సిటీ/ఇబ్రహీంపట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సంగీతఝరిలో బెజవాడ ఓలలాడింది. అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్' ప్రధాన వేదికలపై బుధవారం నిర్వహించిన సంగీత కార్యక్రమాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. పున్నమిఘాట్ వేదికగా జరిగిన రాహుల్ వెల్లల్ ఆధ్యాత్మిక గీతాలాపన వీక్షకులను భక్తిపారవశ్యంలో మునకలేసేలా చేసింది. కర్నాటక సంగీత విద్వాంసుడైన రాహుల్ వెల్లల్ పాటలు దుమ్మురేపాయి. అన్నమాచార్య కీర్తనలను అద్భుతంగా ఆలపించారు.

- గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కార్తీక్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ అమితంగా ఆకట్టుకుంది. మహాగణపతి మనసాస్మరామి అనే భక్తి పాటకు వెస్ట్రన్ బీట్స్‌తో కార్తీక్ స్వప్త స్వరాలను తన గొంతులో ఆలపించి ప్రేక్షకులకు భక్తి పారవశ్యంలోకి పరవశింపచేశారు. వెస్ట్రన్ బీట్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. గజిని సినిమాలోని పాటతో ఆడియన్స్ కరతాళ ధ్వనుల మధ్య కార్తీక్ గానం అద్భుతంగా సాగింది.



సింగర్ కార్తీక్

- ప్రఖ్యాత సింగర్ తన మధురమైన కంఠంతో పున్నమిఘాట్‌లో నిర్వహించిన లైవ్ కన్సర్ట్‌లో ప్రేక్షకులను మరోలోకంలోకి తీసుకెళ్లారు. 'సమ్‌థింగ్.. సమ్‌థింగ్' అంటూ ఫాస్ట్‌బీట్ రాగాలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. యువతీ యువకులు వేదిక ముందుకు వెళ్లి నృత్యాలు చేశారు. ప్రత్యేకంగా ఆలపించిన విరహ గీతాలు యువతను ఆకట్టుకున్నాయి.
- ఘంటసాల సంగీత కళాశాలలో నిర్వహించిన 'ఉత్సవ్' కార్యక్రమాలలో కాళీమాత నృత్యరూపకం జరిగింది. విశాఖపట్నానికి చెందిన విజయకుమార్ శర్మ బృందం ప్రదర్శించిన రక్తబీజాక్షుడి సంహార ఘట్టం వీక్షకుల ఒళ్లు గగుర్పొడిచేలా సాగింది.
- ఇతర వేదికలపై రోబో మిర్రర్, డబుల్ హెడ్ డాల్ ప్రదర్శనలు అలరించాయి. రోబో సాంగ్స్‌కు ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. రోబో మిర్రర్ యంత్రగా రోహిణీ మౌర్య, డబుల్ హెడ్ డాల్‌గా విజయకుమార్ శర్మలు అద్భుతంగా రక్తి కట్టించారు. తేజస్విని సంపత్ అకాడమీ గురువు రూపా నాగతేజస్విని సంగీత కచేరీ ఆకట్టుకుంది. ప్రియ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భళా అనిపించింది. హవీషా చౌదరి బృందం అష్టలక్ష్మీ వైభవం, శివాష్టకం, అయిగిరినందిని వంటి నృత్య ప్రదర్శనలు తన్మయులను చేశాయి.
- తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదర్శించిన కృష్ణాతరంగిణి నృత్య రూపకం ఆకట్టుకుంది. విజయవాడ నగర ఔన్నత్యం గురించి వివరిస్తూ సాగిన నృత్య రూపకం ఆకట్టుకుంది. అనపర్తి ఏడుకొండల బృందం తోలుబొమ్మలాట ప్రదర్శన, చిన్నారి త్రిషిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.





'విజయవాడ ఉత్సవ్'లో యువతుల సందడి

విజయ్ ప్రచారం రెండు వారాలు వాయిదా

▸ కరూర్ ఘటనతో టీవీకే అధినేత నిర్ణయం

▸ వచ్చే వారం మృతుల కుటుంబాల పరామర్శ!

▸ విజయ్ పలికేది బీజేపీ మాటలే: డీపీఐ అధినేత తిరుమావళవన్

చెన్నై, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తన కరూర్ పర్యటన సందర్భంగా 41 మంది మృతి చెందిన నేపథ్యంలో 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) అధినేత విజయ్ తన ప్రచారాన్ని రెండు వారాల పాటు వాయిదా వేసుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆప్తులను కోల్పోయిన బాధలో వున్నందున వచ్చే రెండు వారాల పాటు పార్టీ అధ్యక్షుడి బహిరంగ సభలు వాయిదా వేసినట్లు అందులో పేర్కొంది. పూర్తి వివరాలను తరువాత వెల్లడిస్తామని తెలిపింది. ఇక, పోలీసుల అనుమతి మేరకు వచ్చేవారం విజయ్ కరూర్ తొక్కిసలాట మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శిస్తారని టీవీకే వర్గాలు పేర్కొన్నాయి. కాగా, తొక్కిసలాట ఉదంతంపై టీవీకే అధినేత విజయ్... బీజేపీ మాటలనే వల్లెవేస్తున్నారని దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా(డీపీఐ) అధ్యక్షుడు తిరుమావళవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీవీకే బాధ్యతారాహిత్యం వల్లనే 41 మంది మరణించారని, కొన్ని వందలమంది తీవ్రంగా గాయపడ్డారని, అయితే, తమిళనాడు ప్రభుత్వం చేపట్టిన సత్వర చర్యల వల్ల వారంతా ప్రాణాలతో బయటపడగలిగారని ఆయన పేర్కొన్నారు. విజయ్ విడుదల చేసిన వీడియోలో ముఖ్యమంత్రి స్టాలిన్‌పై నిందలు వేసేలా మాట్లాడారని, తద్వారా జరిగిన విషాదానికి ఆయన బాధపడడం లేదని తేలిపోయిందని తిరుమావళవన్ తెలిపారు. బయటి నుంచి ఎవరో ప్రేరేపించినందున ఇది జరిగిందనే తప్పుడు అభిప్రాయాన్ని సృష్టించడానికి, బాధిత ప్రజలను మరోసారి భ్రమలోకి నెట్టడానికి విజయ్ వర్గం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. 'విజయ్ కూడా బీజేపీ చెప్పేదే చెబుతాడు' అంటూ బీజేపీ ఏర్పాటు చేసిన పార్లమెంటేరియన్ బృందం సభ్యుడు అనురాగ్ ఠాగూర్ చేసిన ప్రకటనతో విజయ్ ఎవరి వలల్లో చిక్కుకున్నాడో స్పష్టమవుతోందని తెలిపారు. బీజేపీ ఏర్పాటు చేసిన నిజనిర్ధారణ కమిటీ డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తున్నందున వారు తమిళనాడును లక్ష్యంగా చేసుకుని బహిరంగంగా తమ మోసపూరిత ఆటను ప్రారంభించారన్నారు. ఇందుకు విజయ్ బీజేపీ సాధనంగా మారిపోయినట్లు అవగతమవుతోందన్నారు. ఇలాంటి శక్తుల పట్ల తమిళనాడు ప్రజలు జాగ్రత్తగా వుండాలని, ఉత్తర భారత రాష్ట్రాల్లో చూపించిన రాజకీయ కుట్రలను తమిళనాడులో కూడా పునరావృతం చేయడానికి ప్రయత్నిస్తున్న సంఘ్ పరివార్ పట్ల జాగరూకతతో వ్యవహరించాలని తిరుమావళవన్ పిలుపునిచ్చారు.

'మణిపూర్'పై నిజనిర్ధారణ కమిటీ వేయలేదేం?: సెంథిల్ బాలాజీ

కరూర్ తొక్కిసలాటపై బీజేపీ నిజనిర్ధారణ కమిటీ వేయడాన్ని ఆహ్వానిస్తున్నామని, అయితే మణిపూర్‌లో మారణకాండ జరిగినప్పుడు ఆ పని ఎందుకు చేయలేదో చెప్పాలని డీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ ప్రశ్నించారు. కుంభకోణం తొక్కిసలాట సమయంలోనూ, గుజరాత్ వంతెన కూలిన సమయంలోనూ నిజనిర్ధారణ కమిటీ ఆయా ప్రాంతాలకు ఎందుకు వెళ్లలేదని ఆయన నిలదీశారు. కరూర్ విషాద ఘటనను రాజకీయం చేయడం మానుకోవాలని బాలాజీ సూచించారు.

హీరో నాగార్జున వ్యక్తిత్వ
హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ

▸ ఆయన అనుమతి లేకుండా పేరు, ఫొటోలు వాడకూడదు

▸ అశ్లీల చిత్రాలు తొలగించాలని 10 వెబ్‌సైట్లకు ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 1: సినీ హీరో అక్కినేని నాగార్జున వ్యక్తిత్వ హక్కులు (పర్సనాలటీ రైట్స్)కు ఢిల్లీ హైకోర్టు రక్షణ కల్పించంది. పేరు, చిత్రాలు, ప్రత్యేకంగా గుర్తించదగ్గ హావభావాలు వంటి వ్యక్తిగత లక్షణాలు కేవలం ఆయన సొంతమని, అనుమతి లేకుండా ఇతరులు ఉపయోగించకూడదని స్పష్టం చేసింది. ఆయన పేరు, చిత్రాలను ఎలాంటి సమ్మతి లేకుండా వినియోగించే వారిపై ఆంక్షలు విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన అనుమతి ఉందన్న రీతిలో ఫొటోలను వాడుకుంటూ ఆయన వ్యక్తిత్వ, నైతిక హక్కులకు భంగం కలిగిస్తున్న పది వెబ్‌సైట్లపై ప్రత్యేకంగా ఆంక్షలు పెట్టింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆయన పేరును, చిత్రాలను, వ్యక్తిత్వానికి సంబంధించిన ఇతర ప్రత్యేక లక్షణాలను ఆ వెబ్‌సైట్లు దుర్వినియోగం చేస్తున్నట్టు ప్రాథమికంగా కనిపిస్తోందని తెలిపింది. ఒకరి వ్యక్తిత్వ హక్కులను దోపిడీ చేయడం అంటే వారి ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయడంతో పాటు, గౌరవప్రదంగా జీవించే హక్కును ప్రమాదంలోకి నెట్టడమేనని పేర్కొంది. వారి పరపతి, ప్రఖ్యాతికి చెప్పలేనంత నష్టం కలిగిస్తుందని తెలిపింది. నాగార్జున వినోద రంగ పరిశ్రమలో సెలబ్రిటీ అని, కొన్ని చిత్రాలు ఆయనకు చెందినవిగా చెప్పుకోవడం తప్పుడోవ పట్టించడంతో పాటు పరువు నష్టం కలిగించేవని తెలిపింది. తగనిరీతిలో చేసిన అలాంటి చర్యలు కారణంగా ఆయన పేరు ప్రఖ్యాతులు పలచన అవుతాయని అభిప్రాయపడింది. పోర్నోగ్రాఫిక్ కంటెంట్‌లో అశ్లీల చిత్రాలు, వీడియోలను ఉపయోగించి తన పేరును దుర్వినియోగం చేశారని పేర్కొంటూ నాగార్జున 10 వెబ్‌సైట్లపై ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు ఆ సమాచారం మొత్తాన్ని 72 గంటల్లోగా తొలగించాలని సంబంధిత యూఆర్‌ఎల్‌లను ఆదేశించింది. కొన్ని యూఆర్‌ఎల్‌లు పనిచేయకుండా ఏడు రోజుల్లోగా బ్లాక్ చేయాలంటూ కేంద్ర ఐటీ, టెలికాం శాఖకు సూచనలు ఇచ్చింది.

షేక్ కోసం అమ్మాయి కావాలి

▸ ఆయనకు సెక్స్ పార్ట్‌నర్‌గా నీ క్లాస్‌మేట్స్‌లో ఎవరైనా ఉన్నారా?

▸ ఓ పీజీ విద్యార్థినితో వాట్సాప్ చాటింగ్‌లో ఢిల్లీ బాబా

▸ అతడి గదిలో అశ్లీల వీడియోలు.. మోదీ, ఒబామాతో దిగినట్లు ఫేక్ ఫొటోలు

న్యూఢిల్లీ, అక్టోబరు 1: నుదుటన అడ్డ నామాలతో కాషాయ వస్త్రాల్లో కనిపించే 62 ఏళ్ల 'ఢిల్లీ బాబా' అలియాస్ స్వామి చైతన్యానంద సరస్వతి 17 మంది పీజీ విద్యార్థినులపై తీవ్ర లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఢిల్లీలోని అత్యంత ఖరీదైన వసంత్‌కుంజ్ ప్రాంతంలో ఆశ్రమం నడుపుతున్న ఈ ఢిల్లీ బాబా భాగోతమంతా ఇటీవలే రట్టయింది. శృంగేరీ పీఠానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శారదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ అనే విద్యాసంస్థకు డైరెక్టర్‌గా ఉన్న ఢిల్లీ బాబా అక్కడ డిప్లొమా కోర్సులో పీజీ చేస్తున్న 32 మంది ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థినుల్లో 17మందిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలతో గత ఆగస్టులో బాధిత విద్యార్థునులు పోలీసు స్టేషన్ మెట్లెక్కారు. విచారణలో భాగంగా ఆ బాబా వాట్సాప్ చాటింగ్ జాబితా పరిశీలించి పోలీసులే షాకయ్యారు. ఓ విద్యార్థినితో మాటలు కలిపిన బాబా.. "ఓ దుబాయ్ షేక్ కోసం శృంగార భాగస్వామి కావాలి. మీ స్నేహితుల్లో ఎవరైనా ఉన్నారా?" అని అడిగాడు. ఆ యువతి.. "నాకు తెలియదు" అని చెప్పగా.. "నీ క్లాస్‌మేట్స్‌లో గానీ, జూనియర్లలో గానీ ఎవ్వరూ లేరా?" అని ఆరా తీశాడు. మరో అమ్మాయిని.. "స్వీటీ బేబీ.. నేనిప్పుడు డ్యాన్ చేస్తున్నాను. నాతో కలిసి డ్యాన్స్ చేస్తావా?" అని అడిగాడు. మరో అమ్మాయితో.. "నాతో పడుకోవా?" అంటూ అడిగాడు. తన గదికి వచ్చి చెప్పినట్లు వింటే విదేశాల్లో తిప్పుతానని.. ఖర్చులన్నీ తానే భరిస్తానని ఆఫర్ చేసేవాడని చాటింగ్‌లోని విషయాల ద్వారా తేలింది. విద్యార్థినుల ఫిర్యాదుతో ఆగస్టు 4న బాబాపై కేసు నమోదవగా ఈనెల 28న ఆగ్రాలో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ బాబా... ప్రధాని మోదీ, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బ్రిటన్‌కు చెందిన ఓ రాజకీయ నేతతో కలిసి దిగినట్లుగా నకిలీ ఫొటోలు సృష్టించాడు. ఈ ఫొటోలతో పాటు, కొన్ని అశ్లీల చిత్రాల సీడీలను, సెక్స్ టాయ్స్‌ను ఢిల్లీలోని బాబా ఆశ్రమం గదినుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాబాకు సంబంధించి 8కోట్ల విలువైన ఆస్తులను స్తంభింపజేశారు. కాగా బాబా చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు, విద్యాసంస్థ నుంచి తొలగిస్తున్నట్లు శృంగేరీ పీఠం ప్రకటించింది.

'విజయవాడ ఉత్సవ్' అద్భుతం

▸ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, బుద్దా వెంకన్న తదితరులు

'విజయవాడ ఉత్సవ్' అద్భుత ఘట్టమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. పున్నమి ఘాట్‌లో బుధవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు 'విజయవాడ ఉత్సవ్' దోహదపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు.. కళలు, సాంస్కృతిక పరిరక్షణకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. వచ్చే ఏడాది జరిగే 'విజయవాడ ఉత్సవ్'కు ప్రధాని నరేంద్ర మోదీని తీసుకొస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాధవ్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఘనంగా సత్కరించి కొండపల్లి బొమ్మలను బహూకరించారు.

రామచంద్ర గుహకు మహాత్మాగాంధీ సేవా పురస్కారం

▸ కర్ణాటక ప్రభుత్వం ప్రకటన



బెంగళూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ సేవా పురస్కారానికి కర్ణాటకకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, రచయిత రామచంద్ర గుహ ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే పురస్కారాల్లో భాగంగా ఈసారి ఆయనను ఎంపిక చేసింది. సమాచార, పౌరసంబంధాల శాఖ ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేసింది. గాంధీజీ జీవిత విలువలను సమాజంలో చాటి చెప్పే వారికి, సంస్థలకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. దేశ సమకాలీన అంశాలు, చరిత్ర, రాజకీయాలు, పర్యావరణ పరిరక్షణకు పోరాటం, క్రికెట్ తదితర అంశాలపై రామచంద్రగుహ రచనలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఇండియా ఆఫ్టర్ గాంధీ, భారతీయ క్రికెట్ సామాజిక ఇతిహాసం, గాంధీ జీవిత చరిత్ర రెండో భాగం, ది అన్‌క్వైట్ వుడ్స్ వంటి రచనలు ఎంతో పేరొందాయి. సమాజంలో గాంధీజీ ఆదర్శాలపై రచనలు, అధ్యయనం వంటివి స్ఫూర్తిగా ఉన్నాయని, పురస్కారానికి రామచంద్ర గుహ ఎంపిక సముచితమని సమాచార శాఖ కమిషనర్ హేమంత్ నింబాళ్కర్ పేర్కొన్నారు.

ఎమిరేట్స్ విమానాల్లో పవర్ బ్యాంకుల వాడకంపై నిషేధం

న్యూఢిల్లీ, అక్టోబరు 1: ఎమిరేట్స్ విమానాల్లో ప్రయాణికులు పవర్ బ్యాంకులు వినియోగించకుండా నిషేధం విధించారు. బుధవారం నుంచే ఇది అమల్లోకి వచ్చింది. ప్రతి ప్రయాణికుడు 100 వాట్-అవర్స్ వరకు పవర్ బ్యాంక్‌ను క్యాబిన్ బ్యాగేజీలో తీసుకెళ్లవచ్చు. కానీ మొత్తం ప్రయాణ సమయమంతా పవర్ బ్యాంక్‌ను స్విచ్ఛాఫ్ చేయాలి. ప్రయాణికులు తమ ఫోన్లు లేదా టాబ్లెట్స్‌ను వీటి ద్వారా చార్జింగ్ చేసుకోరాదు. అలాగే సీటు సమీపంలోని అవుట్‌లెట్ల ద్వారా పవర్ బ్యాంకులను రీచార్జి చేసుకోరాదు. భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎమిరేట్స్ సంస్థ వెల్లడించింది. "ఇటీవల పవర్ బ్యాంకుల వినియోగం గణనీయంగా పెరిగింది. విమానాల్లో బ్యాటరీ సంబంధిత ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటివి నివారించడానికి పవర్ బ్యాంకుల వాడకంపై నిషేధం విధించాం" అని ఎమిరేట్స్ సంస్థ పేర్కొంది.

'గూగుల్' భూసేకరణకు

ఎవరు అడ్డుపడినా ఉపేక్షించవద్దు

- విశాఖ కలెక్టర్‌కు చంద్రబాబు ఆదేశం
- రైతులకు తెలియకుండా వారి పేర్లతో కోర్టులో కేసులు వేశారు: గంటా



విశాఖ విమానాశ్రయంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న సీఎం

విశాఖపట్నం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆనందపురం మండలం తర్లువాడ వద్ద గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణకు ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే ఉపేక్షించవద్దని, కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. విజయనగరం జిల్లా పర్యటన కోసం బుధవారం విశాఖపట్నం విమానాశ్రయంలో దిగిన ఆయన్ను మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కలిసి భూ సమస్యను వివరించారు. రైతులను కొందరు ఉసిగొల్పి కోర్టు కేసులు వేయిస్తున్నారన్నారు. రైతులకు తెలియకుండా వారి పేర్లతో కేసులు వేశారని.. అందులో చనిపోయిన వ్యక్తి పేరు కూడా ఉందని చెప్పడంతో సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి వ్యవహారాలకు ఎవరు మద్దతు ఇచ్చినా ఊరుకోవద్దని, వారిపై చర్యలు తీసుకోవాలని అక్కడే ఉన్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను ఆదేశించారు. భూములిచ్చిన రైతులకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధికి షాపింగ్ కాంప్లెక్స్, ఇళ్ల నిర్మాణానికి మూడు సెంట్ల స్థలం ఇప్పించాలని గంటా కోరారు. సీఎం స్పందిస్తూ.. భూ సేకరణకు ఒకసారి పరిహారాన్ని ప్రకటించిన తర్వాత దానిని పెంచడం ఎక్కడా లేదని.. కేవలం ఇక్కడ రైతుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని పెంచామన్నారు. భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలి

- రాష్ట్ర ప్రజలకు సీఎం, డిప్యూటీ సీఎం విజయదశమి శుభాకాంక్షలు

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): 'సకల చరాచర జీవరాశులను సంరక్షించే శక్తి స్వరూపిణి అయిన శ్రీ కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా తెలుగు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. 'రాక్షస సంహారంతో లోకానికి శాంతి సౌభాగ్యాలు తెచ్చిన ఆ తల్లి చల్లని చూపు రాష్ట్రంపై ఇదే విధంగా కొనసాగాలి. సంక్షేమం, అభివృద్ధితో ఈ మహాయజ్ఞాన్ని కొనసాగించే నైతిక బలాన్ని అందివ్వాలి. ఈ దసరా పండుగ ఇంటింటా వెలుగులు నింపాలి' అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. కాగా, తెలుగు ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. కనకదుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు.

సోషల్ మీడియా కట్టడికి మంత్రులతో కమిటీ

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్య పోస్టులను కట్టడి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో క్యాబినెట్ సబ్ కమిటీని నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు లోకేశ్, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి ఉన్నారు. ఈ కమిటీ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి రాష్ట్ర సమాచారశాఖ కమిషనర్ /డైరెక్టర్.. కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలకు వర్తించే ప్రస్తుత చట్టాలు, నియమాలు, మార్గదర్శకాలను ఈ కమిటీ సమీక్షిస్తుంది. హానికర కంటెంట్, ఆన్‌లైన్ దుర్వినియోగం, జాతీయ భద్రతకు ముప్పు కలిగించే పోస్టులపై తీసుకోవాల్సిన చర్యలపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి సిఫారసులు చేయనుంది.

గుడులు కాదు మౌలిక సదుపాయాలు కావాలి

- ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లు లేవని ప్రశ్నించడమూ నేరమేనా?: షర్మిల

'ప్రభుత్వ దృష్టి దళితవాడల్లో గుడులు కట్టించడంపై ఉండకూడదు. బడులు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ఉండాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈమేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన చేశారు. '228 మంది ఎస్సీ విద్యార్థులకు ఒకే బాత్‌రూమ్ ఉందని హైకోర్టు పేర్కొంది. దానిపై దృష్టిపెట్టాలని నేను అడగడమూ తప్పేనా..! ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్లు లేవని ప్రశ్నించడం నేరమా? టీటీడీ నిధులతో కట్టే దేవాలయాలకు స్వయంగా సీఎం ప్రమోషన్ చేయడమేంటి? కూటమి ప్రభుత్వంలో బీజేపీతో కలసి ఉన్న సీఎంగా మిగిలిన మతాలకు అభద్రతా భావం కలిగించకూడదు. నాపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ నీచ ప్రచారం చేస్తున్నాయి' అని షర్మిల అన్నారు.

పీఐబీ డైరెక్టర్‌గా సురేశ్‌కుమార్ బాధ్యతలు



విజయవాడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్(ఐఐఎస్) అధికారి జి.సురేశ్‌కుమార్ పత్రికా సమాచార కార్యాలయ డైరెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(పీఆర్‌జీఐ)కు డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా ఆయన అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. పీఐబీ డైరెక్టర్‌గా నియమితులవడానికి ముందు ఐదు సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వంలో అనేక హోదాల్లో ఆయన విధులు నిర్వర్తించారు. గతంలో విజయవాడలోని దూరదర్శన్ న్యూస్ ప్రాంతీయ వార్తల విభాగాధిపతిగా, హైదరాబాద్ డీపీఆర్ డిఫెన్స్ ప్రజా సంబంధాల అధికారిగా, ఢిల్లీ ఇఎంఎంసీలో సహాయ సంచాలకులుగా పనిచేశారు. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రచార కార్యకలాపాలు, డిప్యూటీ ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్‌గా ప్రింట్ మీడియా సంస్థలకు సంబంధించిన వివిధ కార్యకలాపాలను సమన్వయం చేస్తానని ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



సీఎం చంద్రబాబును చూసేందుకు హెలిప్యాడ్ సమీపానికి వచ్చిన గ్రామస్థులు



దత్తి గ్రామస్థులను పలకరిస్తున్న సీఎం చంద్రబాబు

పెన్షన్లలో ఏపీ టాప్

సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా చదువుకున్న పిల్లలకు ఇస్తున్న 'తల్లికి వందనం' పథకం కాదు. అది ప్రభుత్వం తరఫున పిల్లలపై పెట్టుబడి. రేపటి తరంపై పెట్టుబడి పెట్టి చదివిస్తున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ ఇస్తున్నాం.

గత ప్రభుత్వ హయాంలో 9 పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్ల భారం మోపారు. మేం ట్రూడౌన్ పేరుతో చార్జీలు తగ్గిస్తున్నాం. నవంబరు నుంచి యూనిట్‌కు 13 పైసల చొప్పున తగ్గనుంది. రానున్న రోజుల్లో పొలాల్లో సోలార్ సిస్టమ్‌ను తీసుకొస్తాం. - సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందించిన తర్వాత ప్రజావేదికలో మాట్లాడారు. అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో రూ.500 మాత్రమే అందిస్తున్నారన్నారు. మానవత్వంతో ఆలోచించి పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా ఒక గ్రామానికి వచ్చి నేరుగా పర్యవేక్షిస్తున్నానని, ఇందులో భాగంగా ఈ రోజు మీ గ్రామానికి వచ్చానని సీఎం చెప్పడంతో గ్రామస్థులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. ఒక్క పింఛన్ పెంపుతోనే సరిపెట్టలేదని.. సూపర్ సిక్స్ హామీలను అమలుచేసి సూపర్ హిట్ చేశామన్నారు. 'ఆడబిడ్డలు కష్టపడకూడదన్న కోణంలో ఆలోచించి నాడు దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు ఇచ్చాం. ఇప్పుడు దీపం-2 కింద ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం కల్పిస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించేలా సాహసోపేత నిర్ణయం తీసుకున్నాం. పథకం ప్రారంభించిన 45 రోజుల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు' అని వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని నాడు డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చామని.. వాటికి మరింత చేయూతనందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈనెల 4న 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద ఒక్కొక్కరికి రూ.15 వేలు జమ చేస్తామన్నారు. విజయనగరం జిల్లా పేదరికంలో ఉందని.. దాన్ని మార్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. వ్యవసాయం ప్రధాన ఆధారం కావడంతో ఆ రంగంలో మౌలిక వసతుల కల్పన, సాగునీటిపై దృష్టిపెడతామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు అందిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఏడాదిలోనే మెగా డీఎస్సీని పూర్తిచేసి 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. యువతకు అండగా ఉండి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తనదేనన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ 15 నెలల కాలంలో 4,71,574 మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని.. 9 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రకటించారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

ప్రతి కుటుంబానికి 25 లక్షల ఆరోగ్య బీమా

ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రస్తుతం 2.50 లక్షల ఆరోగ్య బీమా అందజేస్తున్నాం. రానున్న రోజుల్లో కుటుంబానికి రూ.25 లక్షల బీమా ఇస్తాం. 2029నాటికి అందరికీ ఇళ్లు కట్టించి అందజేస్తాం. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలిస్తాం. జీఎస్టీ వల్ల రాష్ట్రానికి రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గింది. అయినా భయపడలేదు.

చివరి ఊపిరి ఉన్నంతవరకు పేదల కోసమే

నా చివరి ఊపిరి ఉన్నంత వరకు పేదల కోసమే పనిచేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తా. కష్టంలేని సుపరి పాలన అందించడమే నా లక్ష్యం. మని, ఒక్క రూపాయి లంచం లేకుండా ప్రజలకు సుపరి పాలన అందించేందుకు బాధ్యత తీసుకున్నాం. వాట్సాప్ ద్వారా పౌర సేవలు అందిస్తున్నాం. ఎక్కడ ఏది జరిగినా ఫోన్‌లో సమాచారం తెలుసుకుంటున్నాం. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామికవేత్త తయారుకావాలి.



అప్పలరాజు తల్లికి వృద్ధాప్య పింఛను అందజేస్తున్న సీఎం

ప్రజలకు సేవలు ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత

ప్రభుత్వ యంత్రాంగం తప్పు చేస్తే ప్రజల ముందు నిలబెడతాం. యంత్రాంగం పనితీరుపై రానున్న రోజుల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతాం. గతంలో అధికారులు తప్పుచేస్తే చర్యలు తీసుకునేవాళ్లం. ఇక నుంచి అలా ఉండదు. ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉంది. వారు బాగా పని చేయకపోతే గతంలో తిట్టేవాడినని, ఇప్పుడు ప్రజల ముందు నిలబెడతున్నాం. హార్డ్‌వర్క్ కాదు.. స్మార్ట్‌గా వర్క్ చేయాలి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలవరకు పనిచే స్తే ప్రజలకు చక్కటి సేవలు అందుతాయి.

భోగాపురం ఎప్పుడో పూర్తికావాలి..

వెనుక బడిన ఉత్తరాంధ్ర జిల్లాల్లో రానున్న రెండేళ్లలో రూ.2 వేల కోట్లతో ప్రాజెక్టులు పూర్తిచేస్తాం. విజయనగ రం జిల్లాలోని తోటపల్లి, తారక రామతీర్థసాగర్, గజపతినగరం బ్రాంచ్ కెనాల్ వంటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. నదులు అనుసంధాన ప్రక్రియ కూడా చేపడతాం. విశాఖకు టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్, యాక్సెంచర్ వంటి కంపెనీలు వస్తున్నాయి. లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి. ఉత్తరాంధ్రకు న్యాయం జరగాలన్న ఉద్దేశంతో భోగాపురం అంతర్జాతీయ ఎయిర్ పోర్టు చేపట్టాం. ఎప్పుడో పూర్తికావల్సిన ఈ ప్రాజెక్టును గత పాలకులు నిర్లక్ష్యం చేశారు. కూటమి అధికారం లోకి వచ్చిన తక్షణమే పనులు వేగవంతం చేశాం. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తాం. దీనివల్ల ఈ ప్రాంతం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది.

పీ-4 ద్వారా లక్ష మంది మార్గదర్శకులు

సమాజంలో అట్టడుగులో ఉన్నవారిని ఆదుకోవాలి. ఆర్థిక అసమానతలు తగ్గించి మెరుగైన జీవన ప్రమాణాలు అందించడానికి పీ-4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో లక్ష మంది మార్గదర్శకులు పది లక్షల మంది బంగారు కుటుంబాలను వృద్ధిలోకి తీసుకురానున్నారు (దత్తి గ్రామంలోని రెండు బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న వారిని ముఖ్యమంత్రి అభినందించారు). రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తే ఖబడ్దార్. ఆడబిడ్డలకు స్వేచ్ఛ, రక్షణ కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఇప్పుడు స్వాతంత్ర్యం వచ్చింది

గత ప్రభుత్వంలో రహదారులకు ఇరువైపులా ఉన్న పచ్చనిచెట్లను నరికి పరదాలు కట్టుకుని పర్యటించేవారు. ఇప్పుడా విధానానికి స్వస్తి పలకడంతో ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చింది. నాకు కక్షగట్టడం తెలియదు.

కిడ్నీ రోగి ఇంటికి సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తి గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పొట్నూరు అప్పలరాజు ఇంటికి వెళ్లి స్వయంగా పింఛన్ అందజేశారు. ఆయన తల్లికి వృద్ధాప్య పింఛను ఇచ్చారు. వారితో కాసేపు కూర్చుని ముచ్చటించారు. గతంలో అప్పలరాజుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.65 లక్షలు వచ్చిందని, ఆయన తల్లి కిడ్నీ దానం చేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ప్రతి నెలా ఆయనకు రూ.10 వేలు, ఆయన తల్లికి రూ.6 వేల పింఛన్ అందుతోంది. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, సెర్ప్ సీఈవో కరుణ్, జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22న దుబాయ్‌కి చంద్రబాబు

- విశాఖ భాగస్వామ్య సదస్సుకు పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకే
- 18న ఆస్ట్రేలియాకు లోకేశ్.. అక్కడి ప్రభుత్వ ఆహ్వానం మేరకు పర్యటన

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 22 నుంచి 24 వరకు దుబాయ్, అబుదాబి, యూఏఈల్లో పర్యటించనున్నారు. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సు(పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2025)కు పెట్టుబడిదారులను ఆహ్వానించేందుకు ఈ పర్యటన చేపడుతున్నారు. రియల్ ఎస్టేట్స్, భవన నిర్మాణం, రవాణా, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్నోవేషన్ రంగాల్లో పెట్టుబడిదారులతో సీఎం భేటీ అయ్యి విశాఖ సదస్సుకు ఆహ్వానించనున్నారు. సీఎంతోపాటు మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, పలువురు అధికారులు వెళ్లనున్నారు. కాగా, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ఈ నెల 18న ఆస్ట్రేలియాకు వెళ్లనున్నారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్పెషల్ విజిట్స్ ప్రోగ్రాం(ఎస్‌వీపీ)లో పాల్గొనాలని పంపిన ఆహ్వానం మేరకు లోకేశ్ ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. అక్కడి కీలక రాజకీయ నేతలు, విద్యారంగ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రవాస భారతీయులతో లోకేశ్ సమావేశం కానున్నారు.

అమరావతికి కేంద్రీయ విద్యాలయం

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆర్థికవ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ మేరకు ఆమోదం తెలిపింది. చిత్తూరు మండలంలోని మంగ సముద్రం, కుప్పం మండలంలోని బైరుగానిపల్లె, శ్రీకాకుళం జిల్లాలోని పలాస, అమరావతిలోని శాఖమూరుల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 38 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. తాజాగా ఏర్పాటు కానున్నవాటితో ఈ సంఖ్య 42కి చేరనుంది. కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ప్రధాని మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలో విద్యావ్యవస్థ అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు.

ఒకటో తేదీ పింఛనర్లకు పెద్ద పండుగ..!

- జీఎస్టీ తగ్గింపుతో రైతులకు భారీగా లబ్ధి: నిమ్మల
- యలమంచిలిలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ర్యాలీ

యలమంచిలి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఒకటో తేదీ వచ్చిందంటే రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెద్ద పండుగేనని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి గ్రామంలోని తాడిగరువుతోటలో బుధవారం జరిగిన పింఛను పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వృద్ధురాలు సాధనాల సత్యవతి ఇంటికి వెళ్లి.. ఆమెకు పింఛను సొమ్ము అందించారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె కట్టెల పొయ్యిపై వంట చేయడం చూసి... గ్యాస్ స్టవ్, సిలెండర్ కనెక్షన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఒక నెల తీసుకోకపోతే పెన్షన్ ఇచ్చేవారు కాదని, నేడు సీఎం చంద్రబాబు మూడు నెలల పింఛను ఒకేసారి తీసుకునే అవకాశం కల్పించారని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా పింఛన్ సొమ్మును రూ.4 వేలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లబ్ధి

యలమంచిలి గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' ట్రాక్టర్ ర్యాలీలో మంత్రి నిమ్మల స్వయంగా ట్రాక్టర్ నడిపి రైతుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం యలమంచిలి ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ రంగంలో యంత్రాల ధరలు గణనీయంగా తగ్గాయని, దీంతో రైతాంగానికి భారీగా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికీ రూ.15 వేలు ఆదా అవుతుందని అన్నారు.



యలమంచిలిలో సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి నిమ్మల

అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్

- 2018 తర్వాత ఇదే మొదటిసారి

వాషింగ్టన్, అక్టోబరు 1: అమెరికా కాంగ్రెస్‌లో అధికార పక్షం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌కు.. తాము ప్రతిపాదించిన మార్పులు చేయకపోవడంతో డెమొక్రాట్లు ఆ బిల్లును బ్లాక్ చేశారు. దీనివల్ల నిధులు నిలిచిపోవడంతో అమెరికాలో అత్యవసర సేవలు మినహా మిగతా ప్రభుత్వ కార్యకలాపాలన్నీ భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి (షట్‌డౌన్) స్తంభించిపోయాయి. 2018 తర్వాత ఇలా జరగడం ఇదే మొదటిసారి. అప్పుడూ ట్రంపే అధికారంలో ఉన్నారు. మెక్సికో సరిహద్దుల్లో గోడ కట్టడానికి ట్రంప్ సర్కారు అడిగిన నిధులివ్వడానికి డెమొక్రాట్లు ఒప్పుకోకపోవడంతో 2018 డిసెంబరు 22న షట్‌డౌన్ మొదలైంది. చివరకు అది 2019 జనవరి 25న ముగిసింది. ఇప్పుడు కూడా ట్రంప్ సర్కారు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌కు ఆమోదం లభించేదాకా ఈ షట్‌డౌన్ కొనసాగుతుంది. అప్పటిదాకా సైన్యం, పోలీసు, వైద్యం, విమాన రవాణా తదితర అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయి. అత్యవసరం కాని.. జాతీయ పార్కులు, మ్యూజియాలు, కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను మూసేస్తారు. షట్‌డౌన్ సాగినన్నాళ్లూ వాటిలోని ఉద్యోగులు కార్యాలయానికి రానక్కర్లేదు. ఈ సమయంలో పనిచేసినవారికి సైతం బడ్జెట్‌కు ఆమోదం లేకపోవడంతో వెంటనే జీతాలు ఇవ్వరు. బడ్జెట్‌కు ఆమోదం లభించిన తర్వాత మాత్రమే ఆ కాలానికి జీతం ఇస్తారు.

బంగాళాఖాతంలో వాయుగుండం



ఉధృతంగా గోదావరి

ఏలూరు జిల్లా వేలేరుపాడు వద్ద గోదావరి వరద ఉధృతి

- వేలేరుపాడులో గ్రామాలకు రాకపోకలు బంద్.. పడవల ద్వారా మండల కేంద్రానికి జనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): గోదావరిలో వరద తీవ్రత కొనసాగుతోంది. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని 24 గ్రామాలను నీరు చుట్టుముట్టడంతో ఆ గ్రామాల ప్రజలు పడవల ద్వారా మండల కేంద్రానికి వస్తున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులను జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జ్ ఆర్డీవో ఎం.ముక్కంటి పర్యవేక్షణలో పంపిణీ చేశారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 11,22,886 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.170 మీటర్లు, దిగువన 24.740 మీటర్లు నీటి మట్టం నమోదైనట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజి వద్ద 13.60 అడుగుల నీటిమట్టం నమోదైంది. బ్యారేజి నుంచి 12,59,482 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గురువారం నుంచి కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహాలు తగ్గుముఖం పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కృష్ణానదిలో ప్రకాశం బ్యారేజీకి 6,08,233 క్యూసెక్కుల వరద వస్తుండగా, గేట్లన్నీ ఎత్తి వచ్చిన నీరు వచ్చినట్టుగానే సముద్రంలోకి వదిలేస్తున్నారు.

- నేడు తీవ్ర వాయుగుండంగా మార్పు?
- రేపు గోపాల్‌పూర్-పారాదీప్ మధ్య తీరంపైకి
- ఉత్తరకోస్తాకు అతిభారీ, దక్షిణ కోస్తాకు భారీ వర్షాలు
- ఓడరేవుల్లో మూడో నంబరు హెచ్చరిక

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బుధవారం వాయుగుండంగా బలపడింది. ఇది విశాఖపట్నానికి తూర్పు ఆగ్నేయంగా 360, గోపాల్‌పూర్‌కు 360 కి.మీ. దక్షిణ ఆగ్నేయంగా, పూరికి 390 కి.మీ. దక్షిణంగా కేంద్రీకృతమై ఉంది. ఇది ఉత్తర వాయవ్యంగా పయనించి గురువారం ఉదయానికి తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. ఆ తర్వాత వాయగుండంగా బలహీనపడి గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం తెల్లవారుజామున గోపాల్‌పూర్, పారాదీప్ మధ్య పూరి సమీపంలో తీరం దాటనుంది. దీని ప్రభావంతో బుధవారం కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. అనకాపల్లి జిల్లా మాడుగులలో 7.35, గాదిరాయిలో 5.17, శ్రీకాకుళం జిల్లా పలాసలో 4.05 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకూ కోస్తాలో అనేకచోట్ల భారీ వర్షాలు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సముద్రం అల్లకల్లోలంగా మారిందని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కోస్తాలోని అన్ని ఓడరేవుల్లో మూడో నంబరు భద్రతా సూచిక ఎగురవేశారు.

రెండు సముద్రాల్లో ఒకేసారి వాయుగుండాలు..

బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతుండగా.. అదే సమయంలో గుజరాత్‌కు ఆనుకుని ఈశాన్య అరేబియా సముద్రంలో మరో వాయుగుండం కొనసాగుతోంది. ప్రస్తుతం రెండింటి మధ్య మూడు వేల కిలోమీటర్ల దూరం ఉన్నందున ఒక దానిపై మరొకటి ప్రభావం చూపే అవకాశం లేదని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు. కోస్తాలో తీరం వెంబటి గంటకు 40-60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

కష్టం తిలక్‌వర్మది

క్రెడిట్ జగన్‌ది..!

- అధినేతను కీర్తించబోయి అభాసుపాలైన వైసీపీ సోషల్ మీడియా
- తిలక్‌వర్మను జగనే ప్రోత్సహించారట.. ఆడుదాం ఆంధ్రాలో చాన్స్
- ఇంకా జగన్ షీల్డ్ కూడా అందజేత
- పొడుగ్గా ఉన్న వర్మ జగన్ కంటే పొట్టిగా ఉన్నట్టు మార్ఫింగ్ ఫొటో



కబడ్డీ క్రీడాకారుడికి ట్రోఫీ ఇచ్చే ఫొటోను క్రికెటర్ తిలక్ వర్మకు జగన్ ట్రోఫీ ఇస్తున్నట్లు మార్ఫింగ్ చేసిన వైసీపీ సోషల్ మీడియా

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

నవ్విపోదురు గాక నాకేంటి... అన్నట్టుగా వైసీపీ సోషల్ మీడియా వ్యవహారం ఉంది. గిట్టనివారిపై బూతు పోస్టులు పెట్టడమైనా, వైసీపీ అధినేత జగన్‌ను ఆకాశానికి ఎత్తేసేలా లేనిపోని గొప్పలకు పోవడమైనా.. ఏదైనా సరే తనకు తానే సాటి! తాజాగా జగన్‌ను కీర్తించే క్రమంలో ఆయన పరువు తీసేలా తప్పులో కాలేసింది. పాకిస్థాన్‌తో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో తెలుగు యువ క్రికెటర్ తిలక్ వర్మ 69 పరుగులతో అద్భుతంగా రాణించి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని ఆసియా కప్ హీరో తిలక్ వర్మ క్రెడిట్‌ను జగన్ ఖాతాలో వేసేలా ఫేక్ ప్రచారానికి తెరలేపి అభాసుపాలైంది. తిలక్ వర్మను జగనే ప్రోత్సహించారని, దేశానికి గొప్ప క్రికెటర్‌ను అందించారని వైసీపీ సోషల్ మీడియా ఎలివేట్ చేసింది. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2023 డిసెంబరులో ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా'లో తిలక్ వర్మకు అవకాశం ఇచ్చారని ఓ పోస్టు పెట్టారు. అంతటితో ఆగకుండా ముఖ్యమంత్రి హోదాలో జగన్.. తిలక్‌వర్మకు షీల్డ్ ఇస్తున్నట్లుగా కూడా ఫొటో కూడా జత చేశారు. ఇక్కడే వైసీపీ సోషల్ మీడియా అడ్డంగా దొరికిపోయింది. చూడటానికి తిలక్ వర్మ పొడుగ్గా ఉంటారు. తిలక్‌వర్మ ఎత్తు 5 అడుగులా 11 అంగుళాలు. అతడు జగన్ కంటే ఎత్తుగా ఉంటారు. జగన్ ఎత్తు 5 అడుగులా 4 అంగుళాలు మాత్రమే. కానీ ఫొటోలో తేడా కొడుతోంది! జగన్ పక్కన నిల్చున్న తిలక్ వర్మ ఆయన కంటే పొట్టిగా కనిపిస్తున్నారు! పొడుగ్గా ఉన్న మనిషి పొట్టిగా ఎలా మారారు? ఈ ఫొటో చూసిన వారికి ఇదే సందేహం వచ్చింది. ఇక్కడే అసలు విషయం బయటపడింది. జగన్‌కు లేనిపోని గొప్పలు ఆపాదించడానికి వైసీపీ సోషల్ మీడియా ఫేక్ ఫొటో సృష్టించి పోస్టు చేసింది. అంతేకానీ... 'ఆడుదాం ఆంధ్రా'లో తిలక్ వర్మ ఆడిందీ లేదు.. జగన్‌తో షీల్డ్ అందుకున్నదీ లేదు. వైసీపీ సోషల్ మీడియా చేస్తున్న ఫేక్ ప్రచారంలో ఇది పరాకాష్ఠ. వాస్తవం ఏమిటంటే.. తిలక్‌వర్మ 2019లో దక్షిణాఫ్రికాలో అండర్-19 క్రికెట్ ఆడారు. ఆ తర్వాత 2022లో ఐపీఎల్ మ్యాచ్‌ల్లోనూ ఆడారు. ఐపీఎల్‌లో సిక్స్‌లు, ఫోర్లతో మెరిసి బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందారు. ఆడుదాం ఆంధ్రాను 2023 డిసెంబరు 23న ప్రారంభించారు. అంటే.. అప్పటికే తిలక్ వర్మ జాతీయ స్థాయిలో క్రికెటర్‌గా గుర్తింపు పొందారు. తిలక్‌వర్మను జగనే ప్రోత్సహించారంటూ సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఫేక్ ఫొటో గుట్టును టీడీపీ, జనసేన కార్యకర్తలు రట్టు చేశారు. ఈ ఫొటో మార్ఫింగ్ అని తేల్చేశారు. ఈ ఫొటోలో ఉన్న అసలు వ్యక్తిని కూడా బయటపెట్టారు. దీంతో వైసీపీ ఇచ్చుకున్న ఎలివేషన్ అంతా తుస్సుమంది.



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

'అక్షరం' నింపిన వెలుగులు

- శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువుకు విద్యుత్ లైన్
- ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యకు పరిష్కారం

కొత్తచెరువు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులోని బీసీ కాలనీలో 'అక్షరం' వెలుగులు నింపింది. ఏళ్లుగా ఉన్న విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపింది. దసరా పండుగ వేళ గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. కాలనీలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ప్రారంభించి విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. చాలా ఏళ్లుగా.. ఈ బీసీ కాలనీకి విద్యుత్ సరఫరా సక్రమంగా జరక్క ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. లో వోల్టేజీతో ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్‌లు ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోతుండేవి. తరచూ విద్యుత్ అంతరాయాలతో ప్రజలు విసిగిపోతుండేవారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 28న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమం జరిగింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరుకాగా.. మండల ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కొత్తచెరువు బీసీ కాలనీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని షబీనా, కుళ్లాయప్ప కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. బీసీ కాలనీకి రూ.14.50 లక్షలతో 20 విద్యుత్ స్తంభాలు, 11 కేవీ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారు. దీంతో కాలనీలోని 300 ఇళ్లకు విద్యుత్ సమస్య తీరింది. ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్‌నాయక్, లైన్‌మన్ రోషన్, నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, ఒలిపి శీనా, అనిల్, అరుణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.


కొత్తచెరువు బీసీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజ చేస్తున్న పల్లె రఘునాథ రెడ్డి

వైద్యంలో వెయ్యి కోట్లు ఆదా!

- ప్రజలకు రూ.716 కోట్ల లబ్ధి: సత్యకుమార్
- ప్రభుత్వ కొనుగోళ్ల ఖర్చు 250 కోట్లు తగ్గుదల
- 2024-25లో 11,250 కోట్ల విలువైన మందులు కొన్న జనం
- అందులో రూ.1,350 కోట్లు పన్నుల భారం
- ఇప్పుడు 703 కోట్లకు తగ్గుతుందని అంచనా



అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ పన్నుల తగ్గింపుతో రాష్ట్ర ఆరోగ్య రంగంలో సుమారు రూ.1,000 కోట్లు ఆదా అవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రాణాధార మందులపై పన్ను తగ్గించడంతో ప్రజలు నేరుగా కొనుగోలు చేసే మందులు, సర్జికల్స్‌పైన రూ.716 కోట్లు.. ప్రభుత్వం జరిపే కొనుగోళ్లలో రూ.250 కోట్ల వరకూ వ్యయం తగ్గుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. 2024-25లో జరిగిన కొనుగోళ్ల ఆధారంగా ఇకపై సుమారు రూ.1,000 కోట్లు వరకు ప్రజారోగ్యంపై భారం తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మందులపై గత నెల 21వ తేదీ వరకూ 12%, 5% చొప్పున జీఎస్టీ ఉండేది 99 శాతం ఔషధాలు 12 శాతం కేటగిరీలోనే ఉండేవి. ఇప్పుడు దీనిని కేంద్రం ఐదు శాతానికి తగ్గించింది. 'అంటే 7 శాతం వరకూ పన్ను తగ్గింది. క్యాన్సర్ సహా అరుదైన కేటగిరీలో ఉన్న 33 రకాల మందులపై 12 శాతం వరకు ఉన్న పన్నును కేంద్రం పూర్తిగా తొలగించింది. దీనివల్ల ప్రజారోగ్యానికి భారీ ఊరట లభించింది' అని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 35 వేల వరకు మందుల దుకాణాలు, 5 వేలు వరకు టోకు వర్తక సంస్థలు ఉన్నాయి. వీటి ద్వారా 2024-25లో రూ.11,250 కోట్ల విలువైన మందులు, సర్జికల్స్ విక్రయాలు జరిగాయి. జనంపై రూ.1,350 కోట్ల వరకు పన్నుల భారం పడినట్లు రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా విభాగం తెలిపింది. ఇప్పుడు జీఎస్టీ తగ్గింపుతో రూ.703 కోట్ల వరకు భారం తగ్గనుంది. ఇవి కాకుండా క్యాన్సర్, ఇతర అరుదైన మందుల కొనుగోళ్లు రాష్ట్రంలో రూ.112 కోట్ల వరకు ఉంటుందని అంచనా. వీటిపై 12 శాతం పన్ను పూర్తిగా తొలగించినందున సుమారు రూ.13 కోట్ల వరకు బాధితులకు ఉపశమనం లభిస్తుందని అంచనా వేశారు. సదరు సంస్థలు ఖరారు చేసే ఎంఆర్‌పీ ధరల్లోనే జీఎస్టీ ఇమిడి ఉందని మంత్రి చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా 2024-25లో రూ.4,077 కోట్ల విలువైన ప్రీ-ఆథరైజేషన్లు ఇచ్చామన్నారు. ఇప్పుడు ఇందులో రూ.2,308.56 కోట్ల వరకూ ఆదా అవుతుందని తెలిపారు. మందులు, సర్జికల్ కొనుగోళ్లలో రూ.40 కోట్ల వరకు మిగులుతుందని చెప్పారు. 'ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా 2024-25లో రూ.679 కోట్లతో మందులు, సర్జికల్ ఐటమ్స్, ఇంప్లాంట్స్, డయాగ్నస్టిక్ కిట్లు, మొదలైన పరికరాలు కొనుగోలు చేశాం. ఇందులో రూ.71 కోట్లు జీఎస్టీ కింద చెల్లించాం. జీఎస్టీ 2.0 కారణంగా ఈ రూ.71 కోట్లలో రూ.40 కోట్లు ఇకపై చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఇలా పరిశీలిస్తే 2.0 సంస్కరణలతో ఏటా సగటున రూ.250 కోట్ల వరకూ ఆదా అవుతుందని అంచనా వేస్తున్నాం' అని వివరించారు.

రూ.33 కోట్లతో డీ-ఎడిక్షన్ సెంటర్ల బలోపేతం..

రాష్ట్రంలో డీ-ఎడిక్షన్ సెంటర్ల బలోపేతానికి రూ.33 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో జిల్లా, బోధనాస్పత్రుల్లో 21 కేంద్రాల్లో వైద్య పరికరాల, మందులు, మౌలిక సదుపాయాల కల్పన, సాంకేతిక వ్యవస్థ మెరుగుపరచడం, సిబ్బందికి ప్రోత్సాహకాలు, అవగాహన కార్యక్రమాలు కల్పిస్తామన్నారు. ఆరోగ్య శాఖ నుంచి ఎక్సైజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించామని, 21 కేంద్రాల ద్వారా వ్యసనాల బారినపడిన వారిని వాటి నుంచి బయటకుతెచ్చి సన్మార్గంలో నడిచే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు.

జీఎస్టీ 2.0తో..

రాష్ట్ర రాబడి పైపైకి!

- కేంద్రం, రాష్ట్రంలో పెరిగిన పన్ను వసూళ్లు
- దేశంలో గత ఏడాదికంటే 9.1 శాతం అధికం
- రాష్ట్రంలో 4 శాతం మేరకు పెరిగిన ఆదాయం
- శ్లాబులు మారితే ఆదాయం తగ్గుతుందన్న మార్కెట్ నిపుణుల వాదన బుట్టదాఖలు

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): వస్తు, సేవల పన్ను(జీఎస్టీ-2.0) శ్లాబుల మార్పుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదాయం తగ్గుతుందన్న వాదన బుట్టదాఖలైంది. నిత్యావసరాలు సహా.. ఇతర వస్తుల పన్నులు తగ్గడంతో వాటి విక్రయాలు పెరిగాయి. దీంతో సెప్టెంబరు నెల ద్వితీయార్థంలో దేశవ్యాప్తంగా పన్నుల వసూళ్లు జోరందుకున్నాయి. అయితే, కొన్ని కొన్ని రాష్ట్రాల్లో మాత్రం తగ్గుదల నమోదైంది. గత ఏడాది(2024) సెప్టెంబరులో దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.73 లక్షల కోట్లుగా నమోదుకాగా.. ఈ ఏడాది అదే నెలలో రూ.1.89 లక్షల కోట్లు వసూలయ్యాయి. అంటే 9.1 శాతం మేర పెరుగుదల కనిపించింది. అదేసమయంలో ఈ ఏడాది ఆగస్టులో వసూలైన రూ.1.86 లక్షల కోట్ల పన్నులతో పోల్చితే సెప్టెంబరు వసూళ్లు 1.5% అధికంగా ఉన్నాయి. దేశంలో జీఎస్టీ-2.0 సంస్కరణలు గత నెల 22 నుంచి అమలులోకి వచ్చాయి. ఫలితంగా 375 నిత్యావసర వస్తువులు సహా వస్తు సేవలు, ఆటోమొబైల్స్, గృహోపకరణాల వస్తువుల ధరలు దిగి వచ్చాయి. ఫలితంగా వాటికి డిమాండ్ పెరిగి విక్రయాలు పుంజుకున్నాయని మార్కెట్ నిపుణులు తెలిపారు.



నికర జీఎస్టీ కూడా..

గత నెలలో స్థూల జాతీయాదాయం 6.8 శాతం మేరకు పెరిగి రూ.1.36 లక్షల కోట్లకు చేరింది. మరోవైపు దిగుమతుల ద్వారా పన్ను రాబడి కూడా 15.6% వృద్ధి చెంది.. రూ.52,492 కోట్లుగా నమోదైంది. ఇక, జీఎస్టీ రిఫండ్లు కూడా 40.1% మేరకు పెరిగి రూ.28,657 కోట్లుగా నమోదయ్యాయి. నికరంగా జీఎస్టీ వసూలు రూ.1.60 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాది సెప్టెంబరుతో పోల్చితే ఇది 5% అధికమని మార్కెట్ వర్గాలు తెలిపాయి. తాజా పరిణామాలపై డెలాయిట్ పార్టనర్ ఎం.ఎస్. మణి స్పందిస్తూ.. జీఎస్టీ శ్లాబుల్లో మార్పుల కారణంగా ఆర్థిక కార్యకలాపాలు మందగించలేదనడానికి ఈ వసూళ్లు నిదర్శనమని తెలిపారు. సెప్టెంబరు వసూళ్లతో ఈ ఏడాది ఇప్పటివరకు సగటు పన్నుల రాబడి రూ.2 లక్షల కోట్లకు చేరువలో ఉన్నట్టు చెప్పారు.

ఏపీలో ఇలా పెరిగింది!

- రాష్ట్రాల వారీగా చూస్తే.. ఏపీలో జీఎస్టీ వసూళ్లు గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే 4 శాతం మేరకు పెరిగాయి. గత ఏడాది సెప్టెంబరులో రూ.3,506 కోట్ల జీఎస్టీ వసూలు కాగా, ప్రస్తుతం రూ.3,653 కోట్లకు చేరింది.
- తెలంగాణలో మాత్రం జీఎస్టీ వసూళ్లు 5 శాతం తగ్గాయి. గత ఏడాది సెప్టెంబరులో తెలంగాణలో రూ.5,267 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది రూ.4,998 కోట్లు మాత్రమే వచ్చాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.


విజయ దశమి
శుభాకాంక్షలతో
Vijaydigital
The Electronics Super Store Since 1982
LG
Life's Good.
Celebrate Festivities with Reduced Prices
GST
28% >>> 18%*
Festive Offers*
3 YEAR WARRANTY (On Select LG TVs)
Up to %* 26 CASHBACK Max ₹26000 ON SELECT CREDIT / DEBIT CARDS
Up to 30%* OFF ON LG SOUNDBAR (With Select 4K TVs)
FIXED EMI Starting from ₹2999*
LG BEST Care Ask for AMC ₹18 per day*
Powered by Microsoft Copilot
α11 4K AI Processor Gen2
AI Voice ID Chatbot
Dolby VISION·ATMOS
webOS Re:New Program
LG BEST Care
LG 24 x 7 CUSTOMER CARE
08069379999
www.lg.com/in/support
LG WhatsApp No. 9711709999
LG Service India Mobile App Available at Google Play
www.facebook.com/lgindiapage/
www.x.com/lgIndia
To know more about LG, visit www.lg.com/in
For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com
Scan to know more about LG AI TV
Regd. Office: LG Electronics India Limited, A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044
CIN No. U32107DL1997PLC220109
TELEVISIONS
32 (81.28 cm) HD Smart ₹10,990/-*
43 (109.22 cm) FHD ₹19,990/-*
65 (165.10 cm) Old GST 28% ₹62,000/-* New GST 18% ₹48,900/-*
43 QLED (109.22 cm) Old GST 28% ₹29,000/-* New GST 18% ₹25,490/-*
75 (190.50 cm) Old GST 28% ₹77,990/-* New GST 18% ₹62,490/-*
55 (139.70 cm) Old GST 28% ₹34,990/-* New GST 18% ₹28,599/-*
100 (254.00 cm) Old GST 28% ₹3,00,000/-* New GST 18% ₹2,70,000/-*
AIR CONDITIONERS
1.5 Ton 3 Star AC Old GST 28% ₹31,000/-* New GST 18% ₹27,900/-*
ON AIR CONDITIONERS Upto 10% Cashback*
1.5 Ton 5 Star AC Old GST 28% ₹38,500/-* New GST 18% ₹34,600/-*
REFRIGERATORS
190 Ltr Single Door Fridge Offer Price ₹11,990/-*
235 Ltr Double Door Fridge Convertable. Offer Price ₹21,990/-*
590 Ltr Side by Side Fridge Convertable. Offer Price ₹46,990/-*
Range Available from 190 Ltrs to 800 Ltrs
ON SIDE BY SIDE Upto 20% Cashback*
ON FROST FREE Upto 15% Cashback*
ON DIRECT COOL Upto 5% Cashback*
WASHING MACHINES
7.5 Kg. Fully Automatic Offer Price ₹13,990/-*
6 Kg. Front Load Offer Price ₹23,990/-*
Range Available from 6.5 kg to 14 kgs
ON FRONT LOAD Upto 15% Cashback*
ON TOP LOAD Upto 10% Cashback*
MOBILES
iPhone 17 Upto ₹6,000* Cash Back EMI ₹3,458/-*
Samsung S25 Ultra Upto ₹12,000* Cash Back EMI ₹4,770/-*
Vivo V60 Upto ₹3,500* Cash Back EMI ₹4,875/-*
Oppo F31 Pro+ Upto 10%* Cash Back EMI ₹4,125/-*
LAP TOPS
DELL lenovo hp ASUS
Upto ₹10,000* Cash Back + Extended Warranty starts from ₹99/-*
FREE BAG + MOUSE*
Range Starts from ₹29,990/-*
FOLLOW US
OUR STORES
₹0863-2268838 CUSTOMER CARE NUMBER
VIJAYAWADA
Main Road, Poranki ✆ 0866-2499008, 2499009
Bhavanipuram, Swathi Theatre Road, Sivalayam Center, ✆ 0866-2414193, 2414194
Eluru Road, Gunadala, VIJAYAWADA. ✆ 0866-2999922
MACHILIPATNAM Opp. Raithu Bazar ✆ 9182053171
TIRUVURU Ganesh Bomma Centre ✆ 8121437111
NUZIVIDU Main Road, Near Municipal Office, ✆ 7396476111
JAGGAYYAPETA Kodhada Road, Jaggayyapeta, ✆ 9642559111, 7396476111
KALYANI ADS